www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## శ్రీవారికి 121 కిలోల బంగారు కానుక!

ఎవరా భక్తుడు.. ఏమా విశేషం?

రూ.140 కోట్ల విలువైన భారీ కానుక

ఆధునిక చరిత్రలో ఇదే మొదటిసారి

టీటీడీ ఖజానాలో 10 వేల కిలోలకు పైగా స్వర్ణం

స్వామి అలంకరణకు 1100 స్వర్ణాభరణాలు



12

గురువారం | 21-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 127 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి మ.12.45 తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుష్యమి రా.12.09 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.8.21-9.55, దుర్ముహూర్తం: ఉ.10.13-11.03, మ.3.13-4.03, అమృతఘడియలు: సా.5.49-7.24, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.03, సూర్యాస్తమయం: 6.33 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# పదవీచ్యుతి బిల్లులపై గగ్గోలు

## అరెస్టైన పీఎం, సీఎం, మంత్రులను తొలగించే బిల్లులపై నిరసన

- లోక్‌సభలో 3 బిల్లుల్ని ప్రవేశపెట్టిన అమిత్‌షా
- మూజువాణి ఓటుతో జేపీసీకి నివేదన
- అవి దుర్మార్గం, క్రూరమంటూ ప్రతిపక్షాల ధ్వజం
- రాజ్యాంగం, సమాఖ్యపై దాడి అని ఆందోళన
- బిల్లు ప్రతుల్ని చింపి షాపైకి విసిరిన సభ్యులు
- షావైపు దూసుకెళ్లే యత్నం.. అడ్డుకున్న మార్షల్స్
- గుజరాత్ హోంమంత్రిగా అరెస్టైన అమిత్‌షా విలువలపై మాట్లాడటమేంటి?: వేణుగోపాల్
- నేను అరెస్టుకు ముందే రాజీనామా చేశా: షా
- మధ్యయుగాల నాటికి దేశం తిరోగమనం
- రాజ్యాంగంపై దాడి చేస్తున్నవారికి, రక్షిస్తున్న వారికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది: రాహుల్
- ఇది ప్రజాస్వామ్యంపై దాడి: వామపక్షాలు
- అవినీతిని కాపాడుకునేందుకే ప్రతిపక్షాల ప్రయత్నం.. బీజేపీ ప్రత్యారోపణ
- 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'కు ఆమోదం



అమిత్ షాపైకి బిల్లు ప్రతుల్ని చింపి విసిరిన దృశ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: తీవ్ర నేరారోపణలతో అరెస్టయితే ప్రధాని, సీఎంలు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లులపై లోక్‌సభ అట్టుడికింది. దీనికి సంబంధించిన మూడు బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బుధవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వెంటనే ఆ బిల్లులు దుర్మార్గం, క్రూరమైనవంటూ ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో నిరసనకు దిగాయి. సభా కార్యకలాపాలను స్తంభింపజేశాయి. కొందరు ఎంపీలు

మిగతా 2వ పేజీలో...



## చంద్రబాబుకు రోబో స్వాగతం

ముఖ్యమంత్రి కార్యక్రమం అనగానే.. అధికారులు, నాయకుల హడావుడి, ప్రొటోకాల్, స్వాగత ఏర్పాట్లు మామూలుగా ఉండవు. ఇది అందరికీ తెలిసిన సంగతే. అయితే సీఎం చంద్రబాబుకు ఊహించని, వినూత్న స్వాగతం లభించింది. జాగిలం ఆకారంలో ఉన్న ఓ రోబో ఆయనకు ఎదురుగా వచ్చి ఇలా హాయ్ చెప్పి, వెనుక కాళ్లపై లేచి నిల్చుని నమస్కారం చేసింది. రోబోను చూసి ముచ్చటపడ్డ చంద్రబాబు కూడా సంతోషంతో ప్రతి నమస్కారం చేశారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్‌లో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఆసక్తికర దృశ్యం కనిపించింది. ఈ కార్యక్రమంలో వివిధ ఆవిష్కరణలను ముఖ్యమంత్రి తిలకించారు.

## మార్చి నాటికి 10 లక్షల ఇళ్లు

- వచ్చే నెలలో 3 లక్షల సామూహిక గృహ ప్రవేశాలు
- సంక్రాంతి నాటికి లబ్ధిదారులకు మరో 2 లక్షల ఇళ్లు
- ఇళ్లు లేని పేదల గుర్తింపునకు 15 రోజుల్లోగా సర్వే
- పెద్ద కుటుంబాల వారికి ఉమ్మడి గృహాల నిర్మాణం
- గృహ నిర్మాణ శాఖపై సమీక్షలో సీఎం ఆదేశాలు

13

# ఆవిష్కరణ @ ఆంధ్రా



## అమరావతి సహా 6చోట్ల టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ప్రారంభం

### క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధతో ప్రపంచ పటంలో అమరావతిని నిలుపుతా

### స్టార్టప్‌లకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఊతం

- అమరావతిలో ఇన్నోవేషన్ హబ్‌కు సీఎం శ్రీకారం
- విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, రాజమండ్రి విజయవాడల్లోనూ ప్రాంతీయ ఇన్నోవేషన్ హబ్‌లు
- బాబు దార్శనికతతో హబ్‌కు రూపం: చంద్రశేఖరన్
- 175 నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తాం
- పీ-4 కింద పేదరిక నిర్మూలనకు ప్రయత్నం: సీఎం
- ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌ల కోసం 24 గంటల్లోనే 1,67,321 రిజిస్ట్రేషన్లు
- తొలి రోజే గిన్నిస్ రికార్డు నమోదు

## విశాఖలో డేటా సెంటర్

- కేంద్రం సహకరిస్తుంది
- ఏపీతో చర్చలు జరుపుతున్నాం
- లోక్‌సభలో అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

12

అమరావతి/మంగళగిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధతో అమరావతి నగరాన్ని ప్రపంచ పటంలో ఉంచుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సృజనాత్మక ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్‌పార్క్‌లో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రతన్‌టాటా ఆలోచనలను సజీవంగా ఉంచాలన్న సంకల్పంతో రాష్ట్రంలో ఆయన పేరిట ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించామన్నారు. అదేవిధంగా విశాఖ, తిరుపతి, అనంతపురం, రాజమండ్రి, విజయవాడల్లో

మిగతా 13వ పేజీలో...

నాన్న కూడా విజయవంతమైన పారిశ్రామికవేత్తే: లోకేశ్

## అమరావతిలో హడ్కో కన్వెన్షన్ సెంటర్

- అంతర్జాతీయ ప్రమాణాలతో పదెకరాల్లో నిర్మాణం
- ఎకరానికి రూ.4 కోట్లు చొప్పున చెల్లించేలా ఒప్పందం
- ఇండియా హ్యాబిటేట్ సెంటర్ స్థాయిలో కార్యాలయం

11



2

ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలు

## గవర్నర్ల దయాదాక్షిణ్యాలపై నడవాలా?

- ఇష్టానుసారంగా బిల్లులను తొక్కిపెట్టవచ్చా?
- రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇన్నేళ్లుగా మన దేశ నిర్మాతల ఆకాంక్షలను నెరవేరుస్తున్నారా?
- కేంద్రానికి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రశ్నలు

## వీలైనంత త్వరగా సరిహద్దుల పరిష్కారం!

- 2005 నాటి ఒప్పందం వెలుగులో కసరత్తు.. నిపుణుల బృందం ఏర్పాటు
- వాణిజ్యం, విమాన సేవలు పునఃప్రారంభం
- కైలాస పర్వతం, మానస సరోవరం సందర్శనకు వీలుగా మరిన్ని చర్యలు
- భారత్-చైనా సంయుక్త నిర్ణయాలు

2

# ఎమ్మెల్యే బుడ్డా ఆటవిక దాడి

- చెక్‌పోస్టు గేటు తీయలేదని అటవీ శాఖ సిబ్బందిపై ఆగ్రహావేశాలు
- ఫారెస్టు పెట్రోలింగ్ ఉద్యోగులపై జులుం.. అనుచరులతో కలిసి భౌతిక దాడి
- ఫారెస్టు వాహనంలోకి ఎక్కించి చిత్రహింసలు.. స్వయంగా నడుపుతూ చక్కర్లు
- శ్రీశైలంలో ఘటన.. బాధితుల ఫిర్యాదుపై కేసు నమోదు

నంద్యాల, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ సిబ్బందిపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దాడి చేశారు. తన కోసం ఫారెస్టు చెక్‌పోస్టు గేటు తీయలేదని, పిలవగానే దగ్గరకు రాలేదంటూ ఆగ్రహావేశాలు వెళ్లగక్కారు. అంతే ఆవేశంతో, అక్కడికి దగ్గరలోని ఫారెస్టు పెట్రోలింగ్ సిబ్బందిని పిలిపించి వారిపై జులుం ప్రదర్శించారు. వారిని బలవంతంగా పెట్రోలింగ్ వాహనంలోకి ఎక్కించి చిత్రహింసలు పెట్టారు. ఆ వాహనాన్ని ఎమ్మెల్యే స్వయంగా నడిపారు. తన అనుచరులతో కలిసి చెక్‌పోస్టు వద్ద బీభత్సం సృష్టించారు. బుధవారం ఈ

మిగతా 12వ పేజీలో...



విధుల్లో ఉన్న అటవీ శాఖ సిబ్బందిపై దాడికి పాల్పడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

## ఎమ్మెల్యేపై సీఎం ఆగ్రహం

- అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న చంద్రబాబు
- విచారణకు ఆదేశించా: డిప్యూటీ సీఎం పవన్
- తక్షణ చర్యలకు ఉద్యోగుల డిమాండ్

## పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి

- వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలి
- గత డీఏ, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి
- ఏ ఉద్యోగికి ఎంత బాకీ పడ్డారో చెప్పాలి
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలివ్వాలి
- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతల వినతులు
- ఆర్థిక అంశాలన్నీ సీఎం దృష్టికి తీసుకెళ్తాం
- సమస్యల పరిష్కారానికి కృషి: సీఎస్ హామీ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): "12వ వేతన సంఘం(పీఆర్‌సీ) కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలి, మధ్యంతర భృతి(ఐఆర్) తక్షణమే ప్రకటించాలి. పెండింగ్‌లో ఉన్న 3 డీఏల్లో 2 వెంటనే ఇవ్వాలి." అని పలు ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి విన్నవించారు. అదేవిధంగా 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను కూడా చెల్లించాలని కోరారు. ఏ ఉద్యోగికి ఎంత బకాయి ఉందో పే-స్లిప్పుల్లో పేర్కొనాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థికేతర, ఆర్థిక సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం అమరావతి సచివాలయంలో

మిగతా 13వ పేజీలో...



నెల్లూరు కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పరిచేందుకు అరుణను తీసుకెళ్తున్న పోలీసులు

12

# నెల్లూరు కి'లేడీ' అరుణ అరెస్టు

- ముగ్గురు అనుచరులు కూడా.. బిల్డర్ ఫిర్యాదుతో పోలీసుల చర్యలు
- ఇల్లు రాసిస్తావా.. చస్తావా అంటూ అరుణ బెదిరింపులు
- వైసీపీ హయాంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- పైగా బిల్డర్‌పైనే ఎస్సీ, ఎస్టీ కేసు.. మళ్లీ ఇప్పుడు ఫిర్యాదు ఇవ్వడంతో రంగంలోకి దిగిన పోలీసు ఉన్నతాధికారులు
- అరెస్టు భయంతో సోషల్ మీడియాలో అరుణ వరుస వీడియోలు
- హైదరాబాద్ పారిపోయేందుకు యత్నం
- అద్దంకి వద్ద అదుపులోకి తీసుకున్న కోవూరు పోలీసులు!
- శ్రీకాంత్‌కు సహకరించిన ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బంది సస్పెన్షన్

# అందరివాడిని

## ఏ పార్టీకీ చెందిన వ్యక్తిని కాదు.. ఉప రాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతం

- దేశంలో 64 శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు నాకు మద్దతునిస్తున్నాయి
- అర్హుడినే ఎన్నుకోవాలని ఎన్డీఏనూ కోరుతున్నా
- రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత నిర్వర్తించా
- కొత్త ఓటర్లను చేర్చుకోవాల్సిన ఎన్నికల కమిషన్ ప్రస్తుతం ఉన్న ఓటర్లను తొలగిస్తోంది

14

'ఆంధ్రజ్యోతి'తో ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి



జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సన్మాన కార్యక్రమంలో ఖర్గే, సోనియా, రాహుల్

## సుదర్శన్‌రెడ్డికి 'ఇండియా' ఎంపీల సన్మానం

నేడు నామినేషన్

## ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

## పెండింగ్ 'ఉపాధి' బిల్లులకు మోక్షం

- 2014-19లో చేసిన పనులకు తాజాగా 145 కోట్ల విడుదలకు రెడీ
- కాంట్రాక్టర్ల ఖాతాల్లో ఎల్లుండి నిధులు జమ

13



2

## ఆరుగురు చిన్నారులను మింగిన నీటికుంట

## టీచర్లకు అంతర్‌జిల్లాల బదిలీలు

14

- షెడ్యూలు, మార్గదర్శకాలు విడుదల
- 24 వరకు దరఖాస్తులు
- 30 తర్వాత బదిలీల ఆదేశాలు
- నేడు డీఎస్సీ మెరిట్ లిస్ట్ విడుదల!



రోమన్ బబుష్కిన్

# భారత ఉత్పత్తులు మేం కొంటాం

## రష్యా చమురు కొనొద్దంటూ భారత్‌పై అమెరికా ఆంక్షలు విధించడం అన్యాయం, ఏకపక్షం

- ఈ ఏడాది చివర్లో మోదీ-పుతిన్ భేటీ: రష్యా ఎంబసీ అధికారి రోమన్ బబుష్కిన్
- భారత్‌కు చమురుపై 5 శాతం రాయితీ ఇస్తాం.. రష్యా వాణిజ్య ప్రతినిధి ఇవ్‌జెనీ వెల్లడి
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకే భారత్‌పై సుంకాలు: వైట్‌హౌస్ సెక్రటరీ
- భారత్‌లోని కొన్ని సంపన్న కుటుంబాలు రష్యా చమురు అమ్మి లాభపడుతున్నాయి
- భారత్ కొనుగోళ్లలో 42 శాతం రష్యా నుంచే: అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్

న్యూఢిల్లీ, ఆగస్టు 20: రష్యా చమురు కొనొద్దంటూ భారత్‌పై ఒత్తిడి తేవడం అన్యాయం, ఏకపక్షమని.. భారత్‌లో రష్యా రాయబార కార్యాలయ సీనియర్ అధికారి రోమన్ బబుష్కిన్ అన్నారు. ఏకపక్ష నిర్ణయాలు ఎప్పుడైనా సరఫరా చైన్లను దెబ్బతీస్తాయని.. అభివృద్ధి చెందుతున్న దేశాల ఇంధన భద్రతను అవి ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు. భారత్‌పై అమెరికా విధిస్తున్న సుంకాల కారణంగా ఏవైనా సవాళ్లు ఎదురైతే.. వాటిని ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. "అధిక సుంకాల కారణంగా భారత ఉత్పత్తులు అమెరికాకు వెళ్లలేకపోతే.. వాటికి రష్యన్ మార్కెట్లు స్వాగతం పలుకుతాయి" అని బబుష్కిన్ భరోసా ఇచ్చారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.7 లక్షల కోట్ల)కు పెంచేందుకు ఇరుదేశాలూ కట్టుబడి ఉన్నాయని .. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ తగ్గిస్తుందని

మిగతా 2వ పేజీలో...

## 'వ్యూహం' నిర్మాత దాసరి కిరణ్ అరెస్టు



- సినిమా కోసం బంధువు వద్ద 4.5 కోట్ల అప్పు
- డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు అనుచరులతో దాడి
- బాధితుని ఫిర్యాదుతో కిరణ్‌పై కేసు..

11

- హైదరాబాద్‌లో అరెస్ట్.. అదుపులో మరో నలుగురు అనుచరులూ

# ఢిల్లీ సీఎంపై దాడి

- రేఖాగుప్తా చెంపపై కొట్టి, జుట్టు పట్టి లాగిన గుజరాత్ వాసి రాజేశ్ సకారియా
- ముఖ్యమంత్రి ప్రజాదర్బార్‌లో ఘటన
- రేఖ చెయ్యి, భుజం, తలకు గాయాలు
- సకారియాపై హత్యాయత్నం కేసు నమోదు
- దాడిని ఖండించిన రాజకీయ పక్షాలు
- వీధి కుక్కలపై సుప్రీం తీర్పు మీద నిరసన తెలిపేందుకే ఢిల్లీ వెళ్లాడు: సకారియా తల్లి



ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా (ఫైల్); దాడి చేసిన నిందితుడు రాజేశ్ సకారియా

2

## ఎన్నికైన రాష్ట్రప్రభుత్వాలు.. గవర్నర్ల దయాదాక్షిణ్యాలపై నడవాలా?

» వారికేమైనా సంపూర్ణ అధికారాలు ఉన్నాయా?

» కేంద్రానికి రాజ్యాంగ ధర్మాసనం ప్రశ్నలు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలు.. గవర్నర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పనిచేయాలా అని సుప్రీంకోర్టు కేంద్ర సర్కారును ప్రశ్నించింది. ఇష్టానుసారంగా ఆయన బిల్లులను తొక్కిపెట్టి వాటిని విఫలం చేయొచ్చా అని నిలదీసింది. బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి, గవర్నర్లకు నిర్దిష్ట కాలవ్యవధిని సుప్రీంకోర్టు నిర్దేశించవచ్చా అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143(1) అధికరణ కింద సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయాన్ని తెలుసుకోగోరిన సంగతి తెలిసిందే. దానిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. బుధవారం విచారణ కొనసాగించింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం.. రాష్ట్రప్రభుత్వం పంపే బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ పెండింగ్‌లో పెడితే.. అవి మురిగిపోయినట్లేనని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. అయితే ఎన్నికైన ప్రభుత్వాల వినతులను (బిల్లులను) తేల్చకుండా పెండింగ్‌లో ఉంచే సంపూర్ణ అధికారాలను గవర్నర్లకు ఇచ్చారా అని ఆయన్ను చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. 'గవర్నర్లు బిల్లులను పక్కనపెట్టేస్తే.. మెజారిటీ సంఖ్యాబలంతో ఏర్పడిన ప్రభుత్వాలు వారి ఇష్టాయిష్టాలపై ఆధారపడాలా? రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్ల నడుమ అసలు సామరస్యం ఉందా' అని అడిగారు. దీనికి తుషార్ మెహతా సమాధానమిస్తూ.. గవర్నర్ బిల్లులను ఆమోదించకపోవడం అత్యంత అరుదైన విషయమని, రాష్ట్ర బిల్లు దేశ ప్రజాస్వామ్య సంకల్పానికి విరుద్ధంగా ఉన్నప్పుడు.. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా ఉన్నప్పుడు.. ప్రస్తుత కేంద్ర చట్టానికి విరుద్ధంగా ఉన్నప్పుడు ఆమోదించకుండా నిలిపివేయవచ్చని పేర్కొన్నారు. ఈ దశలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ జోక్యం చేసుకుని.. బిల్లును మురిగిపోయేలా చేసే అధికారం గవర్నర్‌కు ఉన్నట్లయితే.. ఇదే లాజిక్ 111వ అధికరణ కింద భారత రాష్ట్రపతికి కూడా వర్తిస్తుందని.. పార్లమెంటు ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా రాష్ట్రపతి కూడా నిలిపివేయవచ్చని తెలిపారు. గవర్నర్లు అప్రధాన వ్యక్తులు కాదని.. వారు కేంద్ర కేబినెట్ సలహా సహకారాలతో వ్యవహరించే రాష్ట్రపతికి ప్రతినిధులని మెహతా గుర్తుచేశారు. గవర్నర్‌గిరీ అనేది రిటైర్డ్ రాజకీయ నాయకులకు స్వర్గధామం వంటిది కాదని తెలిపారు. జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుని.. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇన్నేళ్లుగా మన దేశ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చుతున్నారా అని ప్రశ్నించారు. గవర్నర్లు, ఎన్నికైన ప్రభుత్వాలు సామరస్యంగా మెలగాల్సి ఉందని.. అలా ఉంటున్నారా అని అడిగారు. రాజ్యాంగ ధర్మాసనం విచారణ గురువారం కొనసాగనుంది.

## వీలైనంత త్వరగా సరిహద్దుల పరిష్కారం!

» దానికోసం నిపుణుల బృందం... భారత్-చైనా నిర్ణయం

న్యూఢిల్లీ, బీజింగ్, ఆగస్టు 20: సరిహద్దు పునర్విభజన సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని, ఈ మేరకు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని భారత్-చైనా సంయుక్తంగా నిర్ణయించాయి. చైనా విదేశాంగమంత్రి వాంగ్‌యీతో ప్రధాని మోదీ, విదేశాంగమంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మంగళవారం సమావేశమైన అనంతరం విదేశాంగశాఖ ఒక ప్రకటన జారీ చేసింది. ఇరుదేశాల మధ్య లిపులేఖ్ పాస్, షిప్కీ లా, నాథూ లా కేంద్రాల ద్వారా సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించనున్నారు. మరోవైపు, రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సేవలను కూడా తిరిగి ప్రారంభించాలని, వీసాలను జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కైలాస పర్వతాన్ని, మానస సరోవరాన్ని మరింత మంది భారతీయ భక్తులు, యాత్రికులు సందర్శించుకునేలా వీలు కల్పించాలని తీర్మానించారు.

## సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 20 : ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎన్డీఏ అభ్యర్థి అయిన సీపీ రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ కార్యదర్శి జనరల్ పీసీ మోడీకి రాధాకృష్ణన్ తరఫున ప్రధాని మోదీ నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేడీ(యూ) నేత రాజీవ్ రంజన్ సింగ్ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అంతకుముందు పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని ప్రేరణ స్థల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి రాధాకృష్ణన్ నివాళులర్పించారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబరు 9న జరగనుంది.

## రాజ్యాంగ రక్షణ పోరాటంలో భాగంగానే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎంపిక: రాహుల్

» సుదర్శన్‌రెడ్డికి ఇండీ కూటమి సన్మానం.. నేడు నామినేషన్



న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ఎంచుకోవడం రాజ్యాంగాన్ని రక్షించేందుకు జరుగుతున్న పోరాటమేనని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఐదు దశాబ్దాలకుపైగా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్నారని తెలిపారు. ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ప్రతిపక్షాలు నిర్ణయించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బుధవారం ఇండియా కూటమికి చెందిన ఎంపీలు పార్లమెంట్ సెంట్రల్ హాలులో సత్కరించారు. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత, రాజ్యాంగ విలువలపై సుదర్శన్‌రెడ్డి సుమారు అరగంటసేపు చేసిన ప్రసంగం సభ్యులను ఆకట్టుకుంది. కాగా ఆయన గురువారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

## మహారాష్ట్రలో సెఫాలజిస్టు సంజయ్‌పై రెండు కేసులు



నాగ్‌పూర్/ ముంబై, ఆగస్టు 20: మహారాష్ట్ర ఎన్నికల ఓటర్ల జాబితాలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేశారంటూ సెఫాలజిస్టు సంజయ్‌కుమార్‌పై ఆ రాష్ట్ర పోలీసులు 2 కేసులు నమోదు చేశారు. హింగ్నా, దేవ్‌లలి నియోజకవర్గాల్లో 2024 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే.. అసెంబ్లీ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య తగ్గిపోయిందంటూ ఆయన కొన్నిరోజుల క్రితం 'ఎక్స్'లో పోస్టుపెట్టారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగింది. ఈసీ, బీజేపీపై 'ఓటు చోరీ' ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఈ డేటాను ఉదాహరణగా చూపాయి. అయితే తన డేటా విశ్లేషణలో పొరపాట్లు జరిగాయని, క్షమాపణ చెబుతున్నానంటూ సంజయ్‌కుమార్ మంగళవారం తన పోస్టు తొలగించారు.

## అఫ్ఘాన్‌లో బస్సు దగ్ధం.. 79 మంది దహనం

కాబూల్, ఆగస్టు 20: అఫ్ఘానిస్థాన్‌లోని హెరాత్ ప్రావిన్స్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 79 మంది సజీవ దహనమయ్యారు. వీరిలో 19 మంది పిల్లలు ఉన్నారు. మంగళవారం రాత్రి 8:30 గంటల సమయంలో, ఇరాన్ నుంచి వస్తున్న శరణార్థుల బస్సు ఒక ట్రక్కు, బైకును వేగంగా ఢీకొనడంతో ఈ విషాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న చాలా మంది సజీవ దహనమయ్యారు. మరికొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

# పదవీచ్యుతి బిల్లులపై గగ్గోలు

(మొదటిపేజీ తరువాయి)

బిల్లు ప్రతులను చింపి అమిత్‌షా వైపు విసిరారు. మరోవైపు బిల్లులకు మద్దతుగా ప్రతిపక్షాలను తప్పుపడుతూ అధికారపక్ష సభ్యులు నినాదాలకు దిగారు. దీనితో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కొందరు ప్రతిపక్ష సభ్యులు అమిత్‌షాను ఘెరావ్ చేసేందుకు దూసుకురాగా.. కేంద్ర మంత్రులు రవ్‌నీత్‌సింగ్ బిట్టూ, కిరణ్ రిజిజు అడ్డుగా నిలిచారు. వెంటనే మార్షల్స్ కూడా వచ్చి అమిత్‌షాకు రక్షణ వలయం ఏర్పాటుచేశారు. ఈ గందరగోళం మధ్య మూడు బిల్లులను మూజువాణి ఓటుతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి అప్పగిస్తున్నట్లుగా స్పీకర్ ప్రకటించారు. పార్లమెంటు తర్వాతి సమావేశాల్లో తొలివారం చివరిరోజున దీనిపై నివేదికను సమర్పించాలని సూచించారు. తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ మూడో వారంలో ప్రారంభంకావొచ్చని అంచనా. అప్పటికల్లా జేపీసీ నివేదికను సిద్ధం చేయాల్సి ఉంటుంది. జేపీసీలో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. ఐదేళ్లకు పైగా శిక్షపడే కేసుల్లో అరెస్టయి 30రోజులకుపైగా జైలులో ఉండే ప్రధాని, సీఎంలు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులను.. 31వ రోజున ఆటోమేటిగ్గా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా మూడు బిల్లులను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రూపొందించింది. మూడు బిల్లులు ఒకే అంశానికి చెందినవే అయినా.. రాజ్యాంగంలోని విభిన్నమైన ఆర్టికల్స్‌ను సవరించేందుకు వీలుగా కేంద్రం, రాష్ట్రాలకు సంబంధించి 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించి మరో బిల్లు, జమ్మూకశ్మీర్‌కు సంబంధించి మూడో బిల్లు సిద్ధం చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులు రాజ్యాంగానికి, సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని ప్రతిపక్షాల నేతలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే కేంద్రం ఈ బిల్లులను తీసుకొచ్చిందని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. సాధారణంగా నేరం రుజువయ్యే వరకు ఎవరైనా నిర్దోషులేనని, కానీ కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులు ఈ సహజ న్యాయానికి విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ పేర్కొన్నారు. కీలకమైన బిల్లు ప్రతులను సభ్యులకు అందజేయకుండా హడావుడిగా లోక్‌సభలో ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏమిటని ఆర్ఎస్పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ నిలదీశారు. పార్లమెంటు సమావేశాలు ముగిసే ముందు హడావుడిగా బిల్లులను ప్రవేశపెట్టడం ఏమిటని కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. గతంలో గుజరాత్ రాష్ట్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు అరెస్టయిన అమిత్‌షా.. ఇప్పుడు రాజకీయాల్లో నైతికతపై మాట్లాడుతూ, బిల్లులు ప్రవేశపెట్టడం ఏమిటని విమర్శించారు.



అమిత్ షా లోక్‌సభలో బిల్లులను ప్రవేశ పెడుతున్న సమయంలో ఎన్డీయే కూటమి ఎంపీల హర్షం

### ఇది ప్రజాస్వామ్యంపై దాడి: వామపక్షాలు

పదవుల నుంచి తొలగింపు బిల్లులు దేశ ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థలకు గొడ్డలిపెట్టు అని వామపక్షాలు మండిపడ్డాయి. "ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడిని అడ్డుకునేందుకు అందరూ కలిసి రావాలి" అని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ప్రజలు ఎన్నుకున్న సీఎం, మంత్రులను తొలగించడమంటే.. రాష్ట్రాలను ఎవరు పాలించాలనేదానిపై కేంద్రం పెత్తనమేనని, ఇది సమాఖ్య విధానానికి విరుద్ధమని సీపీఐ ఎంపీ సందోష్‌కుమార్ విమర్శించారు. కాగా, బీజేపీ ఓట్ల చోరీ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చేసే ప్రయత్నమని తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ విమర్శించారు. తమ అవినీతిని, అవినీతి నేతలను కాపాడుకునేందుకే ప్రతిపక్షాలు కేంద్రం తెచ్చిన మూడు బిల్లులను తప్పుపడుతున్నాయని బీజేపీ మండిపడింది.

### 'పదవుల తొలగింపు' బిల్లులేంటి?

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. రెండేళ్లు, అంతకంటే ఎక్కువ శిక్షపడిన ప్రజాప్రతినిధులను పదవుల నుంచి తొలగించవచ్చు. కేసులు నమోదవడం, జైలులో ఉండటం వల్ల పదవుల నుంచి తప్పుకోవాలన్న నిబంధన ఏదీ లేదు. ఢిల్లీ సీఎంగా ఉన్నప్పుడు కేజ్రీవాల్ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి జైలుకు వెళ్లారు. జైలులో ఉన్న 6నెలల పాటు కూడా ఆయన సీఎంగానే కొనసాగారు. ఇటీవల తమిళనాడు మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీ అరెస్టయి జైలులో ఉన్నా పదవిలో కొనసాగారు. సుప్రీంకోర్టు తప్పుబట్టడంతో పదవి నుంచి తప్పుకొన్నారు. ఈ క్రమంలోనే కీలక పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధుల అవినీతిని నిరోధించడానికంటూ కేంద్రం 3బిల్లులు తీసుకొచ్చింది. వీటి ప్రకారం.. కనీసం ఐదేళ్లు, ఆపై శిక్షపడే నేరారోపణలపై అరెస్టయి 30రోజులకుపైగా జైలులో ఉన్న పీఎం, సీఎం, కేంద్ర, రాష్ట్రాల మంత్రులు 31వ రోజున ఆటోమేటిగ్గా పదవి కోల్పోతారు. అయితే జైలు నుంచి విడుదలైన తర్వాత నిబంధనల మేరకు తిరిగి ఆయా పదవులను చేపట్టవచ్చు.


### మధ్యయుగాలకు తిరోగమిస్తున్నాం: రాహుల్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను చూస్తుంటే దేశం మధ్యయుగాల నాటి రాచరికానికి తిరోగమిస్తున్నట్లు ఉందని రాహుల్ గాంధీ విమర్శించారు. పదవుల నుంచి తొలగింపు బిల్లులకు నిరసనగా ఆయన నలుపురంగు టీషర్టు ధరించి పార్లమెంటుకు వచ్చారు. "మనం మళ్లీ మధ్యయుగాల నాటికి తిరోగమిస్తున్నాం. ఎవరైనా తమ మాట వినకపోయినా, వారి ముఖం నచ్చకపోయినా సరే రాజులు వారిని తొలగించేవారు. ఇప్పుడు కూడా ఈడీని ప్రయోగించి, ఎవరినైనా అరెస్టు చేయవచ్చు. ప్రజాస్వామికంగా ఎన్నికైన వారిని 30 రోజుల్లో తప్పించేయవచ్చు" అని విమర్శించారు. ఇక కేంద్రం తెచ్చిన బిల్లులు అప్రజాస్వామికమని ప్రియాంక గాంధీ మండిపడ్డారు. అవినీతికి వ్యతిరేకంగా తెస్తున్నామని చెబుతూ ప్రజల కళ్లకు గంతలు కట్టాలని చూస్తున్నారని చెప్పారు. ఎవరైనా మంత్రిని, సీఎంను అరెస్టు చేసి 30 రోజులు జైలులో పెడితే.. వారి నేరమేదీ తేలకపోయినా, శిక్షపడకపోయినా కూడా పదవి నుంచి తొలగించడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొన్నారు.

### నేను అరెస్టుకు ముందే రాజీనామా చేశా: షా

ఈ బిల్లులను హడావుడిగా ఏమీ తీసుకురాలేదని, ప్రతిపక్షాల ఎంపీలు కూడా సభ్యులుగా ఉండే జేపీసీకి నివేదించామని అమిత్ షా చెప్పారు. బిల్లులపై ప్రతిపక్షాల అభ్యంతరాలు, సూచనలను జేపీసీకి ఇవ్వవచ్చని స్పష్టం చేశారు. కేసీ వేణుగోపాల్ విమర్శలను తిప్పికొడుతూ.. తనపై తప్పుడు ఆరోపణలతో కేసులు నమోదు చేశారని, అయినా నైతిక విలువలు పాటిస్తూ అరెస్టుకు ముందే గుజరాత్ హోంమంత్రి పదవికి రాజీనామా చేశానని అమిత్ షా చెప్పారు. కోర్టు నిర్దోషిగా తేల్చే వరకు కూడా ఎలాంటి పదవులు తీసుకోలేదని స్పష్టం చేశారు. తీవ్రమైన నేరారోపణలు ఉన్నా రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. గ్యాంగ్‌స్టర్ సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసుకు సంబంధించి 2010 జులైలో గుజరాత్ హోంమంత్రిగా ఉన్న అమిత్‌షాను సీబీఐ అరెస్టు చేసింది. కొంతకాలంపాటు సబర్మతి జైలులో ఉన్నారు. అయితే అమిత్‌షా నేరం చేశారనేందుకు ఆధారాలేమీ లేవని, ఆయన నిర్దోషి అని 2014 డిసెంబర్‌లో సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చింది.

## లోకం తీరు




## ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఆన్‌లైన్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ద ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025' పేరిట తీసుకొచ్చిన ఈ బిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు కొంత మంది బానిస కావడం, మనీ లాండరింగ్, ఆర్థిక మోసాల వంటివి ఇటీవల చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వీటికి చెక్ పెట్టేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. ఇందులో పేర్కొన్న నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందించే వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.కోటి దాకా జరిమానా విధిస్తారు. ఆన్‌లైన్ గేమ్స్ ప్రకటనల్లో భాగస్వాములకు సైతం రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల జరిమానా విధిస్తారు.

## ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు

» దిగ్విజయ్‌సింగ్ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ప్రైవేటు విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను తప్పనిసరి చేయడానికి పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ సారథ్యంలో విద్యపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం స్పష్టం చేసింది. ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీలకు చెందిన విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ పరంగా అనుమతించదగినదిగా పేర్కొంది. ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లో ఓబీసీలకు 27%, ఎస్సీలకు 15%, ఎస్టీలకు 7.5% రిజర్వేషన్లను కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది. ఈ మేరకు పార్లమెంట్‌కు కమిటీ తన నివేదికను సమర్పించింది.

## ఢిల్లీ సీఎంపై దాడి


» రేఖాగుప్తా చెంపపై కొట్టి, జుట్టు పట్టి లాగిన గుజరాత్ వాసి రాజేశ్ సకారియా

» ముఖ్యమంత్రి ప్రజాదర్బార్‌లో ఘటన

» రేఖ చెయ్యి, భుజం, తలకు గాయాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రతివారం నిర్వహించే 'జన్ సున్‌వాయి' (ప్రజాదర్బార్) కార్యక్రమంలో ఒక వ్యక్తి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. బుధవారం ఉదయం సివిల్ లైన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒక్కొక్కరు వచ్చి ఆమెకు తమ సమస్యలను విన్నవించుకుంటున్నారు. 8.15 గంటలకు ఓ వ్యక్తి తన వద్దనున్న కాగితాలను రేఖా గుప్తాకు అందించారు. వెంటనే అరుస్తూ ఆమెపై దాడి చేశాడు. చెయ్యి పట్టుకొని లాగి చెంపపై కొట్టాడు. తర్వాత జుట్టు పట్టుకొని లాగాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన వ్యక్తిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖిమ్జి భాయ్ సకారియా (41)గా గుర్తించారు. తన బంధువు జైల్లో ఉన్నారని, విడిపించాలంటూ పిటిషన్ ఇచ్చేందుకు వచ్చానని సకారియా చెప్పినట్టు తెలిసింది. సీఎంకు ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. కాగా, ఇది పక్కా ప్రణాళికతో జరిగిన దాడి అని సీఎం కార్యాలయం(సీఎంవో) ఓ ప్రకటనలో తెలిపింది. ఆమెను చంపే కుట్రగా అభివర్ణించింది. నిందితుడిపై హత్యాయత్నం సహా పలు అభియోగాలతో ఐదు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. ఘటనను ఆప్ నేత అర్వింద్ కేజ్రీవాల్ ఖండించారు. కాగా, వీధి కుక్కలపై సుప్రీం తీర్పుపై నిరసన తెలిపేందుకు తన కొడుకు సకారియా ఢిల్లీ వెళ్లినట్లు అతడి తల్లి భానుబెన్ రాజ్‌కోట్‌లో విలేకరులకు తెలిపారు. సకారియాకు కుక్కలంటే ఎంతో ఇష్టమన్నారు.

## అగ్ని-5 క్షిపణి పరీక్ష సక్సెస్



న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశ వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5ని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ఈ పరీక్ష చేపట్టినట్టు రక్షణ శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. స్ట్రాటెజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలో అగ్ని-5 క్షిపణి అన్ని సాంకేతిక, కార్యాచరణ పరిమితులను అందుకున్నట్టు ప్రకటించాయి. అగ్ని-5 అనేది డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధి చేసిన అణ్వాయుధ సామర్థ్యం కలిగిన మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. భారత్ వద్ద ఉన్న అగ్ని శ్రేణిలో ఇది అత్యంత అధునాతన మిస్సైల్. ఇది 5 వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను సైతం అలవోకగా ఛేదించగలదు.

# భారత ఉత్పత్తులు మేం కొంటాం

(మొదటిపేజీ తరువాయి)



బబుష్కిన్

తాము అనుకోవట్లేదని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ తిరస్కరించినా.. పాశ్చాత్యదేశాలు భారత్‌కు సమాన సహకారం అందించవని.. ఎందుకంటే అది వాటి స్వభావం కాదని.. ఇటీవలికాలంలో ఆ విషయం స్పష్టంగా వెల్లడైందని బబుష్కిన్ వ్యాఖ్యానించారు. భారతదేశం రష్యాకు ఎంతో ముఖ్యమని.. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని తామెప్పుడూ గౌరవిస్తామని.. క్లిష్టపరిస్థితుల్లో భారత్‌కు అండగా నిలవడానికి రష్యా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇండో-రష్యా సంబంధాలపై తమకు విశ్వాసం ఉందని, బయటి ఒత్తిళ్లు ఉన్నా రెండు దేశాల మధ్య ఇంధన సహకారం అలాగే కొనసాగుతుందని నమ్ముతున్నామని అన్నారు. ఇరుదేశాల మధ్య చమురు సరఫరా కొనసాగించడానికి కావాల్సిన విధానాలు ఇప్పటికే అమల్లో ఉన్నాయని.. వాణిజ్యపరంగా మిగిలిన అడ్డంకులను తొలగించుకుని, ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు రెండు దేశాలూ ప్రయత్నిస్తున్నాయని బబుష్కిన్ వివరించారు. అలాగే.. ఇండో-రష్యా-చైనా మధ్య సంబంధాలు సైతం ప్రాంతీయ భద్రతకు ఎంతో ముఖ్యమైనవని ఆయన వ్యాఖ్యానించారు. ఈమూడు దేశాల మధ్య త్రైపాక్షిక సమావేశం త్వరలో జరగాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది చివరికి.. మోదీ-పుతిన్ ఢిల్లీలో కలిసే అవకాశం ఉందని చెప్పారు. అయితే, ఈ భేటీకి సంబంధించి తేదీలు ఇంకా ఖరారు కాలేదని తెలిపారు. రష్యాను శిక్షించేందుకు ఆంక్షలు విధించిన దేశాలే ఇప్పుడు ఆ ఫలితాలను అనుభవిస్తున్నాయని పాశ్చాత్య దేశాలను ఉద్దేశించి ఆయన దెప్పిపొడిచారు. "పాశ్చాత్య దేశాలు నిన్ను విమర్శిస్తున్నాయంటే.. నువ్వు చేస్తున్నది సరైనదేనని అర్థం" అని వ్యాఖ్యానించారు. కాగా.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను ఆపడానికి అమెరికా సుంకాలతో ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తుంటే.. మరోవైపు రష్యా 5 శాతం రాయితీతో భారత్‌కు చమురు విక్రయించేందుకు సిద్ధమైంది. భారత్‌తో రష్యా వాణిజ్యానికి సంబంధించి ఉప ప్రతినిధి ఇవ్‌జెనీ గ్రివా ఈ విషయాన్ని మంగళవారం వెల్లడించారు. అయితే, ఈ రాయితీ ఇరు దేశాల వ్యాపారుల మధ్య చర్చలపై ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు.

### సంపన్న కుటుంబాలకే లాభం..

భారత్‌లోని కొన్ని అత్యంత సంపన్న కుటుంబాలు రష్యా చమురును అమ్మడం ద్వారా 16 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 1.39 లక్షల కోట్లు) మేర లాభపడ్డాయని.. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. భారత చమురు కొనుగోళ్లలో 42 శాతం రష్యా నుంచే ఉంటున్నాయని.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముందు ఈ కొనుగోళ్లు 1 శాతం మాత్రమే ఉండేవని సీఎన్‌బీసీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ధ్వజమెత్తారు. "చైనా కూడా రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పెంచింది కదా? మరి ఆ దేశంపై ట్రంప్ యంత్రాంగం ఎందుకు ఇదే తరహాలో సుంకాలు విధించట్లేదు?" అని ప్రశ్నించగా.. ఆ పరిస్థితి పూర్తిగా భిన్నమైనదని, చైనా చాలాకాలంగా రష్యా నుంచి చమురు కొంటోందని.. డ్రాగన్ కొనుగోళ్లు 13% నుంచి 16 శాతానికి మాత్రమే పెరిగాయని.. భారత్ తరహాలో ఆ దేశం రష్యా నుంచి చమురును కొనుగోలు చేసి లాభానికి అమ్ముకోవట్లేదని బెసెంట్ వివరణ ఇచ్చారు.

### అందుకే సుంకాలు..

రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడానికే భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కారొలిన్ లెవిట్ చెప్పారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆమె.. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న (రష్యా-ఉక్రెయిన్) యుద్ధాన్ని ఆపడానికి ట్రంప్ బలమైన ఒత్తిడి తీసుకొస్తున్నారని.. అందులో భాగంగానే భారత్‌పై ఆంక్షలు సహా పలు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. అంతే కాదు.. ఈ ఏడాది మేలో భారత్-పాక్ మధ్య జరిగిన ఘర్షణను ఆపడానికి కూడా ట్రంప్ వాణిజ్యాన్ని ఒక సాధనంగా వాడారని తెలిపారు. ట్రంప్ జోక్యం చేసుకోకపోయి ఉంటే ఆ ఘర్షణ అణుయుద్ధానికి దారితీసి ఉండేదన్నారు.

# చిన్నారుల ప్రాణాలు మింగిన నీటికుంట

» ఆరుగురు బాలుర జలసమాధి

» కర్నూలు జిల్లాలో మహా విషాదం

» చిగిలి గ్రామంలో ఎర్రగరుసు తవ్వకాలు

» ఆ గుంతల్లోకి భారీగా చేరిన వర్షపు నీరు

» బడి వదిలాక స్నానానికి వెళ్లిన చిన్నారులు

» ఒక్కొక్కరుగా నీట మునిగి మృత్యువాత

» గ్రామంలో అలుముకున్న విషాదం

» ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి





చిన్నారుల మృతదేహాల కోసం నీటికుంటలో గాలింపు, ఓ బాలుడి మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

కర్నూలు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నీటి కుంటే ప్రాణాలు మింగేస్తుందని ఆ చిన్నారులకు తెలియదు. కేరింతలు కొడుతూ దానిలో స్నానానికి దిగారు. ఒక్కొక్కరుగా మునిగిపోయి కాసేపటికే విగతజీవులయ్యారు. ఈ మహా విషాదం బుధవారం సాయంత్రం కర్నూలు జిల్లాలో జరిగింది. ఐదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఎర్రమట్టి (గరుసు) తవ్విన గుంతలో నిలిచిన వర్షపు నీటిలో మునిగి మృత్యుఒడి చేరారు. చిన్నారుల మృతితో ఆస్పరి మండలం చిగిలి గ్రామం శోకసంద్రంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. చిగిలిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎర్రబాట శశికుమార్ (10), ఎర్రబాట కిన్నెరసాయి (10), కేసరం సాయికిరణ్ (10), ఉప్పలపాటి బీమా (10), గడ్డ వినయ్ (10), షేక్ మహబూబ్ (10)తో పాటు దుర్గాప్రసాద్ ఐదో తరగతి చదువుతున్నారు. ఈ ఏడుగురు సాయంత్రం 3:35 గంటలకు పాఠశాల వదిలాక సరదాగా స్నానం చేద్దామని గ్రామానికి అర కిలో మీటరు దూరంలోని స్థానిక కొండల్లో ఎర్రమట్టి (గరుసు) తవ్వకాల వల్ల ఏర్పడ్డ గుంతల వద్దకు వెళ్లారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అక్కడి గుంతలన్నీ నీటితో నిండిపోయాయి. దుర్గాప్రసాద్ గట్టుపైనే నిల్చుండగా మిగిలిన ఆరుగురు చిన్నారులు ఓ నీటి కుంటలోకి దిగి మునిగిపోయారు. ఇది గమనించి గట్టుపై ఉన్న దుర్గాప్రసాద్ పరుగున వచ్చి ఊరి చివర ఉన్న గొర్రెల కాపరి చిన్నకు చెప్పాడు. అతను స్థానికంగా ఉన్న వడ్డే బాలరాజు, వీరశేఖర్‌ల విషయం చెప్పి అప్రమత్తం చేశాడు. వారు వెంటనే ఆ నీటి గుంత వద్దకు చేరుకున్నారు. అప్పటికే చిన్నారులు నీట మునిగిపోయారు. ఐదుగురు ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. కొన ఊపిరితో ఉన్న ఎర్రబాట కిన్నెరసాయిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. చిన్నారుల మృత్యువాతతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. విద్యార్థుల మృతి తెలిసి సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఆ చిన్నారుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ బాలుర మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాదు

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



శ్రీకాకుళం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా రెండు దశాబ్దాల కిందట అప్పటి ప్రధాన మంత్రి వాజపేయి ఆదుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గుర్తు చేశారు. బుధవారం శ్రీకాకుళంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'విశాఖ ఉక్కును ప్రైవేటు పరం కాకుండా ఎన్డీఏ హయాంలోనే 2004లో అప్పటి ప్రధాని వాజపేయి రూ.1,400 కోట్లు కేటాయించారు. అప్పటితో ప్రైవేటు పరం కాకుండా ఇన్నాళ్లు ఆగింది. మరలా ఇప్పుడు కూడా ఎన్డీఏ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. విశాఖ ఉక్కును 'సెయిల్'తో అనుసంధానం చేసేందుకు ప్రతిపాదన తీసుకువచ్చింది. స్టీల్ ప్లాంట్ విషయమై ఇప్పటికే నిర్మలాసీతారామన్‌తో కూటమి ప్రభుత్వం చర్చించింది. స్టీల్ ప్లాంట్ దేశంలోనే 9వ స్థానంలో ఉంది. పనితీరును మరింత మెరుగుపరిచి 7వ స్థానానికి తెచ్చేలా ప్రయత్నాలు మొదలయ్యాయి. స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల తొలగింపు అంటూ కమ్యూనిస్టులు వక్రంగా ఆలోచిస్తున్నారు. ఇందులో నిజం లేదు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటు పరంకాదు. దేశంలో బీజేపీ అన్ని వర్గాలకు ప్రాధాన్యమిస్తూ.. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఈనెల 30న స్ఫూర్తి పేరిట సదస్సు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో ఉన్న ప్రధాన సమస్యలను పర్యటనల ద్వారా గుర్తించాను. ఇవన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, అలాగే కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లాను.' అని పేర్కొన్నారు.

## వేడి పాలు మీదపడి చిన్నారి మృతి



శర్విల్ రెడ్డి

గుత్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వేడి పాలు మీద పడటంతో అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో ఓ చిన్నారి మృతి చెందాడు. గుత్తిలోని కోట వీధికి చెందిన ప్రతాప రెడ్డి, మేనక దంపతులకు కుమారుడు శర్విల్ రెడ్డి(15 నెలలు) ఉన్నాడు. వేడి చేసిన పాలను బుధవారం సాయంత్రం ఓ టేబుల్ మీద ఉంచగా బాలుడు ఆడుకుంటూ వెళ్లి ఆ గిన్నెను లాగడంతో ముఖం మీద పడ్డాయి. బాలుడిని తల్లిదండ్రులు వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిక్కుల్లో విశాఖ ఉక్కు!

**ప్లాంట్‌లో సగానికి తగ్గిన ఉత్పత్తి .. బ్లాస్ట్ ఫర్నేస్-2 పూర్తిగా మూసివేత.. ముగ్గురు విభాగాధిపతులు సస్పెన్షన్**

» ముడి పదార్థాల కొరతే కారణం

» ముందునుంచీ ఉద్యోగ, కార్మిక వర్గాలు చెబుతున్నా పట్టించుకోని యాజమాన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతోంది. ముడిపదార్థాల కొరత కారణంగా ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపలేకపోతున్నారు. మొత్తం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా రోజుకు 21 వేల టన్నుల హాట్ మెటల్ (లిక్విడ్ స్టీల్) ఉత్పత్తి చేయాల్సి ఉంది. గత నాలుగు రోజుల నుంచి ఇది తగ్గుతూ మంగళవారం నాటికి 10,180 టన్నులకు పడిపోయింది. అంటే సగానికి సగం ఉత్పత్తి తగ్గింది. రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి మంగళవారం పూర్తిగా నిలిచిపోయింది. ముడిపదార్థాల కొరత కారణంగా బ్లాస్ట్ ఫర్నేస్-3ని చాలాకాలం మూసేశారు. నిధులు అందుబాటులో లేకపోవడంతో ముడిసరుకు సమకూర్చుకోలేకపోయారు. కేంద్రం ఇచ్చిన రూ.11,440 కోట్లు, రాష్ట్రం అందించిన రూ.2,600 కోట్ల సాయంతో బ్యాంకుల రుణాలన్నీ తీర్చి, మళ్లీ క్రెడిట్ లెటర్లు తీసుకొని యాజమాన్యం ముడి సరుకు సమకూర్చుకుంది. వర్షాకాలం తరువాత బ్లాస్ట్ ఫర్నేస్-3ను పునఃప్రారంభించాల్సి ఉండగా ప్రస్తుత ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా ఎవరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా జూన్ 27నే పునఃప్రారంభించేశారు. ఆ ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్ ద్వారానే రోజుకు 9వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయవచ్చు. ఇప్పటివరకు స్టీల్ తయారీకి అవసరమైన సింటర్, కోక్‌ను ప్లాంటు స్వయంగా తయారు చేసుకునేది. దాని వల్ల ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండేది. ప్రస్తుత యాజమాన్యం కమీషన్లకు ఆశపడి సింటర్‌కు



స్టీల్ ప్లాంటులో మూతబడిన బ్లాస్ట్ ఫర్నేస్-2 (ఫైల్)

బదులు నేరుగా పెల్లెట్లను వినియోగిస్తోంది. ఇందుకోసం లక్షల టన్నుల్లో కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. దీంతో ఉత్పత్తి వ్యయం పెరిగింది. అదేవిధంగా కోక్ తయారీకి కోక్ ఓవెన్లు ఉండగా బయటనుంచి కొనడం ప్రారంభించింది. ఇది కూడా అదనపు భారంగా మారింది.

### కాంట్రాక్టు వర్కర్ల తొలగింపుతో నిలిచిన పనులు

ప్లాంటుకు అవసరమైన ముడి పదార్థాలను నిల్వ చేసి, అక్కడి నుంచి వివిధ విభాగాలకు కన్వేయర్ల ద్వారా సరఫరా చేసేందుకు రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్ఎంహెచ్‌పీ) ఉంది. ఈ కన్వేయర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో కన్వేయర్లు మొరాయించాయి. మరోవైపు ముడి పదార్థాల సరఫరా తగ్గిపోవడంతో ఉత్పత్తి పడిపోతూ వచ్చింది. మంగళవారం నాటికి బ్లాస్ట్ ఫర్నేస్-2 జీరో స్థాయికి పడిపోవడంతో దానిని మూసేశారు. ఈ విషయం తెలియడంతో సీఎండీ సక్సేనా మంగళవారం సాయంత్రం ఆర్ఎంహెచ్‌పీని తనిఖీ చేశారు. ఎలక్ట్రికల్, మెయింటెనెన్స్, ఆపరేషన్ విభాగాల అధిపతులను సస్పెండ్ చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్-3 పునఃప్రారంభానికి ముందునుంచి అన్ని విభాగాల్లో నిర్వహణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ఉద్యోగ, కార్మిక వర్గాలు సూచిస్తున్నా యాజమాన్యం మొండిగా వ్యవహరించింది. కాంట్రాక్టు వర్కర్లు ఎక్కువమంది ఉన్నారంటూ ఈ ఏడాది మే నెలలో 4,500 మందిని తొలగించింది. వారి స్థానంలో ఎటువంటి అనుభవం లేని ఒడిశా, జార్ఖండ్ వర్కర్లను తీసుకువచ్చి వారితో పనులు చేయిస్తోంది. దాంతో అనేక విభాగాల్లో నిర్వహణ సమస్యలొస్తున్నాయి. గత 3నెలల్లో మొత్తం 6వేల మందిని తీసేశారు. మిగిలిన ఉద్యోగులు, కార్మికులతో రోజుకు 12గంటలు పనిచేయిస్తున్నారు. జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. 330 శాతం జీతాలు బకాయి పెట్టారు. ఈ క్రమంలో యాజమాన్యానికి, ఉద్యోగ వర్గాల మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చడానికి ఎవరూ ప్రయత్నించడం లేదు. ఇది ప్లాంటు పనితీరుపై ప్రభావం చూపిస్తోంది.

### బ్లాస్ట్ ఫర్నేస్-3లో తగ్గిన ఉత్పత్తి

బ్లాస్ట్ ఫర్నేస్-3ని జూన్ 27న ప్రారంభించగా, జూలై మొదటి వారం నుంచి పూర్తిస్థాయి ఉత్పత్తికి వచ్చింది. గత నాలుగు రోజులుగా ముడిపదార్థాల కొరతతో అందులోనూ ఉత్పత్తి తగ్గిపోయింది. ఈ నెల 15న 7,406 టన్నులు, 16న 7,528, 17న 6,005, 18న 5,456, 19న 5,262 టన్నులు మాత్రమే ఉత్పత్తి వచ్చింది. పూర్తిస్థాయిలో ఉత్పత్తికి అవసరమైన ముడిపదార్థాలు సమకూర్చుకోకుండా బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రారంభించడం వల్లే ఇప్పుడు బ్లాస్ట్ ఫర్నేస్-2 మూతపడిందని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

## రిటైర్డ్ ఉద్యోగులకు మరో అవకాశం

» కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో రీ-అపాయింట్‌మెంట్

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను రీ-అపాయిం ట్‌మెంట్ పేరుతో తిరిగి సర్వీస్‌లోకి తీసుకునేం దుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిం ది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులను కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో తిరిగి రీ-అపాయిమెంట్ చేసి, వారి సేవలు ఉపయోగించుకోవాలని నిర్ణయించింది.















# భూమన గజదొంగ

**దర్శనం టికెట్లు అమ్ముకుని.. నాపై ఆరోపణలు చేస్తున్నారు.. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫైర్**

» పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే ఊరుకోం

» జగన్ మీడియాపై రూ.10 కోట్లకు పరువునష్టం దావా వేస్తున్నా

» జగన్, భారతీరెడ్డి తిరుమలకు వచ్చి తలనీలాలిచ్చి ప్రసాదాలు తింటారా?



హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరుడి సేవలో నిస్వార్థంగా పనిచేస్తున్న తమపై జగన్ మీడియా గజదొంగలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, 9 నెలల్లో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. తిరుమలేశుడి దర్శనం టికెట్లు అమ్ముకున్న గజదొంగ భూమన కరుణాకర్‌రెడ్డి.. తాను టికెట్లు అమ్ముకుంటున్నట్లు చిత్రీకరించడం హాస్యాస్పదమన్నారు. చైర్మన్‌గా తన కోటా వంద టికెట్లలో ఏ రోజునా 50 కూడా వాడలేదని స్పష్టంచేశారు. నాయుడు బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 'మీరు ఎవరితోనైనా పెట్టుకోండి.. బీఆర్ నాయుడితో మాత్రం కాదు. తప్పు చేస్తే చొక్కా పట్టుకుని అడగొచ్చు. కానీ పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే ఊరుకునేది లేదు. నాపై రాసిన వార్తలకు జగన్ మీడియాపై రూ.10 కోట్లకు పరువు నష్టం దావా వేస్తున్నా' అని ప్రకటించారు. జగన్, భారతీరెడ్డి, భూమన దేవాలయాలపై దాడులు చేస్తున్నారని.. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని, తప్పుడు ఆరోపణలతో బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. దమ్ముంటే జగన్, భారతిరెడ్డి తిరుమలకు వచ్చి తలనీలాలిచ్చి.. కోనేరులో స్నానం చేసి.. నామాలు పెట్టుకుని శ్రీవారిని దర్శించుకుని ప్రసాదాలు తినాలని బహిరంగ సవాల్ విసిరారు. వీళ్లు రారని, కన్వర్టెడ్ క్రిస్టియన్లు అని గుర్తుచేశారు. 'భూమన దోపిడీదొంగ. అవినీతి గురించి ఆయన మాట్లాడడమా? ఆయన, ఆయన కొడుకు చేయని దందాలే లేవు. గోవులను చంపించింది భూమన మేనమామ హరినాథ్‌రెడ్డి. ఆనాడు తొక్కిసలాటకు వీరే కారణం. భూమన రెండోసారి టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు రూ.1,600 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల పనులను కాంట్రాక్టర్లకు అప్పజెప్పి కమీషన్లు తీసుకున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసుకుని దేవుడి సొమ్ముతో రోడ్లు వేసుకున్నారు. ఎన్నో దందాలు చేసిన ఆయన త్వరలో జైలుకు వెళ్లక తప్పదు' అని చెప్పారు. టీటీడీలో 280 మంది అన్యమతస్థులు పని చేస్తున్నట్లు గుర్తించామని, వారంతట వారే వెళ్లిపోవడానికి అవకాశం కల్పిస్తున్నామని, ఇంకా 40, 50 మంది వెళ్లాల్సి ఉందని చెప్పారు.

### జగన్ మీడియాకు టీటీడీ చైర్మన్ లీగల్ నోటీసులు

తిరుమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తనపై తప్పుడు వార్తలు ప్రసారం చేసి, ప్రచురించినందుకు జగన్ మీడియాపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న సదరు మీడియా మేనేజ్‌మెంట్‌కు లీగల్ నోటీసులు పంపామని తెలిపారు. టీటీడీ బోర్డుకు రూ.10 కోట్ల పరిహారం చెల్లించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంకోవైపు.. టీటీడీ చైర్మన్ కార్యాలయ సిబ్బందిపై, టీటీడీ చైర్మన్‌పై బెదిరింపులకు దిగి బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ సూపరింటెండెంట్ ప్రసన్న కుమార్ ఈ నెల 3న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి వార్త నిర్వాహకుడు మాచర్ల శ్రీనివాసులుపై తిరుమల టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

## ఐదేళ్ల తర్వాత అంత్యక్రియలు..

» ఇన్నాళ్లూ బహ్రెయిన్‌లోనే ఇద్దరు తెలుగువారి మృతదేహాలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఏడడుగుల బంధం ఎడారి దేశాలకు వచ్చేసరికి ఎండమావిగా మారుతోంది. ఆర్థిక సమస్యల మధ్య కుటుంబ బంధాలు దూరమవుతున్నాయి. తమ వారి బంగారు భవిష్యత్తు కోసం సొంత ఊరిని వదిలి ఎడారి దేశాలకు వచ్చిన వారు.. ఇక్కడ రోడ్డు ప్రమాదాల రూపంలోనో, అనారోగ్యం కారణంగానో చనిపోతే.. వారి మృతదేహాలను తీసుకునేందుకు వారి కుటుంబ సభ్యులే ముందుకు రావడం లేదు. ఆర్థిక సమస్యల కారణంగా కొందరు.. కుటుంబ సభ్యులు పట్టించుకోక మరికొందరు బహ్రెయిన్‌లో అనాథ శవాలుగా పడి ఉన్నారు. అలాంటి ఇద్దరు ప్రవాసాంధ్ర మహిళల మృతదేహాలకు ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత బహ్రెయిన్‌లో దహన సంస్కారాలు జరిగాయి. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పరింపూడి గ్రామానికి చెందిన 32 ఏళ్ల కొరడా సత్యవతి 2020లో బహ్రెయిన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామానికి చెందిన 52 ఏళ్ల వల్లవాకాడ పైడమ్మ కూడా అదే ఏడాది గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. అయితే.. పేదరికం కారణంగా కుటుంబ సభ్యులు ఈ మృతదేహాలను స్వీకరించడానికి నిరాకరించారు. కనీసం స్థానికంగా దహన సంస్కారాలు నిర్వహించడానికి అవసరమైన అంగీకారపత్రాలు కూడా పంపించలేదు. దీంతో బహ్రెయిన్ ప్రభుత్వం వీరి మృతదేహాలను ఐదేళ్లుగా ఫ్రీజర్‌లోనే ఉంచింది. ఈ అంశాన్ని బహ్రెయిన్ ప్రభుత్వం భారత ఎంబసీ ద్వారా ఏపీ ఎన్నార్టీఎస్ సంస్థ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో బహ్రెయిన్‌లోని ప్రముఖ సామాజిక సేవకుడు దోర్నాల శివకుమార్ వారికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు చొరవ చూపారు. ఏపీ ఎన్నార్టీఎస్ చొరవతో ఆయా జిల్లాల కలెక్టర్లు మృతుల కుటుంబాలను సంప్రదించి అవసరమైన పత్రాలు పంపించారు. దీంతో ఈ ఇద్దరు పేద మహిళలకు శివకుమార్ అన్నీ తానై బుధవారం దహన సంస్కారాలు జరిపించారు.





## అంధుల క్రికెట్ పోటీలు ప్రారంభించిన జస్టిస్ కృష్ణమోహన్



అంధుల క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

గుంటూరు(క్రీడలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంధులు అవరోధాలను అధిగమిస్తూ, మిగిలిన వారి కంటే తాము తక్కువ కాదని నిరూపించి అందరికీ స్ఫూర్తిగా నిలవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ ఆకాంక్షించారు. గుంటూరు అరండల్‌పేటలోని పిచ్చుకల గుంట క్రికెట్ మైదానంలో బుధవారం ఆయన అంధుల క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్, విజువల్లి బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, డిఫరెంట్లీ లేబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈపోటీలు జరుగుతున్నాయి. గతంలో తిరుపతిలో జరిగిన జోనల్ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన 42 మంది క్రీడాకారులను 3 జట్లుగా విభజించి గుంటూరులో మూడు రోజులపాటు పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ అంధులు క్రీడల ద్వారా తమ ప్రతిభను వెలుగులోకి తెస్తున్నారన్నారు. అంతర్జాతీయ మాజీ క్రీడాకారుడు, అర్జున్ అవార్డు గ్రహీత అజయ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ బ్లైండ్ క్రికెట్ జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ల డైరెక్టర్ పి.ప్రకాష్‌రెడ్డి, ఎల్‌వీఆర్ క్లబ్ సెక్రటరి శ్రీనివాసరెడ్డి, ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ శరత్, వీసీఏ ప్రెసిడెంట్ రవీంద్రబాబు, బ్లైండ్ క్రికెట్ జిల్లా ఇన్చార్జ్ కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# ప్రత్యర్థులపై బ్రహ్మాస్త్రాలు

తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి, వరుసగా ముప్పైరోజులపాటు నిర్బంధంలో ఉంటే, మంత్రులను, ముఖ్యమంత్రులను, ఏకంగా ప్రధానిని సైతం పదవినుంచి తొలగించగల మహాశక్తివంతమైన మూడు బిల్లులను సభలో ప్రవేశపెడుతూ హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు, హితవులు అమితాసక్తికరంగా, ఉత్సాహభరితంగా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి బిల్లుల అవసరాన్ని, కారణాలను, లక్ష్యాలను ఆయన బహుచక్కగా వివరించారు. సామాన్యప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారని, సగటు మనిషి ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ఉన్నతమైన విలువలతో, ఆదర్శాలతో వ్యవహరించాల్సి ఉంటుందనీ, రేఖామాత్రంగా కూడా అనుమానానికి ఆస్కారం లేకుండా నడుచుకోవాల్సి ఉందని ఈ బిల్లులు ఆశిస్తున్నాయి. ప్రజల ఆశలకూ, ఆకాంక్షలకూ ప్రతీకలుగా, ప్రతినిధులుగా ఉంటున్నవారిమీద తీవ్రమైన నేరారోపణలు వచ్చి, వారు అరెస్టయిన పక్షంలో, రాజ్యాంగపరంగా వారిమీద ప్రజలు ఉంచిన విశ్వసనీయత కోల్పోయినందున, సదరు ప్రజాప్రతినిధులు తమకు తాముగా పదవుల నుంచి తప్పుకోవాలి, లేదా విధిగా తప్పించవలసి ఉంటుందని ఈ బిల్లులు ఘోషిస్తున్నాయి. రాజకీయం పాపపంకిలమూ అవినీతిమయమూ అయిపోయిన ఈ దేశంలో ఎంతో ఉన్నతమైన ఆశయాలూ లక్ష్యాలతో ప్రక్షాళనకు నడుంబిగిస్తున్న ఈ బిల్లులను విపక్షాలు మాత్రం కాదంటున్నాయి.

మచ్చపడితే, జైలుకెళితే ప్రధానినే దించేస్తానని శపథం చేస్తున్న బిల్లులను చూసి విపక్ష పార్టీలు, మరీముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ వొణికిపోతోంది. లోక్‌సభలో కాంగ్రెస్ వేణుగోపాల్ ఒకవైపు వాగ్బాణాలు సంధిస్తూంటే, తృణమూల్ ఎంపీలు బిల్లుప్రతులను చించి విసిరేశారు, హోంమంత్రి దగ్గరకు దూసుకొస్తున్న ప్రత్యర్థులను ఏకంగా మంత్రులే వెనక్కునెట్టవలసి వచ్చింది. సదరు బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమనీ, ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదకరమనీ ప్రత్యర్థులు మొత్తుకుంటున్నా, హోంమంత్రి తాను అన్నదీ, అనుకున్నదే చేశారు. లోక్‌సభనుంచి 21 మంది, రాజ్యసభ నుంచి పదిమంది కలగలిసిన సంయుక్త పార్లమెంటరీ విచారణ సంఘానికి ఈ బిల్లులు వెడతాయి. రాజకీయాలనుంచి నేరగాళ్ళను ఏరివేసే అతి ముఖ్యమైన బిల్లులు అయినందున కాబోలు, సదరు జెపీసీకి పెద్ద సమయం కూడా ఇవ్వలేదు. నవంబరు మూడోవారంలో జరిగే శీతాకాల సమావేశాల్లోగా అది తన నివేదికను సమర్పించాల్సి ఉంది.

ఈ బిల్లులు రాజకీయాల్లో నైతికతను ప్రతిష్ఠిస్తాయని బీజేపీ నేతలు అంటున్నారు. మీ ఏలుబడిలో రాజకీయమే తప్ప నైతికత ఉన్నదా అంటూ సదరు బిల్లుల దుర్వినియోగం భవిష్యత్తులో ఎన్నిరకాలుగా, ఏయే రూపాల్లో జరగవచ్చునో విపక్షనేతలు వివరిస్తున్నారు. 'ఏముందీ, ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను పిలుస్తాడు, కేసు కట్టమంటాడు, ప్రజలు జైకొట్టి ఘనంగా ఎన్నుకున్న ప్రజాప్రతినిధి కథ కూడా ముప్పైరోజుల్లోనే ముగిసిపోతుంది' అని రాహుల్ బిల్లుల లోగుట్టు ఇదేనంటూ ఒక్క ముక్కలో తేల్చేశారు.

బీజేపీ ప్రభుత్వం సద్బుద్ధితో ఈ బిల్లులను తేలేదని, విపక్షపార్టీల ప్రభుత్వాలను గవర్నర్ల ద్వారా వేధించుకుతింటున్న క్రమంలో, ఇప్పుడు తమకు గిట్టని ముఖ్యమంత్రుల మీద కేసులుకట్టి, 31వ రోజున ఆటోమేటిక్‌గా దించేసే ఎత్తుగడ ఇదని వారివాదన. ప్రధానమంత్రికీ, కేంద్రమంత్రులకు కూడా ఇవే నియమాలు వర్తిస్తున్నప్పటికీ, కేంద్రప్రభుత్వం అమ్ములపొదిలో ఉన్న ఈడీ, సీబీఐ ఇత్యాది ఏజెన్సీలేవీ వారికి వ్యతిరేకంగా వ్యవహరిస్తాయని ఎవరూ నమ్మరు. ఈ బ్రహ్మాస్త్రాలను ధరించిన కేంద్రం తనకు గిట్టని మంత్రులూ, ముఖ్యమంత్రుల పదవులను కేవలం నేరాభియోగంతో ఊడగొట్టవచ్చు. ఆదర్శవంతమైన రాజ్యంలో, సమస్త వ్యవస్థలూ స్వతంత్రంగా వ్యవహరించగలస్థితి ఉన్నప్పుడు ఇటువంటి బిల్లులను స్వాగతించవచ్చు. కానీ, స్వయంగా సర్వోన్నత న్యాయస్థానమే కేంద్రప్రభుత్వ ఏజెన్సీలను పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయంటూ తప్పుబడుతూ, మనీలాండరింగ్ చట్టాల వంటివి రాజకీయంగా దుర్వినియోగమవుతున్నాయని ఆక్షేపిస్తున్న స్థితిలో, దోష నిర్ధారణ జరగకుండా విపక్షనేతలు నెలలతరబడి జైళ్ళలో మగ్గే అవకాశాలే అధికం. వర్షాకాల సమావేశాలు ముగిసిపోతున్న ఆఖరుక్షణాల్లో, ఎజెండాలో లేని ఈ బిల్లులను హడావుడిగా సభలో ప్రవేశపెట్టడం ఆశ్చర్యమే. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, ట్రంప్ వ్యాఖ్యలు, బిహార్ సర్ సహా అనేక అంశాల్లో విపక్షాలు పాలకపక్షాన్ని ఆత్మరక్షణలోకి నెట్టేసిన నేపథ్యంలో, ఈ బిల్లులు దారిమళ్ళింపు చర్యగా ఉపకరించవచ్చు.

# సర్: సమస్యకు తప్పుడు పరిష్కారం!

ఓటర్ జాబితాలలోని సమస్యలకు ప్రత్యేక సమగ్ర సవరణే (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –ఎస్ఐఆర్) పరిష్కారమని భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పునరుద్ఘాటించారు. ఇది పాత వాదనే. అయితే బెంగళూరులోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో మోసాలను రాహుల్ గాంధీ బహిర్గతం చేసిన తరువాత ప్రత్యేక సమగ్ర సవరణే నిశ్చితమైన పరిష్కారమని సీఈసీ మరింతగా నొక్కి చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు వలలో పడ్డాడని బీజేపీ సామాజిక మాధ్యమాల గణాలు భావించాయి. ఓటర్ జాబితాలలోని లొసుగుల గురించి ఆయనెలా ఫిర్యాదు చేస్తున్నారు? వాటన్నిటినీ ప్రక్షాళన చేసేందుకే చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు ప్రతిపక్షనేత ఎందుకు మద్దతునివ్వడం లేదు? ఇత్యాది ప్రశ్నలు గుప్పించాయి. సీఈసీ సైతం ఇదే ఆలోచనాసరళిని అనుసరించారు. మూడు రోజుల క్రితం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు ఆ విషయాన్ని స్పష్టం చేసింది.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బహుశా, 'యస్ మినిస్టర్'ను చూసి ఉండకపోవచ్చు. ఆ సుప్రసిద్ధ రాజకీయ వ్యంగ్య ధారావాహిక ఆ అప్రమాణిక ఆలోచనా సరళిని 'రాజకీయవేత్త తర్క పద్ధతి' అని అభివర్ణించింది. అదిలా ఉంటుంది. 'మనం ఏదో ఒకటి చేయాలి; ఆ నిర్దిష్ట పని ఇదే; కనుక మనం దాన్ని చేయాలి'. ఒక మౌలిక ప్రశ్నను అడగకపోవడమే ఈ ఆలోచనా సరళిలోని తార్కిక దోషం: మనం చేయవలసిన ఆ 'ఏదో ఒకటి', మనం చేయవలసిన 'నిర్దిష్ట పని'గా మనకు సూచించినదేనా? రాహుల్ గాంధీని అపహసిస్తున్నవారు సరిగ్గా అడగని ప్రశ్న ఇదే: మనం చేయవలసిన పని 'ప్రత్యేక సమగ్ర సవరణ' ఓటర్ జాబితాలలోని లొసుగులు, మోసాలు, తప్పులను తొలగించేందుకు చేపట్టవలసిన 'నిర్దిష్ట చర్యేనా?' సమాధానమేమిటి? ఇదీ అని భావిస్తే సరిపోదు. మన ఓటర్ జాబితాలలోని సమస్యలకు ప్రత్యేక సమగ్ర సవరణ తప్పనిసరి, తగిన ఫలితాలనిచ్చే సరైన పరిష్కారమనే నమ్మకం దురదృష్టవశాత్తు ఎవరికీ కలగడం లేదు. అయినా సీఈసీ వాదనను, దానిలో తర్క బద్ధత ఉందని భావించి, నిశితంగా పరీక్షిద్దాం.

మన ఓటర్ జాబితాలలో తీవ్ర లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూ మన తార్కిక విమర్శను ప్రారంభిద్దాం. ఓటర్ జాబితాల 'సమగ్రత' విషయంలో భారత ఎన్నికల వ్యవస్థ ప్రశస్తంగా ఉందనడంలో సందేహం లేదు. అయితే ఆ జాబితాల 'కచ్చితత్వం' లేదా 'నిర్దుష్టత' ఉండవలసిన రీతిలో లేదనేది ఒక వాస్తవం. ఇదేమీ కొత్త సమస్యకాదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల ఓటర్ జాబితాలలో కచ్చితత్వం ఉండవలసిన రీతిలో ఉండడం లేదు. ఆ జాబితాలలో మార్పులు, చేర్పుల విషయమై ఆరోపణలు పెద్దగా లేకపోవడం వల్ల వాటిలో కచ్చితత్వం తక్కువగా ఉందన్న వాస్తవం ప్రజల దృష్టికి రాలేదు. మహారాష్ట్ర, మహదేవపురలో ఓటర్ జాబితాలలోని మోసాలను బహిర్గతం చేసిన తరువాత ఆ తీవ్ర లోపం దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి వచ్చింది.

ఓటర్ జాబితాలలో లొసుగులు, లోపాలు తొలగించేందుకు ఎన్నికల సంఘం గత కొద్ది సంవత్సరాలుగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్న సీఈసీ వాదనను కూడా అంగీకరిద్దాం. యథాలాపంగాచేసే ఓటర్ జాబితాల సవరణ పరిష్కారం కాదు, కాబోదు. ఎందుకని? పౌర బాధ్యతల స్పృహ ఉన్నవారు తమ పేర్ల చేర్పుకు లేదా




> ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ మనకు అవసరమైనదీ, మన ఎన్నికల చట్టాలను రూపొందించినవారు ఉద్దేశించిందీ కాదు. ఈ 'ప్రత్యేక' సమగ్ర సవరణ తప్పనిసరైనదీ కాదు, ఓటర్ జాబితాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సరిపోయేదీ కాదు. అనవసరంగా స్టెరాయిడ్లు, ప్రమాదకరమైన పదార్థాలు కలిసిన ఔషధమది. అది సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. ఇప్పటికే చేసింది కూడా.

తీసివేతకు లేదా దిద్దుబాటుకు, నివాస ప్రదేశాల మార్పు గురించి తెలియజేయడానికి నివేదించిన అభ్యర్థనలకే ఈ సవరణ ప్రక్రియ పరిమితమవుతుంది. వార్షిక సంగ్రహ సవరణ మెరుగైనది. భారీ సంఖ్యలో చేర్పులు, తీసివేతలను సమగ్రంగా సమీక్షించేందుకు ఈ ప్రక్రియలో అవకాశమున్నది.. అయినా ఇది కూడా సంతృప్తికరమైన పరిష్కారం కాదు. ఎందుకని? ఈ సంగ్రహ సవరణ సమయంలో బీఎల్ఓ (పోలింగ్ బూత్ స్థాయి అధికారి) ప్రతి ఇంటికి వెళ్లి యథార్థాలు తెలుసుకోవలసిన అవసరముండదు. ఏమైనా ప్రస్తుత విధానంలో సంవత్సరాలుగా అనేక లొసుగులు లోపాలు కొనసాగుతున్నాయి.



■ యోగేంద్ర యాదవ్

ఈ వాస్తవాల దృష్ట్యా పరిస్థితులను చక్కదిద్దేందుకు ఒక నిర్దిష్ట చర్య చేపట్టవలసిన అవసరమున్నది. ఆ నిర్దిష్ట చర్య మరింత సమగ్రంగా, క్రమబద్ధంగా ఉండాలి. అదే సమయంలో అది మరింత పారదర్శకంగా, న్యాయబద్ధంగా కూడా ఉండితీరాలి. సాధారణ సవరణలు, వార్షిక సంగ్రహ సవరణలతో పాటు ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టవలసిన అవసరమున్నది. ఈ ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలి. కొత్త ఓటర్లను నమోదు చేయాలి. మృతులు, ఇతర ప్రదేశాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలి. ఇలా ఓటర్ జాబితాలను సవరించవలసి ఉన్నది. ఇదంతా ప్రామాణిక పద్ధతులలో జరగాలి. మరి బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఈ బాధ్యతలనే నిర్వర్తిస్తున్నది కదా అని ఆ ప్రక్రియను సమర్థిస్తున్నవారు తప్పక ప్రశ్నిస్తారు. నేను వారితో ఏకీభవించడం లేదు. వాస్తవమేమటంటే ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు మనకు అవసరమైనదీ, మన ఎన్నికల చట్టాలను రూపొందించినవారు ఉద్దేశించిందీ కాదు. ఈ 'ప్రత్యేక' సమగ్ర సవరణ తప్పనిసరైనదీ కాదు, ఓటర్ జాబితాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సరిపోయేదీ కాదు. అనవసరంగా స్టెరాయిడ్లు, ప్రమాదకరమైన పదార్థాలు కలిసిన ఔషధమది. మనం ఎదుర్కొంటున్న సమస్యకు ఆ 'సర్' పరిష్కారం కాదు. అది సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. ఇప్పటికే చేసింది కూడా. బిహార్ 'సర్' ఎన్నికల చట్టం ఉద్దేశ్యంతో గానీ, ప్రత్యేక సవరణ స్ఫూర్తితో గానీ ముడివడి ఉన్న ప్రక్రియ కాదు. ఈ విషయాలను మరింత వివరంగా పరిశీలిద్దాం.

బిహార్‌లో చేపట్టిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రకారం సంభావ్య ఓటర్లు అందరూ ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిచేసి ఇవ్వాలి. ఇవ్వని పక్షంలో తమంతట తామే ఓటరుగా నమోదు అయ్యేందుకు అనర్హులవుతారు. భారతదేశ ఎన్నికల చరిత్రలో ఇంతకు ముందెన్నడూ లేని నిబంధన ఇది. దీనికి ఏ విధమైన చట్ట ప్రాతిపదిక లేదు. చాలా చిన్న విషయంగా కనిపిస్తున్నా వాస్తవానికి మన ఎన్నికల వ్యవస్థలో ఒక మౌలిక మార్పు అని చెప్పి తీరాలి. గతంలో ఓటర్ల నమోదుకు ప్రభుత్వమే చొరవ చూపేది. ఇప్పుడు ఓటరుగా నమోదు కాదలుచుకున్న వారే అందుకు సొంతంగా శ్రద్ధ చూపాలి. అంటే వయోజనులను ఓటరుగా నమోదు చేసే బాధ్యత ఎన్నికల అధికారులకు ఉండదు. ప్రత్యేక సమగ్ర సవరణ ఆ బాధ్యతను ఓటర్ల పైనే మోపింది. ఓటర్ల నమోదులో ఇటువంటి మార్పు పర్యవసానాలు ఎలా ఉంటాయి? పేద ప్రజలు, అవిద్యావంతులు, వలస జీవులు, మైనారిటీలు, మహిళలు ఓటర్లుగా నమోదు కావడం గణనీయంగా తగ్గిపోతుందనేది పలు దేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రతి ఒక్క సంభావ్య ఓటర్ కూడా ఓటరుగా నమోదయ్యేందుకు తన అర్హతను నిరూపించుకునేందుకై వివిధ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తీరాలి. ఓటర్‌గా నమోదయ్యేందుకు పలు డాక్యుమెంట్లను విధిగా సమర్పించవలసిరావడమనేది ఇంతకు ముందెన్నడూ జరగలేదు. ఈ కొత్త నిబంధనకు చట్టబద్ధమైన ఆధారమేమీ లేదు. అంతే కాదు పౌరసత్వ భావనను వ్యతిరేకిస్తుంది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకారం ఓటరుగా నమోదుకాగోరువారు తమ తల్లిదండ్రుల పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలు సమర్పించాలి. ఇది పౌరసత్వ భావనను తారు మారు చేస్తుంది. తన పౌరసత్వాన్ని రుజువు చేసుకునే బాధ్యతను ఓటర్‌పైనే మోపుతుంది. ఈ అసంబద్ధతల సంచిత ప్రభావం సామూహికంగా ఓటుహక్కు తొలగింపు అనడంలో సందేహం లేదు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అసంబద్ధ నిబంధనల వల్ల చాలామంది తమ ఓటుహక్కును కోల్పోతారు. బిహార్‌లో 'సర్' సాధిస్తుంది ఇదే కాదూ? ప్రత్యేక సమగ్ర సవరణ విధిగా ఓటర్ జాబితాల కచ్చితత్వాన్ని మెరుగుపరిచి తీరాలి. కానీ అలా జరగడం లేదు. ఈ బాధ్యతపై అసలు శ్రద్ధ పెట్టడం లేదని కూడా చెప్పాలి. ప్రతి ఇంటికీ వెళ్లి నిర్వహించే ఎన్యూమరేషన్‌లో తొలగింపులకు ఇచ్చే ప్రాధాన్యాన్ని అదనపు చేర్పులకు కూడా ఇవ్వాలి. బిహార్‌లో ఇలా జరగలేదు. జూన్ 25– జూలై 25 మధ్య నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో 65 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. అయితే అదనంగా ఒక్క పేరును కూడా ఆ జాబితాలలో చేర్చలేదు. నిజంగా ఇది సమగ్ర సవరణ కానేకాదు. అది సమగ్ర తొలగింపు ప్రక్రియ. ఇదొక నిష్ఠుర సత్యం.

ఓటర్ జాబితాల నుంచి నిర్దిష్ట ఓటర్ల పేర్లు తొలగించే ముందు వారు 'మృతులు', 'ఇతర ప్రదేశాలకు శాశ్వతంగా వెళ్లిపోయినవారు', 'జాడ తెలియడం లేదు' అని నమోదు చేసేముందు ఎన్నికల సంఘం నెలకొల్పిన సవివరమైన మార్గదర్శకాలను అనుసరించి ఉండవల్సింది. ఈ ప్రకారం ప్రామాణిక చట్టబద్ధ ప్రక్రియ (నోటీస్, విచారణ, అప్పీల్)ను అనుసరించి ఉన్నట్టయితే చాలా మంది 'మృత' ఓటర్ల ఫిర్యాదులకు గురికావల్సిన ఇబ్బంది ఎన్నికల సంఘంకు ఇప్పుడు ఉండేదికాదు.

ఓటర్ జాబితాల నాణ్యతను నిర్ధారించేందుకు వాటిని స్వతంత్ర తనిఖీకి నివేదించి ఉండవల్సింది. వాటి 'సంపూర్ణత్వం'పై సమాచారమున్నది గానీ, వాటి 'కచ్చితత్వం'పై సమాచారం లేదు. సువ్యవస్థిత, ఉన్నత ప్రమాణాల గణాంకాల వ్యవస్థలు ఉన్నా మన ఓటర్ జాబితాల నాణ్యత నిర్ధారణ లోపభూయిష్ఠంగా ఉండడం భారత్‌కు అప్రతిష్ఠాకరం. జనన మరణాల రిజిస్టర్‌పై స్వతంత్ర నమూనా తనిఖీ ఉన్నట్టుగానే ఓటర్ జాబితాల విషయంలో కూడా ఉండి తీరాలి. ప్రత్యేక సమగ్ర సవరణతో పాటు ఓటర్ జాబితాలలోని మోసాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై న్యాయసమ్మతమైన, విశ్వసనీయ విచారణ కూడా జరగాలి. అయితే ఈ విచారణ ఓటర్ జాబితాలను రూపొందించే బాధ్యతలలో పాల్గొంటున్న వారిచే జరిపించకూడదు. ఇది జరిగే పనేనా? ఎన్నికల సంఘం అందుకు అనుమతించదని చెప్పవచ్చు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

# రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీకగా సుదర్శన్‌రెడ్డి

సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఇండియా కూటమి ప్రకటించడంతో ఆయన మీడియా పతాక శీర్షికలలో ప్రధానంగా నిలిచాడు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా, అస్సాం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు జస్టిస్‌గా, పదవీ విరమణ అనంతరం గోవా లోకాయుక్తగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి తాను విధులు నిర్వహించిన అన్ని పదవులకు వన్నె తెచ్చారు. ఆయన వెలువరించిన తీర్పులను గమనిస్తే సుదర్శన్‌రెడ్డి ప్రజా దృక్పథం, ఆయన దార్శనికత వ్యక్తిత్వం, విలువల పట్ల నిబద్ధత వ్యక్తమవుతాయి, ఇవే ఆయన్ను ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టాయి. న్యాయమూర్తిగా ఆయన సేవలలో స్పష్టత, నిమగ్నత ప్రస్ఫుటం. ఆయన ఎన్నో కీలకమైన తీర్పులు ఇచ్చినా ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీ యువకులతో నిర్మించిన ప్రైవేటు వ్యవస్థ సాల్వాజుడుం విషయంలో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్‌లో భాగంగా ఇచ్చిన విలక్షణ తీర్పు మిక్కిలి ఎన్నదగినది. ఆ తీర్పులో ఆయన ఉల్లేఖించిన అనేక రాజనీతిజ్ఞుల, న్యాయ కోవిదుల ఉటంకింపులు చూస్తే ఆశ్చర్యం కలగటమే కాదు, ఆయన ప్రజా దృక్పథం కూడా స్పష్టంగా అర్థమవుతుంది.

గత దశాబ్ద కాలంగా దేశంలో రెండు పరస్పర విరుద్ధ భావనల మధ్య ఘర్షణ రాజకీయ వేదికని రక్తి కట్టిస్తున్నది. ఒకటి హిందూ భావజాలం అయితే మరొకటి భారతదేశ రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగా ప్రకటితమయ్యే విలువల భావజాలం. వీటి మధ్య 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఎన్నడూ లేనంత సంఘర్షణ చోటుచేసుకున్నది. ప్రజాస్వామ్య దేశంలో అధికార – ప్రతిపక్షాలు పరస్పర ఆరోపణలు చేసుకోవడం పరిపాటి. రాజకీయ పార్టీల అధినాయకులు ఎన్నికల ప్రచార సభలలో మాట్లాడిన మాటలకు, ఆయా పార్టీలు మేనిఫెస్టోలలో చేసిన వాగ్దానాలకు, అధికారం చేపట్టాక చేసే పాలనకు పొంతన ఉండదు. పాలకులు ప్రజలు కోరుకున్నట్టు పాలించడం మాని, తమకు వెన్నుదన్నుగా ఉండి నడిపిస్తున్న వారికి అనుకూలంగా పాలిస్తుంటారు. చట్టాలూ అలాగే అమలవుతుంటాయి. ప్రపంచీకరణ తీసుకొచ్చిన అత్యంత దుష్పరిణామాలలో ఒకటి 'క్విడ్ ప్రోకో' సంస్కృతి. కేంద్రంలోను, రాష్ట్రాలలోను ప్రభుత్వాలు ఏర్పరిచినవారు తీసుకునే నిర్ణయాల వెనుక ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలు స్పష్టంగానే గోచరమవుతుంటాయి. రాజ్యాంగ పీఠికలో రాసుకున్న పాఠ్యాంశాన్ని పాలకులు అప్పుడప్పుడు వల్లె వేస్తుంటారు కానీ, ఆచరణలో దానికి పూర్తి వ్యతిరేకంగా పనిచేస్తుంటారు. రాజ్యాంగం ద్వారా ఏర్పడిన స్వతంత్ర ప్రతిపత్తి గల అనేక విభాగాలలో రాజకీయ జోక్యం ఇప్పుడు పెరుగుతున్నది. మన రాజకీయ వ్యవస్థ దీన్ని ఒప్పుకోకపోవచ్చు గానీ ప్రజలకు ఈ విషయంపై అవగాహన కలుగుతున్నది. దేశంలో జరిగిన అనేక సంఘటనలను దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.




> ఇండియా కూటమి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిని తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడం ద్వారా రాజ్యాంగ పరిరక్షణను సమర్థవంతమైన ప్రచార అస్త్రంగా ఎంచుకున్నది. క్రమంగా ఈ ఎన్నిక రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు మధ్య పోరుగా మారుతున్నది.

వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, దాని నాయకులు ఇటీవల దేశ వాస్తవ ముఖచిత్రాన్ని గుర్తించారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఆ పార్టీ సామాజిక కులగణన జరగాలని, అన్ని రంగాలలో ఆయా వర్గాల ప్రాతిపదికన ఫలాలు అందాలని ఒక శక్తిమంతమైన ఉద్యమానికి నాంది పలికింది. ఈ ఉద్యమం ఇటీవల దేశ రాజకీయ ముఖచిత్రంలో ఒక ప్రధాన ఎజెండాగా క్రమంగా మార్పు చెందుతున్నది. ఇది ప్రజలపరంగా శుభపరిణామం.

ఇప్పుడు భిన్న దృక్పథాల మధ్య దేశం ఒక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. రాజకీయ వర్గాలు రాజ్యాంగ పరిరక్షకులుగాను, రాజ్యాంగ వ్యతిరేకులుగాను చీలిపోయారు. ఇటువంటి రాజకీయ సందర్భంలో– ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా అధికార పార్టీ ఎన్‌డీఏ ఆర్ఎస్ఎస్ నేపథ్యం గల వ్యక్తిని నిలబెడితే, ప్రతిపక్ష ఇండియా కూటమి న్యాయశాస్త్ర కోవిదుడు, దార్శనికుడు, రాజ్యాంగ నిపుణుడైన జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా బరిలో నిలిపింది. సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోను, సాంస్కృతిక రంగంలోను తనదైన పాత్రను, గురుతరమైన బాధ్యతలను నిర్వర్తించారు. అన్నిటికన్నా ముఖ్యంగా బి. సుదర్శన్‌రెడ్డి ప్రజాస్వామిక దృక్పథం కలిగినవారు.

గతంలో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నీలం సంజీవరెడ్డి అధ్యక్షుడిగా పోటీ పడగా, తన అనంతరం వి.వి. గిరిని పోటీలో నిలిపి ఆత్మప్రబోధం ప్రకారం ఓటు వేయమని ఇందిరాగాంధీ కోరారు. నేటి తరం ఆత్మలేని నాయకులకు ఆత్మ ప్రబోధాలు, విచక్షణలు ఉంటాయని ఆశించడం అత్యాశే! ఇప్పుడు పనిచేసేదల్లా పార్లమెంటు సభ్యుల మెజారిటీ, మైనారిటీ బలాబలాలు మాత్రమే. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో గెలుపు ఓటములు అంత ప్రధానమేమీ కాదు. కానీ ఇండియా కూటమి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిని తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడం ద్వారా రాజ్యాంగ పరిరక్షణను సమర్థవంతమైన ప్రచార అస్త్రంగా ఎంచుకున్నది. క్రమంగా ఈ ఎన్నిక రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు మధ్య పోరుగా మారుతున్నది.

• జూకంటి జగన్నాథం

# జిల్లాల ఏర్పాటు ఎవరికోసం?

జగన్ ప్రభుత్వం 2021 చివరలో ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలను 13 నుంచి 25కు పెంచింది. అయితే జగన్ చేసిన జిల్లాల ఏర్పాటు ప్రజలకు ఇబ్బంది కలిగించింది. దానికి ప్రధాన కారణం భౌగోళిక స్థితిని బట్టి కాక లోక్‌సభ సభ్యుల ఏరియాను బట్టి జిల్లాలు ఏర్పాటు చేయడం. ఎంపీల జిల్లా పరిధి ఒకే విధంగా ఉంటే ఎంపీలు, జిల్లా కలెక్టర్ల సమన్వయంతో జిల్లాలు అభివృద్ధి చెందుతాయి అన్న భావనతో ఏర్పాటు చేసినట్టు జగన్ ప్రభుత్వం చెప్పుకుంది. జిల్లాల ఏర్పాటు ప్రజల కోసమా లేకపోతే ఎంపీలు, కలెక్టర్ల కోసమా? వీరిద్దరూ ఉన్నది ప్రజల కోసం అన్నది ఆ ప్రభుత్వం ఆలోచించలేదు. రేపు లోక్‌సభ సీట్లు పెరిగితే మళ్లీ జిల్లాల పరిధి మారుస్తారా! ఇప్పుడు కూటమి ప్రభుత్వం జిల్లాల్లో కొన్ని మార్పులు, కొత్త జిల్లాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. ఈ క్రమంలో ఒక అసెంబ్లీ స్థానం రెండు జిల్లాల్లో వచ్చినా ఫరవాలేదు. ప్రస్తుతం జగ్గంపేట అసెంబ్లీ, అలాగే అనపర్తి నియోజకవర్గం రెండు జిల్లాల్లో ఉన్నాయి. అలాగే కమ్యూనికేషన్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడు జిల్లా కలెక్టర్లు, ఇతర అధికార్లతో ఎంపీ, ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకోవడం సమస్యే కాదు. అసలు ప్రజాసమస్యలు 90 శాతం మండల స్థాయిలోనే పరిష్కారమవుతాయి. అలాంటప్పుడు ఎంపీ లేదా ఎమ్మెల్యే.. కలెక్టర్, ఇతర అధికారులతో పనుల కోసం పదే పదే కలిసే పని ఏముంది? భౌగోళిక స్థితి, ప్రజలకు అందుబాటు అనేది జిల్లాల ఏర్పాటుకు ప్రాతిపదిక కావాలి. ఇప్పుడు ప్రభుత్వం ప్రజల సౌలభ్యం ప్రాతిపదికగా చర్య తీసుకోవాలి. కొన్ని విస్తీర్ణం రీత్యా చిన్న జిల్లాలు అయినా ఫరవాలేదు. ఈ సందర్భంగా కొన్ని పట్టణాలు/ప్రాంతాలు ప్రాతిపదికగా ఈ క్రింద పేర్కొన్న కొత్త జిల్లాల ఏర్పాటుకు పరిశీలించమని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి. 1. రంపచోడవరం కేంద్రంగా మరొక ఏజెన్సీ జిల్లా, 2. జంగారెడ్డిగూడెం కేంద్రంగా జిల్లా (గోదావరికి పశ్చిమాన ఉన్న ఏజెన్సీ మండలాలు కలిపి), 3. మార్కాపురం కేంద్రంగా జిల్లా, 4. నాయుడుపేట కేంద్రంగా జిల్లా.

– మారిశెట్టి జితేంద్ర, రాజమహేంద్రవరం

# దేవనహళ్లి రైతుల విజయం స్ఫూర్తిదాయకం!

బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈశాన్యంగా ఉండే దేవనహళ్లి తాలూకాలోని, చెన్నరాయపట్న మండలంలోని 13 గ్రామాల్లో ఏరో స్పేస్ పార్కు (వైమానిక ఆవరణ ప్రాంగణం) రెండోదశ నిర్మాణం కోసమని చెబుతూ 'కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు' (KIADB) ద్వారా 1777 ఎకరాల సాగుభూమిని సేకరించటానికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ISRO), కర్ణాటక ప్రభుత్వం రెండూ కలిసి మొదటి దశ ఏరో స్పేస్ పార్కును దేవనహళ్లిలో స్థాపించాయి. ఇప్పటికే ఏరో స్పేస్ పార్కు మొదటి భాగానికి, ఫోక్స్ కంపెనీకి, అమెజాన్ ఇండియా ప్రధాన కార్యాలయానికి, బెంగళూరు ప్రపంచ వాణిజ్య కేంద్రానికి వేలాది ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకున్నారు. అభివృద్ధి కోసం రైతులు మరిన్ని త్యాగాలు చేయాలని 2021 ఆగస్టులో అధికారంలో ఉన్న బీజేపీ ముఖ్యమంత్రి బీఆర్ బొమ్మై ప్రభుత్వం ఎయిరో స్పేస్ పార్క్ రెండవ భాగం నిర్మాణం కోసం భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

దీనికి వ్యతిరేకంగా ఈ ప్రాంత రైతులు 'భూ స్వాధీన విరోధి హోరాట సమితి' పేరు మీద సమీకృతులై వివిధ వామపక్ష రైతు సంఘాల, ప్రజాస్వామ్యవాదుల సహాయ సహకారాలతో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఈ క్రమంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారు. పోలీసులు రైతుల మీద వందల కొద్దీ క్రిమినల్ కేసులు పెట్టారు. ఈ ఉద్యమానికి ప్రజల నుంచి, వివిధ ప్రజా సంఘాల నుంచి, కళాకారుల నుంచి పెద్ద ఎత్తున సంఘీభావం లభించింది. ప్రకాశ్‌రాజ్ లాంటి సినీ నటులు రైతులకు మద్దతుగా నిలబడ్డారు. రైతాంగ సమస్యలపై నిరంతరం ఆందోళన చేస్తున్న, మాధవరెడ్డి నాయకత్వంలో ఉన్న AIKMKS అనుబంధ కర్ణాటక రాజ్య రైతు సంఘం రైతులు ఆందోళన చేస్తున్న చెన్నరాయపట్న ధర్నా స్థలం నుంచి పాదయాత్ర చేపట్టి, రైతులంతా మరింత పట్టుదలతో నిలబడాలని కోరింది. రైతులు విజయం సాధించే వరకు 1,198 రోజులు వివిధ దశలలో సాగించిన పోరాటానికి వివిధ రైతుసంఘాలతో కలిసి అండగా నిలబడింది.

ఆగస్ట్ 2021లో ఏరో స్పేస్ పార్కు రెండవ దశ కోసం భూసేకరణకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడింది. ప్రభుత్వం నుంచి అధికారిక నోటీసులు జనవరి 2022 తొలి వారంలో వచ్చాయి. ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత అధికారికంగా నిర్వహించాల్సిన గ్రామ సభలను ఉద్దేశపూర్వకంగా నిర్వహించలేదు. 2022 జనవరి చివరలో, కేఐఏడీబీ జారీ చేసిన నోటీసులను తగలబెట్టడంతో రైతులు తమ నిరసనను ఆరంభించారు. ఫిబ్రవరిలో చెన్నరాయపట్న నుంచి డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వరకు భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. 2022 ఆగస్టు 15న పోలీసులు జరిపిన లాఠీచార్జీలో రైతులు గాయపడ్డారు. 2022 సెప్టెంబర్ 15న బెంగళూరు ఫ్రీడం పార్క్ దగ్గర రైతులు ధర్నా చేశారు. అప్పటికి అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రైతులు తమ నిరసనోద్యమాన్ని బెంగళూరుకు మార్చుకొన్నారు. 2023లో తాము అధికారంలోకి వస్తే బీజేపీ ప్రభుత్వం మొదలుపెట్టిన ఏరోస్పేస్ పార్క్ రెండవదశ భూసేకరణను ఆపు చేస్తామని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి సిద్ధరామయ్య దేవనహళ్లి రైతులకు హామీ ఇచ్చారు. కానీ ఆ హామీని నిలబెట్టుకోకపోవటంతో రైతులు మళ్లీ పోరుబాట పట్టారు.

> 'భూ స్వాధీన విరోధి హోరాట సమితి' పేరు మీద సమీకృతులై వివిధ వామపక్ష రైతు సంఘాల, ప్రజాస్వామ్యవాదుల సహాయ సహకారాలతో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఈ క్రమంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారు. పోలీసులు రైతుల మీద వందల కొద్దీ క్రిమినల్ కేసులు పెట్టారు.




2025 జూన్‌లో సిద్ధరామయ్య ప్రభుత్వం భూముల కోసం రైతులకు ఇచ్చిన చివరి నోటిఫికేషన్ తరువాత, ఈ పోరాటం పెద్ద మలుపు తీసుకొన్నది. సంయుక్త హోరాట కమిటీ ఇచ్చిన 'చలో దేవనహళ్లి' పిలుపులో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలపై పోలీసులు క్రూరమైన అణచివేతను ప్రయోగించారు. ముఖ్యమంత్రితో రెండు సమావేశాలు జరిగి, పోరాటం తీవ్రమవుతున్న దశలో ఈ నిర్బంధం జరిగింది. భూసేకరణను రద్దు చేయటం వలన వచ్చే న్యాయపరమైన అడ్డంకుల గురించి తెలుసుకోవటానికి 10 రోజుల సమయం కావాలని జూలై 4న జరిగిన మొదటి సమావేశంలో ముఖ్యమంత్రి కోరారు. అయితే 'ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్' (AILAJ) కలగజేసుకొని, దేవనహళ్లి భూసేకరణ విషయంలో ఒక వివరణాత్మక ప్రకటనను విడుదల చేసింది. దాని ప్రకారం, భూసేకరణను ఆపటానికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు ఉండవని స్పష్టంగా ప్రకటించింది.

రైతులు దీర్ఘకాలికంగా సాగిస్తున్న పోరాటాన్ని పక్కదారి పట్టించటానికీ, వారి ఐక్యతను భగ్నం చేయటానికీ, ప్రలోభపెట్టటానికి అధికారపక్ష నాయకులు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేశారు. తమ భవిష్యత్తుకు మూలమైన భూమిని వదులుకోలేమని, ప్రభుత్వం ఎరచూపిన తాయిలాలను రైతులు తిప్పికొట్టటంతో చివరికి ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. జూలై 15న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భూసేకరణను వెంటనే ఆపివేయాలని అధికారులను ఆదేశించక తప్పలేదు. నూతన ఆర్థిక విధానాలను అమలు చేయటంలో పాలక పార్టీలు పోటీపడి అదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను పెంచి పోషిస్తున్నాయి. ఆ విధానాలలో భాగంగానే గత బీజేపీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను దగా చేయాలని చూసినా, మూడు సంవత్సరాలు తమ భూముల కోసం రాజీలేని పోరాటం చేసి, రైతులు విజయం సాధించారు. అయితే ఇది తాత్కాలిక విజయం మాత్రమే. ఈ విజయం వెలుగులో కర్ణాటక రైతులు బడా కార్పొరేట్ శక్తుల నుంచి తమ భూముల రక్షణ కోసం మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలి.

కర్ణాటక రాష్ట్రంలోని దేవనహళ్లి రైతుల భూ పోరాటం దేశవ్యాప్తంగా అక్రమ భూసేకరణలకు వ్యతిరేకంగా రైతులు సాగిస్తున్న పోరాటాలకు ఉద్యమ స్ఫూర్తిని, ఉత్తేజాన్ని అందిస్తున్నది. రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలో వేలాది ఎకరాలను సోలార్ విద్యుత్తు పరికరాల తయారీ కోసం అప్పజెప్పటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దీనికి వ్యతిరేకంగా రైతాంగం సాగిస్తున్న పోరాటానికి దేవనహళ్లి రైతుల విజయం స్ఫూర్తినిస్తున్నది.

■ ముప్పాళ్ళ భార్గవశ్రీ
సీపీఐ ఎంఎల్ నాయకులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా | ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



# ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు



# స్మార్ట్‌గా రేషన్

రేషన్ డీలర్లకు స్మార్ట్ ఈ-పోస్ మిషన్ల పంపిణీ



- అత్యాధునిక ఫీచర్లతో వేగంగా రేషన్ సరఫరా
- నెట్‌వర్క్ సమస్యకు, రద్దీకి చెక్ పెట్టేందుకే..
- త్వరలోనే స్మార్ట్ రేషన్ కార్డులు కూడా..
- సంతోషం వ్యక్తం చేస్తున్న రేషన్ డీలర్లు

6







# ప్రతిష్ఠాత్మకంగా దసరా ఉత్సవాలు

## సామాన్య భక్తుడికే అగ్రతాంబూలం

**మూలానక్షత్రం, దశమి రోజున ఉచిత లడ్డూ ప్రసాదం**

- దసరా ఉత్సవాలపై సమీక్షలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- కిందటి దసరాను మమ.. అనిపించారు : ఎమ్మెల్యే సుజన ఫైర్



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే సుజనా చౌదరి, దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్ తదితరులు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే దసరా ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డిలో బుధవారం దసరా ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల నివేదికను మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మిగతా 6లో..




కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

# నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

- ప్రజాప్రయోజన ఆవిష్కరణలకు ఆహ్వానం
- అందుబాటులోకి ఆర్‌టీఐహెచ్
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

6



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద

# పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

- అప్రమత్తమైన అధికారులు
- పరివాహక గ్రామాల్లో హై అలర్ట్, బందోబస్తు

8



# అయోధ్య-కాశీ యాత్ర

- ఐఆర్‌సీటీసీ ప్యాకేజీ విడుదల
- సెప్టెంబరు 9న భారత్ గౌరవ్ రైలు ప్రారంభం

రైల్వేస్టేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఐఆర్‌సీటీసీ అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్ర ప్యాకేజీని బుధవారం ప్రకటించింది. బైద్యనాథ్ ధామ్‌తో కూడిన ఈ యాత్రకు సంబంధించి సెప్టెంబరు 9న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి భారత్ గౌరవ్ టూరిస్టు ట్రైన్ ప్రారంభమవుతుంది. జగన్నాథ టెంపుల్, కోణార్క్‌లోని సూర్యదేవాలయం, బాబా బైద్యనాథ్ టెంపుల్, కాశీ విశ్వనాథ్ టెంపుల్‌తో పాటు కారిడార్ కాశీవిశాలాక్షి, అన్నపూర్ణదేవి టెంపుల్, సాయంత్రం గంగా హారతి దర్శనం, రామజన్మభూమి, హనుమాన్ గర్హి, త్రివేణి సంగమం వంటి ప్రదేశాలను చూపిస్తారు. ఈ రైలు కాజీపేట జంక్షన్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం గుండా వెళుతుంది. తొమ్మిది రాత్రులు, పది పగళ్లు నడిచే ఈ యాత్రలో వసతి సౌకర్యం, కేటరింగ్ సౌకర్యాలు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, సెక్యూరిటీ సౌకర్యం, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వంటివి అన్నీ ప్రతి కోచ్‌కు అనుసంధానమై ఉంటాయి. దీంతో పాటు ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటుంది. ఐఆర్‌సీటీసీ స్టాఫ్ ప్రయాణం మొత్తంలో సహాయపడేందుకు ప్రతికోచ్‌లోనూ ఉంటారు. సెప్టెంబరు 9 నుంచి 18వరకు ప్రయాణం ఉంటుంది. ఎకానమీ స్లీపర్ క్లాస్‌లో డబుల్, ట్రిపుల్ షేర్ రూ.17,000లు, ఐదు నుంచి 11 సంవత్సరాల పిల్లలు రూ.15,800లు చెల్లించాల్సి ఉంటుంది. రాత్రి వేళ నాన్ ఏసీ రూమ్‌లో బస చేయాల్సి ఉంటుంది. ట్రాన్స్‌పోర్టేషన్ కూడా నాన్ ఏసీ వాహనాల్లోనే ఉంటుంది. స్టాండర్డ్ క్లాస్‌లో త్రీ ఏసీకి రూ.26,700లు చెల్లించాల్సి ఉంటుంది. ఐదు నుంచి 11 సంవత్సరాల పిల్లలకు రూ.25,400లు చెల్లించాల్సి ఉంటుంది. ఏసీ రూమ్‌లో బస ఉంటుంది. ట్రాన్స్‌పోర్టు ఏసీ వాహనాల్లో ప్రయాణం ఉంటుంది. కంఫర్ట్ 2ఏసీలో రూ.35వేలు చెల్లించవలసి ఉంటుంది. ఐదు నుంచి 11 సంవత్సరాల పిల్లలకు రూ.33,300లు చెల్లించాల్సి ఉంటుంది. ఏసీ రూమ్‌లో రాత్రి బస ఉంటుంది. ఏసీ వాహనాల్లో ప్రయాణం ఉంటుంది. బుకింగ్‌కు 9701360701, 9281030712, 9281030750, 9281495845 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని, ఐఆర్‌సీటీసీ టూరిజం.కామ్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చని చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు.



ఉద్యోగులతో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తదితరులు

## ఆరుగురికి ఏవోలుగా పదోన్నతులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు జిల్లాపరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతులు కల్పిస్తూ బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్ ఉత్తర్వులు జారీచేశారు. మొవ్వ సబ్‌డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పిన్నింటి రవిని మచిలీపట్నం డ్వామా పీడీ కార్యాలయంలో ఏవోగా, తాడేపల్లిలో గ్రామ సచివాలయాల విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌ను కృత్తివెన్ను ఎండీవో కార్యాలయంలో ఏవోగా, తాడేపల్లి హెడ్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సృజనను అదే కార్యాలయంలో ఏఓగా, నందిగామలో పనిచేస్తున్న ముదిగొండ తేజస్విని జిల్లా పరిషత్ ఏవోగా, జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీబీఎస్ఎన్ శాస్త్రి రెడ్డిగూడెం ఏఓగా, మచిలీపట్నం సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామకృష్ణను తిరువూరు ఎండీవో కార్యాలయ ఏవోగా పదోన్నతులు కల్పించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

## కబడ్డీ క్రీడాకారులకు మంచి భవిష్యత్

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్ కబడ్డీ 2025 పోటీలలో 6వ రోజు మ్యాచ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో క్రికెట్ తరువాత కబడ్డీకి ఆదరణ, ప్రాచుర్యం లభిస్తుందని, కబడ్డీ క్రీడాకారులు ఆటలో ప్రతిభ చాటి మంచి ఫలితాలు సాధిస్తే భవిష్యత్తు బాగుంటుందన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న క్రీడా పాలసీలో కీడ్రలకు, క్రీడాకారులకు ఎంతో మంచి జరుగుతుందన్నారు. 6వ రోజు జరిగిన మ్యాచ్‌లో అమరావతి, విజయనగరం, తిరుపతి, వైజాగ్ విజయాలు సాధించాయి. ఈ కార్యక్రమంలో ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచలి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వెంకట్2: ప్రథమ స్థానంలో నిలిచిన హిందుస్థాన్ జట్టు

## బాస్కెట్ బాల్ విజేత హిందుస్థాన్

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పి.బి సిద్ధార్థ కళాశాలలో నేషనల్ ఇన్విటేషన్ పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు బుధవారం ముగియగా హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ జట్టు విజేతగా నిలిచింది. లయోలా కాలేజ్, చెన్నై జట్టు 46 పాయింట్లతో రన్నరప్‌గా నిలవగా, 81 పాయింట్లతో హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ విజేతగా నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన హిందుస్థాన్ జట్టుకు 75 వేలు, లయోలా జట్టుకు 50 వేలు నగదు బహుమతిని ఏపీ సీఐడీ అధిపతి రవి శంకర్ అయన్నార్, శాప్ చైర్మన్ రవినాయుడు, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు మలినేని రాజయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, అకడమిక్ అడ్వయిజర్ ఎల్.కె.మోహన్ రావు, మాజీ శాప్ చైర్మన్ అంకమ్మ చౌదరిలు అందజేశారు. కళాశాల క్రీడావిభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణారెడ్డి క్రీడాకారులను అభినందించారు.




# నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

- ప్రజాప్రయోజన ఆవిష్కరణలకు ఆహ్వానం
- అందుబాటులోకి ఆర్‌టీఐహెచ్
- ప్రభుత్వ భాగస్వామ్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు
- వ్యాపారస్తులుగా ఎదగాలనుకునే వారిని అక్కున చేర్చుకునే వినూత్న ప్రాజెక్ట్
- యువతలో వ్యాపార మెలకువలను వెలికి తీయడమే లక్ష్యం

(విజయవాడ సిటీ, ఆంధ్రజ్యోతి)

ఆహార ఉత్పత్తుల నుంచి ఆకాశంలో ఎగిరే విమానం వరకు.. కాలుకు తొడిగే చెప్పుల నుంచి తలకు వాడే షాంపూ వరకు.. ఇత్తడి పాత్ర నుంచి పుత్తడి ఆభరణం వరకు.. పేపర్ నుంచి ల్యాప్‌ట్యాప్ వరకు.. ఆహారం నుంచి ఔషధం వరకు.. సైకిల్ నుంచి డ్రోన్ల వరకు.. ఇలా పర్యావరణ హిత, ప్రజాప్రయోజన సరికొత్త వస్తువులను తయారు చేసే ఇన్నోవేటర్స్‌కు రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్(ఆర్‌టీఐహెచ్) స్వాగతం పలుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, కార్పొరేట్ కంపెనీలు, ఉన్నత విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటైన ఆర్‌టీఐహెచ్ విజయవాడ శివారు ఎనికేపాడులో అందుబాటులోకి వచ్చింది. సరికొత్త ఆవిష్కరణల సృష్టికర్తలను వెన్నంటి నడిపించే ప్రాజెక్ట్ ఇది. ప్రతి కుటుంబానికి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో స్టార్టప్‌లను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యాక్రమానికి శ్రీకారం చుట్టింది.

### యువతలో ఇన్నోవేటివ్ సత్తా వెలికితీసే లక్ష్యం

ప్రతీఒక్కరికి ఏదో ఒక వ్యాపారంలో ఆలోచించే శక్తి ఉంటుంది. ఒక్కో అంశంలో ఒక్కో వ్యక్తికి అపారమైన జ్ఞానం ఉంటుంది. ఆర్థిక వనరులు సమకూర్చుకోలేక, సమాజం నుంచి సరైన ప్రోత్సాహం అందక, నష్టపోతామనే భయంతో ఎంతోమంది వారిలోని ఆలోచనను అణచివేసుకుని ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడిపోతుంటారు. సరికొత్త ఆవిష్కరణలు చేయగలిగిన మరికొందరి శక్తియుక్తులను విదేశాలు వినియోగించుకుంటున్నాయి. ఈ సమస్యలకు చెక్ పెట్టి స్థానికుల ఇన్నోవేటివ్‌ను ఇక్కడి ప్రజలకు ఉపయోగించేందుకు ఆర్‌టీఐహెచ్ ఏర్పాటు జరిగింది. దీని ప్రధాన కార్యాలయం(హబ్) అమరావతిలో ఉండగా ఎనికేపాడులో జాతీయ రహదారికి ఆనుకుని స్పోక్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సువిశాలమైన సెంటర్‌లో సీఈవో, ఇంక్యుబేషన్ హెడ్, పార్టనర్‌షిప్ హెడ్, ఫైనాన్స్ హెడ్ ఉంటారు. ఒక్కొక్కరి వద్ద రెండు నుంచి ఏడుగురు చొప్పున వార్డు, గ్రామ సచివాయల సిబ్బందిని డిప్యుటేషన్‌పై ప్రభుత్వం నియమించింది. వీరంతా కాలేజీలు, స్కూళ్లు, స్వయం సహాయక సంఘాలు, ఎంఎస్ఎంఈలను సంప్రదించి వారిలోని వ్యాపార ఆలోచనలను సేకరిస్తారు. అదేవిధంగా అన్ని ప్రాంతాల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహించడం, ఇంటింటికీ తిరిగి ఔత్సాహికులను గుర్తిస్తారు. చిన్నదైనా, పెద్దదైనా వారిలో ఏదైనా సరికొత్త వ్యాపార ఆలోచన ఉంటే వారిని సెంటర్‌కు తీసుకొస్తారు. ఆ దిశగా ఆచరణలో పెట్టి ప్రొడక్ట్ తయారయ్యేందుకు సహకారం అందిస్తారు. ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువతను చేర్చాలనేది ఆర్‌టీఐహెచ్ లక్ష్యం. దీనితో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్ఆర్)ను పెంచేందుకు ఈ సెంటర్ కృషి చేస్తుంది.

### మూడు జిల్లాలకు సంబంధించి..

ఎనికేపాడు స్పోక్ సెంటర్ పరిధి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల వరకు ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో ఇన్నోవేటర్‌లను గుర్తించి, స్టార్టప్‌లను ఏర్పాటు చేసుకునేందుకు ఈ కేంద్రాన్ని కేటాయించారు. 2029 నాటికి నాలుగు వేల మంది స్టార్టప్‌లను గుర్తించి, వారితో ప్రొడక్ట్ తయారు చేయించి, తద్వారా ఆయా కంపెనీల్లో 20 వేల మందికి ఉపాధి కల్పించాలని ఈ స్పోక్ సెంటర్ లక్ష్యం.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

### వర్చువల్‌గా సెంటర్ ప్రారంభం

ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్ స్పోక్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు అమరావతి నుంచి వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా సెంటర్‌లోని ఇంక్యుబేషన్ హాల్, కమ్యూనిటీ హాల్, స్టాఫ్‌రూం, చర్చావేదికలను పారంభించారు.



ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన 22 స్టార్టప్ స్టాళ్లను వారు పరిశీలించారు. ఈ కేంద్రం అందిస్తున్న సేవలను ఔత్సాహిక ఇన్నోవేటర్‌లు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్, వీఐటీ వర్సిటీ డైరక్టర్ జి.సోమశేఖర్, ఎస్ఆర్ఎం వర్సిటీ సీఈవో కె.రవిశేఖర్, మోహన్ స్పిన్‌టెక్స్ సీఎఫ్‌వో లలితప్రసాద్, మెఘా ఇంజనీరింగ్ ప్రతినిధి వంశీఆదిత్య పాల్గొన్నారు.

### పెద్ద కంపెనీల భాగస్వామ్యం..

స్టార్టప్ ఎకో సిస్టమ్ వాతావరణాన్ని పెంచేందుకు పెద్దపెద్ద కంపెనీలు, యూనివర్సిటీల భాగస్వామ్యంతో ప్రభుత్వం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నాలెడ్జ్ పార్టనర్‌లుగా ఎస్ఆర్ఎం, వీఐటీ యూనివర్సిటీలు, కార్పొరేట్ పార్టనర్‌లుగా రతన్‌టాటా గ్రూప్స్, మోహన్ స్పిన్‌టెక్స్, ఎన్ఎస్ఎల్ గ్రూప్స్, మెగా ఇంజనీరింగ్ కంపెనీలు పనిచేస్తాయి. ఇన్నోవేటర్‌లకు ఆలోచన, ఆర్థికపరంగా ఈ కంపెనీలు సాయం అందిస్తాయి. ఇన్నోవేషన్ గురించి సుదీర్ఘంగా చర్చించేందుకు, ఇన్నోవేషన్‌కు మరింత పదును పెట్టేందుకు స్పోక్ సెంటర్‌లో సువిశాలమైన గదులను ఆర్‌టీఐహెచ్ ఏర్పాటు చేసింది. వ్యవసాయం, వాహనాలు, ఏఐ, ఎడిటింగ్, వీఎఫ్ఎక్స్, సబ్బులు, షాంపులు, బ్యాగ్స్, బట్టలు, ఆభరణాలు, ఫుడ్ మేకింగ్.. ఇలా ఏ రంగంలోనైనా సరికొత్త ఆలోచనలు ఉంటే.. వాటి ఆవిష్కరణలకు కంపెనీలు సాయం అందిస్తాయి.



# ప్రతిష్టాత్మకంగా దసరా ఉత్సవాలు

(5వ పేజీ తరువాయి)

గతం కంటే ఘనంగా దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూలానక్షత్రం, విజయదశమి రోజు ప్రతి భక్తుడికీ లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందిస్తామన్నారు. ఉత్సవాలను జయప్రదం చేయటానికి అన్ని శాఖల్లోని సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అన్నప్రసాదం, తాగునీరు అందుబాటులో ఉండాలని, సామాన్య భక్తుడికే అగ్ర ప్రాధాన్యమని తెలిపారు. ఇంద్రకీలాద్రితో పాటు ప్రకాశం బ్యారేజీ విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దూరాభారం కారణంగా ఇబ్రహీంపట్నం దగ్గర పవిత్ర సంగమం కంటే దుర్గాఘాట్‌లో నిర్వహించే పంచహారతులకే ప్రాధాన్యత ఇచ్చామని, భక్తుల నుంచి కూడా స్పందన వస్తోందని మంత్రి తెలిపారు. గత దసరాలో భక్తులు వేచి ఉండే ప్రాంతం, క్యూలైన్ల విషయంలో కొంత ఇబ్బంది కలిగిందని, ఈసారి వాటిని సరిదిద్ది మరిన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. విద్యాధరపురంలో టీటీడీ స్థలాన్ని దసరా ఉత్సవాలకు వినియోగించుకునేందుకు అనుమతి కోరతామన్నారు. దుర్గమ్మ ప్రధాన ఆలయానికి పూర్తి బంగారు తాపడం కోసం టీటీడీని సంప్రదించామని, వారికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారన్నారు.

### ఎమ్మెల్యే సుజనా అసంతృప్తి

ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించి పది నెలలుగా చేయాల్సిన పనులేమీ చేయలేదన్నారు. బడ్జెట్ తయారీలో క్లారిటీ కూడా లేదన్నారు. కిందటి ఏడాది ఉత్సవాలను మమ అనిపించారని, సంతృప్తికరం కాదన్నారు. పనులకు టెండర్లు పిలిచేటప్పుడు పారదర్శకత ఉండాలన్నారు. న్యాయపరంగా టెండర్లు పిలిచి ఉంటే పనులు చక్కగా జరిగేవని, టెండర్లు పిలిచేటప్పుడు లోపం కనిపించిందన్నారు. చెత్త తరలింపు విషయంలో అశ్రద్ధ చూపించారని, ఎక్కడ చెప్పులు అక్కడే ఉన్నాయన్నారు. ఆలయ సిబ్బంది, వలంటీర్లు, ఇతర సేవకులకు ఆర్ఎఫ్ఐడీ గుర్తింపు ఇవ్వాలని సూచించారు. లేకపోతే ఇష్టానుసారంగా ఎవరు వస్తుంటారో, ఎవరు పోతుంటారో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ఇతర ఆలయాల్లో అమలు చేస్తున్న విధానాలు దుర్గగుడిలో ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఇది సిస్టమ్ ఫెయిల్యూర్‌గా తాను అభిప్రాయపడుతున్నానన్నారు. శాశ్వత చర్యల విషయంలో కొంత లోపం ఉందని సుజనా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, కలెక్టర్ లక్ష్మీశ, ఈవో శీనానాయక్, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌గా రేషన్

- రేషన్ డీలర్లకు స్మార్ట్ ఈ-పోస్ మిషన్ల పంపిణీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రేషన్ కార్డుదారులకు ఇక స్మార్ట్‌గా రేషన్ పంపిణీ జరగనుంది. త్వరలో స్మార్ట్ రేషన్ కార్డులు రాబోతున్న తరుణంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో రేషన్ డీలర్లకు స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలు అందజేశారు. గతంలో కీప్యాడ్ ఈ-పోస్‌ల స్థానంలో సరికొత్త టచ్‌స్ర్కీన్ ఈ-పోస్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. పాత ఈ-పోస్‌ల కంటే మంచి ఫీచర్లతో పాటు వేగంగా పని చేయడం వీటి ప్రత్యేకత. త్వరలో ప్రభుత్వం అందజేయనున్న స్మార్ట్ రేషన్ కార్డులను ఈ స్మార్ట్ ఈ-పోస్ యంత్రాల్లో స్వైపింగ్ చేయాలి. పాతకాలపు కీ ప్యాడ్ ఈ-పోస్ యంత్రాలు సరిగ్గా పనిచేయకపోవడం, నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బంది పడుతున్న రేషన్ డీలర్లకు ఈ కొత్త యంత్రాలు ఊరట కలిగిస్తున్నాయి. దీనివల్ల నెట్‌వర్క్ సమస్య కూడా ఉండదు. ఇందులోని ఇన్‌బిల్ట్ సిమ్ ద్వారా నెట్ రాకపోయినా డీలర్ దగ్గర ఉన్న ఇంట్లోని వైఫైకు అనుసంధానం చేయొచ్చు. బ్లూటూత్ ద్వారా కూడా అనుసంధానం కావచ్చు. లేదంటే డీలర్ మొబైల్ ఇంటర్నెట్‌ను హాట్‌స్పాట్ ఆప్షన్ ద్వారా కూడా స్మార్ట్ ఈ-పోస్‌ను పనిచేయించవచ్చు. ఈ మిషన్‌కు స్మార్ట్ టచ్ స్ర్కీన్ ఉంటుంది. ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై పనిచేస్తుంది. టచ్ చేస్తే చాలు క్షణాల్లో లావాదేవీలు పూర్తవుతాయి. త్వరలో ఇచ్చే స్మార్ట్ రేషన్ కార్డులను స్వైప్ చేయటానికి వీలుగా ఇందులో వ్యవస్థ ఉంది. స్మార్ట్ రేషన్ కార్డును ఈ మిషన్‌పై పెట్టినా వైఫై ద్వారా ఆటోమేటిక్‌గా కనెక్ట్ అవుతుంది. బయోమెట్రిక్ ఇవ్వటానికి వీలుగా ఆప్షన్ ఇచ్చారు. దిగువన ఇన్‌బిల్ట్ కెమెరా ఉంది. వేలి ముద్ర పడకపోతే ఈ కెమెరా ద్వారా ఐరిస్ తీసుకుంటారు. జీపీఆర్ఎస్ వ్యవస్థ ద్వారా డేటా రికార్డ్ చేస్తుంటుంది. ఈ స్మార్ట్ మెషీన్లను ఉపయోగించటం ద్వారా డిపోల వద్ద రద్దీకి ఆస్కారం ఉండదు.

### 2015లోనే..

2015లోనే ఈ-పోస్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా నాటి కృష్ణాజిల్లా కలెక్టర్ అహ్మద్ బాబు ఈ విధానాన్ని పరిచయం చేశారు. ఏప్రిల్‌లో ప్రవేశపెట్టారు. అదే ఏడాది నవంబరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేశారు. అప్పట్లో ఈ విధానం ఓ విప్లవాత్మకం. ఆ తర్వాత వీటిని ఉపయోగించింది లేదు. రేషన్ డీలర్ల విజ్ఞప్తి మేరకు కూటమి ప్రభుత్వంలో దీనిని మళ్లీ మన ముందుకు తీసుకొచ్చారు.

## 17 మంది పీపీలు, ఏపీపీలపై క్రమశిక్షణ చర్యలు

విజయవాడ లీగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించినందుకుగాను 17 మంది పీపీలు, ఏపీపీలపై ప్రభుత్వం బుధవారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీఓపీ) బైరారామకోటేశ్వరరావు సిఫార్సు మేరకు ప్రభుత్వం వీరిపై వేటు వేసింది. వీరిలో కర్నూల్ సెషన్స్ కోర్టులో పీపీగా వున్న వెంకటరెడ్డిపై ప్రభుత్వం వేటు వేసింది. ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో పీపీ సుందరంను తొలగించింది. కర్నూల్ జిల్లా ఆత్మకూరు కోర్టులో అసిస్టెంట్ పీపీ అసిఫ్ ఆలీఖాన్, కర్నూలు నాలుగవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీ ప్రకాశరెడ్డి, కర్నూలు అదనపు జిల్లా కోర్టులో ఏపీపీ బాల రంగస్వామి, అనంతపురం జిల్లా గుత్తి నాలుగవ అదనపు జిల్లా కోర్టులో ఏపీపీ సుదర్శనరెడ్డి, కడప ఏడవ అదనపు జడ్జి కోర్టులో ఏపీపీ మొఘల్ ఎస్మిన్ బేగం, కడప జిల్లా 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఏపీపీ ప్రతాప్ కుమార్ రెడ్డి, మదనపల్లి కోర్టులో ఏపీపీ వి.జయనారాయణరెడ్డి, రాయచోటి ఐదవ అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టులో ఏపీపీ టి.జగన్మోహన్‌రెడ్డి, మచిలీపట్నం అదనపు జడ్జి కోర్టులో ఏపీపీ సియ్యాది చిన్నారావు, గుడివాడ 11వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఏపీపీ షేక్ రెహ్మాతుల్లా, గుంటూరు అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఏపీపీ పల్లపు కృష్ణ, గుంటూరు నాలుగవ అసిస్టెంట్ జడ్జి కోర్టులో ఏపీపీ జ్యోత్స్న, గుంటూరు 12వ జిల్లా అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో ఏపీపీ బొడ్డు కోటేశ్వరరావు, నెల్లూరు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ఏపీపీ ప్రసాదరావులపై ప్రభుత్వం వేటు వేసింది. తదుపరి చర్యలు తీసుకోవాలని డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావును ప్రభుత్వం ఆదేశించింది.

# సాంకేతికతతో నేర పరిశోధన

- జిల్లా ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 20(ఆంధ్రజ్యోతి) : డ్రోన్లు, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన, నేర నియంత్రణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జిల్లా వ్యాప్త పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోవు వినాయకచవితి, మిలాద్ ఉన్ నబి పండుగల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు. వినాయక విగ్రహ ప్రతిష్ఠ, ఊరేగింపు, నిమజ్జన సమయాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాల వినియోగం మరింత పెంచుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, ఆకతాయిల వేధింపులకు పాల్పడిన, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడుతున్న వారిపై కన్నువేసి ఉంచాలన్నారు. మహిళల, పిల్లల సంబంధిత నేరాల విషయంలో పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ చేయాలని, త్వరితగతిన విచారణ పూర్తిచేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని సూచించారు. పాఠశాల, కళాశాలలో అవగాహన క్యాంపులను నిర్వహించాలన్నారు. ప్రతి పోలీసు అధికారి గ్రామ పరిధిలో పల్లెనిద్రలు చేస్తూ, కమ్యూనల్,పోలిటికల్ సెన్సిటివ్ గ్రామాలను సందర్శించి ఎటువంటి శాంతిభద్రతలకు విఘాతం ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి , పోలీసు వాహనాలను సక్రమంగా వినియోగిస్తున్న డ్రైవర్‌లకు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్.పి సత్యనారాయణ, డిఎస్‌పిలు, సి.ఐలు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

### కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఈ నెల 22, 23 తేదీల్లో సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన కృష్ణాజిల్లా కానిస్టేబుల్ అభ్యర్థులు, 25, 26 తేదీల్లో విజయవాడ(ఎన్‌టీఆర్ జిల్లా)కు ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో వెరిఫికేషన్‌కు హాజరుకావాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ఉత్తీర్ణులైన, ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్, గెజిటెడ్ అధికారితో సంతకం చేయించిన 3సెట్ల జిరాక్స్ కాపీలు, 3 ప్రస్తుత కలర్ ఫోటోలు, స్టేజ్-1, 2, 3 దరఖాస్తులతో పాటు ఎటెస్టేషన్ ఫారం-3ను సమర్పించాలని, మరిన్ని వివరాలకు సెల్ నెం. 93981 28969కు సంప్రదించాలని ఎస్పీ కోరారు.



మహాలక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

## కన్న కొడుకే కాలయముడై..

- మద్యం తాగద్దు అన్నందుకు ఆగ్రహం
- రోకలి బండతో తల్లిపై దాడి..
- అక్కడికక్కడే కుప్పకూలి మృతి
- బాడవ గ్రామంలో ఘటన

మైలవరంరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కన్నకొడుకే కాలయముడయ్యాడు. మద్యానికి బానిసై ఆరోగ్యం పాడుచేసుకోవద్దన్నందుకు కోపంతో రగిలిపోయి తల్లిపైనే దాడికి తెగబడ్డాడు. చేతిలో డబ్బులు తీసుకుందని కోపోద్రిక్తుడై రోకలి బండతో తలపై మోదీ హతమార్చాడు. ఈ దారుణ ఘటన మైలవరం మండలం బాడవలో బుధవారం చోటు చేసుకుంది. మైలవరం ఎస్ఐ కె.సుధాకర్ కథనం ప్రకారం.. మండలంలోని పుల్లూరు శివారు బాడవ గ్రామంలో గర్నెపూడి మహాలక్ష్మి (55), సత్యనారాయణలకు రవి ఒక్కడే సంతానం. గత కొన్నేళ్లుగా రవి మద్యానికి బానిస కావడంతో కిడ్నీ, లివర్ సంబంధిత అనారోగ్యసమస్యలతో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. రెండునెలల నుంచి మద్యం మానేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. బుధవారం ఉదయం రవి తల్లి మహాలక్ష్మి, భార్య ఇద్దరు పొలం పనులకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి రవి మద్యం సేవించి ఉన్నాడు. మద్యం తాగవద్దని తల్లి మందలించడంతోపాటు అతడి చేతిలో ఉన్న డబ్బులు లాక్కుంది. దీంతో ఆగ్రహంతో రవి ఇంటి ముందున్న రోకలి బండతో ఆమె తలపై మోదాడు. రక్తపు మడుగులో కుప్పకూలిపోవడంతో కోడలు చుట్టుపక్కల వారిని పిలిచి అత్తను మైలవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. విషయం తెలుసుకున్న మైలవరం సీఐ డి.చంద్రశేఖర్, ఎస్ఐ కె.సుధాకర్‌లు మృతురాలి భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల వాదన మరోలా ఉంది. మహాలక్ష్మి మరుగుదొడ్డిలో జారిపడి చనిపోయిందని, మీరు ఎందుకు వచ్చారని పోలీసులను ప్రశ్నించడం గమనార్హం.

## పారిశ్రామికవాడలో తనిఖీలు

- 10 చోట్ల నీటి నమునాల సేకరణ
- వారంలో బాధ్యుల నిర్ధారణ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



జగ్గయ్యపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికవాడలో ప్రమాద ఘంటికలు శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. విజయవాడ పీసీబీ ఈఈ శ్రీనివాస్ నేతృత్వంలో ఆనలిస్టులు ఆటోనగర్, పారిశ్రామికవాడల్లో ఉన్న ఆరు కెమికల్ ఫ్యాక్టరీలు, బల్క్‌డ్రగ్ తయారీ యూనిట్లలో నీటి నమునాలు సేకరించారు. వ్యర్థ రసాయనాల మడుగులు ఉన్న ప్రాంతంలోని ఐనీష్, వీఎస్ఎన్ఎల్, సహస్ర కర్మాగారాల వద్ద నీటి నమునాలు సేకరించారు. మళ్లీ వర్షం పడినా, వరదలు వచ్చిన వ్యర్థ రసాయనాలు బయటకు రాకుండా డ్రైనేజిలను పూడ్చించారు. నీటి నమునాలలో విశ్లేషణ నాలుగైదు రోజుల్లో పూర్తి చేసి, బాధ్యుల్ని నిర్ధారిస్తామని ఈఈ శ్రీనివాస్ చెప్పారు. బాధ్యులైన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# విజయవాడ తూర్పు

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 117,125, 136 |
| చికెన్ విత్ స్కిన్ | 222 |
| చికెన్ స్కిన్‌లెస్ | 232 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

## ఐటీఐలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భారతీనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26/27కు మూడో విడత అడ్మిషన్స్ పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26లోగా దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని,దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వివరాలను ఈ నెల 27లోగా వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని తెలిపారు. 8, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468 సంప్రదించాలని సూచించారు.





ధ్వంసమైన రైలింగ్

రైలింగ్ విరిగిన చోట కర్ర కట్టారు

## శిథిలావస్థలో చిన్నవంతెన

- తుప్పు పట్టి విరిగిన ఇనుప రైలింగ్‌లు
- వంతెనకు పగుళ్లు

పటమట, ఆంధ్రజ్యోతి: పటమట పరిసర ప్రాంతవాసులు శాంతినగర్ నుంచి చిన్న వంతెన మీదుగా యనమలకుదురు వెళ్లాలి. కొన్ని ఏళ్ళ క్రితం నిర్మించిన వంతెన కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. రెండువైపులా వంతెనకు ఉన్న ఇనుప రైలింగ్‌లు తుప్పు పట్టి విరిగిపోయాయి. ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడిపోతారు. వంతెన పలుచోట్ల పగుళ్లు ఇచ్చింది. శివరాత్రి, కార్తీకమాసం లాంటి పర్వదినాల్లో లక్షలాది మంది ఈ వంతెన మీదుగా శివాలయానికి వెళుతుంటారు. అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ వంతెనకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వంతెన దిగువన ఉన్న స్నానఘాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘాట్లో వ్యర్థాలు పెద్దఎత్తున వేయడంతో ఆప్రాంతమంతా దుర్గంధభరితంగా మారింది.



## ఎస్ఆర్ఆర్ అధ్యాపకులకు మెరిట్ సర్టిఫికెట్లు

మాచవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.భాగ్యలక్ష్మి, డాక్టర్ కొల్లేటి రమేష్, డాక్టర్ యుగంధర్, అధ్యాపకేతర సిబ్బంది ఉమామహేశ్వరి, దౌలత్‌కు జిల్లా స్థాయి మెరిట్ అవార్డులు బుధవారం ప్రదానం చేశారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

వన్‌టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 18న ఓ వ్యక్తి మద్యం మత్తులో నడుచుకుంటూ బెంజిసర్కిల్ సమీపంలోని ఓ హోటల్ కార్ పార్కింగ్ వైపుకు వెళుతూ రోడ్డు పక్కన కిందపడి గాయపడ్డాడు. స్థానికులు అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. హోటల్ వాచ్‌మన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.



## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో...

కృష్ణలంక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ అధ్వర్యంలో కృష్ణలంక మెట్లబజారులో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి కృష్ణలంకలోని పలు ప్రాంతాలలోని రోగుల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి మల్టీ విటమిన్ టాబ్లెట్స్‌తో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రేవతి, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ మాదవి నాయుడు పాల్గొన్నారు. అనంతరం ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ ఛైర్‌పర్సన్ అమృతకుమారి , డాక్టర్ శ్రీదేవిలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు పీ4లో భాగంగా కృష్ణలంకలోని పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. పేద ప్రజలను ఆదుకొనేందుకు స్వచ్ఛంధ సంస్థలతో పాటు దాతలు కూడా ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఫిక్కీ ఫ్లో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి తదితరులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ మేకా రమేష్ తదితరులు

## 23 నుంచి పీబీ సిద్ధార్థలో జీవశాస్త్రాల సదస్సు

మొగల్రాజపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాలలో ఈ నెల 23 నుంచి రెండు రోజుల పాటు జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాల జంతుశాస్త్ర విభాగం, వృక్షశాస్త్ర విభాగం, జీవసాంకేతిక శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ ఈ సదస్సులో సీసీఎంబీ ప్రొఫెసర్ వైవీ నాంచారయ్య, సైంటిస్టు డాక్టర్ బి. కిరణ్‌కుమార్, సెంట్రల్ యూనివర్సిటీ బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ నరేష్, బిట్స్ పిలానీ నుంచి డాక్టర్ కే.నాగమోహన్, తిరుపతి ఐఐఎస్ఈఆర్‌కి చెందిన డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్ రాజేష్ జంపాల, వైస్ ప్రిన్సిపాల్ మనోరంజిని, డాక్టర్ పువ్వాడ శ్రీనివాసరావు, డాక్టర్ సాంబ నాయక్, డాక్టర్ కె. రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాజిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలి

- జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉదయభానుకు వినతి



భారతీనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని జనసేన నాయకులు, వంగవీటి మోహనరంగా సోషల్ ఆర్గనైజేషన్ సభ్యులు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుకి వినతిపత్రం అందించారు. బుధవారం గురునానక్ కాలనీలో ఉదయభానును కలిశారు. రాష్ట్రంలో కృష్ణాజిల్లాకి కచ్చితంగా వంగవీటి మోహనరంగా పేరే పెట్టే దిశగా తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం సామినేని ఉదయభాను మాట్లాడుతూ ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొని వెళ్లి కృష్ణాజిల్లాకి మోహనరంగా పేరు పెట్టే విధంగా కృషి చేస్తామన్నారు.



## 115 మందికి వైద్య పరీక్షలు

కానూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో జరుగుతున్న మెగా వైద్య శిబిరంలో రెండో రోజు బుధవారం 115 మంది వర్సిటీ సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్, ప్యూర్ విజన్ ఐ లేజర్ సెంటర్, పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్, ఆపిల్ డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈశిబిరంలో దంత, కంటి పరీక్షలు, కార్డియాలజీ పరీక్షలు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సుష్మాచౌదరి, కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. శివరాంప్రసాద్, ఫ్యాకల్టీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. వీసీ వెంకటేశ్వరరావు, ప్రో వీసీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్ పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు.

## విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన

కానూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు సైబర్ భద్రత, సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎన్ఎస్ఎస్ వర్సిటీ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గన్నవరం పోలీస్ స్టేషన్ ప్రతినిధులు ఉదయ్ కిరణ్, బేబీ, సామ్రాజ్యం, పూజితలు పాల్గొని పోక్సో చట్టం, సోషల్ మీడియా, బెట్టింగ్ యాప్‌ల వల్ల కలిగే ప్రమాదాలు, మాదక ద్రవ్యాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ టీచర్లకు అంతర్ బదిలీలు ఇవ్వండి

**ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్**

గాంధీనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల విడుదల చేయడంపై ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సోమరౌతు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మున్సిపల్ టీచర్స్‌కు అంతర్ మేనేజ్‌మెంట్ బదిలీలు కూడా నిర్వహించాలని కోరారు. భార్యాభర్తల్లో ఒకరు జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్ మరొకరు మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో పని చేస్తున్నవారికి కూడా అంతర్ మేనేజ్‌మెంట్ బదిలీలు ఎంతో అవసరమన్నారు. మెడికల్ గ్రౌండ్స్ కింద రిక్వెస్ట్ బదిలీలు కూడా నిర్వహించాలన్నారు.

## నగరాభివృద్ధికి సీఎం చర్యలు

**సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె**

మాచవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజకవర్గంలోని 4వ డివిజన్ సుబ్బారావు కాలనీలో బుధవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కర పత్రాలను పంచారు. స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.26 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ, జ్వాలా రాజారావు, వెలగపూడి సుబ్బారావు, డాక్టర్ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

## వరద బాధితులను ఆదుకునేందుకు సర్వం సిద్ధం

- జీడీఈటీ పునరావాస కేంద్ర ఇన్‌చార్జి శ్రావణి

పటమట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు పై నుంచి వరదనీరు ప్రకాశం బ్యారేజీకి భారీగా చేరుకుంటుంది. ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తి వరద నీటిని కిందకు వదలడంతో కృష్ణానది పరివాహక ప్రాంతాలైన రాణిగారితోట, రామలింగేశ్వరనగర్ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు పటమట గోవిందరాజు స్కూలులో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. సుమారు 500 మంది వరద బాధితులు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని పునరావాస కేంద్రం ఇన్‌ఛార్జి శ్రావణి తెలిపారు.

ప్రస్తుతం ఇక్కడ పరుపులు, దుప్పట్లు అవసరమైన మందులు ఏర్పాటు చేశామని, వరద బాధితులందరికీ ఆహార ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు.



పునరావాస కేంద్రంలో సిద్ధంగా ఉంచిన పరుపులు, దుప్పట్లు

## తూర్పులో కాపు కల్యాణ మండపం ఏర్పాటు చేయాలి

**రాష్ట్ర అధ్యక్షుడు అంజిబాబు**



20వ డివిజన్ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు

కృష్ణలంక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : తూర్పులో కాపు కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని, పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కృష్ణలంక 20వ డివిజన్‌కు ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం కమిటీని ఆయన బుధవారం నియమించారు. ఈ సందర్భంగా కృష్ణలంక సర్వీసు రోడ్డులోని సంక్షేమ సంఘం కార్యాలయంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. 20వ డివిజన్ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా దారపు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా రామిశెట్టి రాఘవరావు, ప్రధాన కార్యదర్శిగా అప్పికట్ల సత్యనారాయణలను నియమించారు. వెన్నా శంకర్, ముళ్లపూడి నాగేశ్వరరావు, నిమ్మల జ్యోతిక, బాసా రవి, ఉండి రవి తదితరులు పాల్గొన్నారు.



వినాయక చవితి రాటాను ఏర్పాటు చేస్తున్న ఫ్రెండ్స్ సర్కిల్ గణేష్ మహోత్సవ కమిటీ సభ్యులు

## వినాయక చవితి రాటా ఏర్పాటు

కృష్ణలంక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యం హోటల్ సెంటర్ గణేష్ మహోత్సవ కమిటీ అధ్వర్యంలో వినాయక చవితి పందిరి నిర్మాణానికి తొలుత రాటాను కమిటీ సభ్యులు బుధవారం ఏర్పాటు చేశారు. ముందుగా పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం రాటాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 27 నుంచి సెప్టెంబరు 6 వరకు వినాయక చవితి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



## విరిగిన సిమెంట్ చప్టా పొంచి ఉన్న ప్రమాదం

పటమట, ఆంధ్రజ్యోతి : 14వ డివిజన్‌కు చెందిన నల్లూరి సత్యనారాయణనగర్‌కు వెళ్లే రోడ్డు ప్రారంభంలో డ్రెయినేజీపై సిమెంట్ చప్టా పూర్తిగా విరిగిపోయింది. దానిపై కొన్ని ఇటుకలు, సిమెంట్ వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆటోలు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రమాదం జరగకముందే చప్టా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

# పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

● అప్రమత్తమైన అధికారులు ● పరివాహక గ్రామాల్లో హై అలర్ట్



ముక్త్యాల వద్ద పరుగులు పెడుతున్న కృష్ణమ్మ, ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** కృష్ణానదికి ఎగువ నుంచి వస్తున్న వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. పరివాహక గ్రామాలైన రావిరాల, వేదాద్రి, ముక్త్యాల వద్ద రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్ అధికారులు బుధవారం హై అలెర్ట్ ప్రకటించి గ్రామాల్లో బందోబస్తు నిర్వహించారు. పాలేరు, కృష్ణ సంగమ ప్రాంతం రావిరాల గ్రామం ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు గ్రామంలో పర్యటించారు. పులిచింతల నుంచి దిగువకు 14 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి 4.90 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలవుతున్నాయని అధికారులు అంటున్నారు. కృష్ణానదికి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ఆయా ప్రాజెక్టులు నిండి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. రెండు రోజుల్లో 5.50 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయవచ్చనే అంచనాలతో అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలోని కొండపై పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేస్తున్నారు. అంతే కాకుండా ఆయా శాఖల అధికారులు ఇంటింటికీ వెళ్లి వరదపై అవగాహన కలిగించటంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర సామగ్రి సిద్ధం చేసుకోవాలని పునరావాస కేంద్రానికి తరలేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పశు సంపదను సురక్షిత ప్రాంతాలకు పంపాలన్నారు. తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

## భవానీ ద్వీపానికి చేరువగా వరద..!

**ఆంధ్రజ్యోతి, విజయవాడ:** భవానీ ద్వీపానికి చేరువగా వరద ప్రవహిస్తోంది. కృష్ణానదికి బుధవారం రాత్రి 9గంటలకు బ్యారేజీకి 4.64 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ఎగువ నుంచి ఇంకా వరద పెరిగితే మాత్రం భవానీ ఐల్యాండ్‌లోకి నీరు ప్రవేశించే అవకాశం ఉంది. బుధవారం మాత్రం ఐల్యాండ్‌కు రెండడుగుల మట్టం దిగువ వరకు వరద వచ్చింది. ఈ నేపథ్యంలో పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులు బోటింగ్‌ను నిలిపేశారు. బోట్లన్నింటినీ బెర్మ్‌పార్క్ ఒడ్డున ఉన్న బోటింగ్ యూనిట్ వద్ద ఉంచారు. వరద ప్రవాహానికి బోట్లు కొట్టుకుపోకుండా పెద్దపెద్ద మోపులతో కట్టి బెర్మ్‌పార్క్‌లోని చెట్లకు బిగించి కట్టారు. ద్వీపానికి పూర్తిగా రాకపోకలు నిలిచాయి. మహారాష్ట్రలో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ఇంకా పెరిగే అవకాశం ఉంది. మరో లక్ష క్యూసెక్కుల వరద నీరు పెరిగితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. అప్పుడు మాత్రం భవానీ ఐలాండ్ మీదుగా వరద ప్రవహించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా ఏపీటీడీసీ సిబ్బంది భవానీ ద్వీపంలో ఫర్నిచర్‌ను కాటేజీలలోని ఎత్తు ప్రదేశాలలో భద్రంగా ఉంచారు. సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు.



ద్వీపానికి రెండు మూడు అడుగుల ఎత్తులో ప్రవహిస్తున్న కృష్ణమ్మ

### ప్రకాశం ఇన్‌ఫ్లో 4.73లక్షల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో 4.62లక్షల క్యూసెక్కులు

**విజయవాడ:** జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజ్‌కు వరద నిలకడగా కొనసాగుతోంది. ఈ రెండింటికీ ఇన్‌ఫ్లోలు సుమారుగా 4 లక్షల క్యూసెక్కుల వరకు ఉన్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజ్‌కు 4,73,707 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 69 గేట్లను పూర్తిస్థాయిలో పైకి ఎత్తి 4,62,560 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పాలేరు నుంచి 5152, కీసర నుంచి 17,933, పులిచింతల నుంచి 3,64,345 క్యూసెక్కుల నీరు వస్తోంది. తూర్పు, పశ్చిమ డెల్టాల పరిధిలోని కాల్వలకు 11,147 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ నుంచి 4,32,636 క్యూసెక్కుల నీరు వస్తోంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి 4,62,845 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరోపక్క బుడమేరు, మునేరుకు మాత్రం ఇన్‌ఫ్లో ఆగిపోయింది.

## వక్ఫ్ ఆస్తులు ముస్లింలకు ఉపయోగపడేలా చర్యలు

● మంత్రి ఫరూక్‌తో వక్ఫ్ బోర్డు చైర్మన్ భేటీ

**అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వక్ఫ్ బోర్డు అభివృద్ధి, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ముస్లింలకు సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఇరువురు చర్చించారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం సమాజ భవిష్యత్తుకు మూలస్తంభాలని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం సమాజానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముస్లిం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మహిళలకు వృత్తి ఆధారిత శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అజీజ్ తెలిపారు. వక్ఫ్ బోర్డు అభివృద్ధి, ముస్లింల సంక్షేమం కోసం అన్ని విధాల సహకారం అందిస్తామని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు భవిష్యత్తు, మైనార్టీలకు విద్య, ఉపాధి రంగాల్లో అవకాశాలు సృష్టించే దిశగా ముందుకు సాగుదామని భరోసా కల్పించారు.

### ఎయిమ్స్ కార్యవర్గ సభ్యునిగా డాక్టర్ తపన్ కుమార్ సాహో

మంగళగిరి ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కార్యవర్గ సభ్యునిగా మేజర్ జనరల్ డాక్టర్ తపన్ కుమార్ సాహోను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ అంకిత మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ నెల బాధ్యతలు స్వీకరించనున్నారు.

## మచిలీపట్నం నార్త్‌మండల ఆర్ఐను సరెండర్ చేయండి

● కలెక్టర్‌కు తహసీల్దార్ లేఖ

**మచిలీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** మచిలీపట్నం నార్త్‌మండలం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల మధ్య విభేదాలు ఇటీవల అధికమయ్యాయి. అధికారికి, సిబ్బందికి పొసగక ఒకరిపైనొకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకునే వరకు వెళ్లడం, కార్యాలయంలో ఎవరిచిత్తానుసారంగా వారు వ్యవహరించడం అధికారుల్లో చర్చకు దారితీస్తోంది. తాజాగా తహసీల్దార్ నాగభూషణం కార్యాలయంలో ఆర్ఐగా పని చేస్తున్న శేఖర్‌ను కలెక్టర్‌కు సరెండర్ చేయాలని తహసీల్దార్ ఆర్డీవో కార్యాలయానికి లేఖ రాయడం వివాదాస్పదమైంది. ఈనెల 13 నుంచి ఆర్ఐ శేఖర్ కార్యాలయానికి రావడం లేదని, రావాలని చెప్పినా, వినడం లేదని లేఖలో పేర్కొన్నారు. దీంతోపాటు ఈనెల 15న పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లకు ఆర్ఐ దూరంగా ఉన్నట్టు లేఖలో వివరించారు. అధికారులకు, ఆర్ఐకు మధ్య తీవ్ర విభేదాలు వల్లే ఆర్ఐ ఈనెల 13 నుంచి సెలవుపెట్టి విధులకు దూరంగా ఉన్నట్టు సమాచారం. ఆర్ఐ సెలవు పెట్టడానికి కొన్ని ఆర్థికపరమైన పరిపాలనపరమైన అంశాల్లో తేడాలు రావడంతోనే కార్యాలయానికి రావడం లేదని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. అయితే ఆర్ఐ మచిలీపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతున్నట్టు ఉద్యోగులు చెబుతున్నారు. కొన్నిరోజులుగా ఉద్యోగుల మధ్య విభేదాలు ముదిరి పాకాన పడ్డాయని, అందుకే ఆర్ఐను సరెండర్ చేయాలని తహసీల్దార్ లేఖ రాసేవరకు వ్యవహారం వెళ్లిందని వారు అంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఆశలు మీరి వ్యసనాలతో కటకటాలు

● వేర్వేరు చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు ● బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం



కేసుల వివరాలు చెబుతున్న ఏసీపీ దామోదరరావు

**విజయవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** రోజుకో యువతితో గడుపుతాడు. వాళ్లు ఎంత అడిగితే అంత ఇస్తాడు. అందుకోసం ఇళ్లకు కన్నం వేస్తాడు. ఇది ఓ ఆటోడ్రైవర్ నిజ స్వరూపం. ఆమెకు ఆభరణాలంటే ఆశ. ధగధగలాడే బంగారు వస్తువులు ధరించాలన్న కోరిక. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. దీంతో పనిచేసే ఇళ్లల్లో వస్తువులను మాయం చేసింది. ఆశలు, కోరికలతో చోరీలు చేస్తున్న ఈ ఇద్దరు వేర్వేరు వ్యక్తులను పటమట పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సెంట్రల్ జోన్ ఏసీపీ కే దామోదరరావు, పటమట ఇన్‌స్పెక్టర్ వీ పవన్‌కిషోర్, క్రైమ్స్ ఏఎస్ఐ గోపి బుధవారం వెల్లడించారు.

**శృంగారం కోసం చోరీలు**

గుంటూరు జిల్లా అడవితక్కెళ్లపాడులో నల్లపాడు పోలీస్‌స్టేషన్ ఎదురుగా న్యూరాజీవ్ గృహకల్ప అపార్టుమెంట్‌లో ఉంటున్న ఉప్పాల సురేష్ ఆటోడ్రైవర్. అతడికి భార్య, కుమార్తె. కొద్దిరోజుల క్రితం స్వర్ణభారతి నగర్‌లోని జేకేసీ రోడ్డులోకి నివాసం మార్చుకున్నాడు. ఏడో తరగతి వరకే చదువుకున్న సురేష్ చిన్న వయసులోనే వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఆటోడ్రైవర్‌గా మారక మరింత పెరిగాయి. గుంటూరులో ఆటో నడుపుతూ రోజుకో అమ్మాయిలతో గడిపేవాడు. వ్యభిచారగృహాలు నిర్వహించే వారితో సంబంధాలు నడుపుతూ మహిళలను లాడ్జిలకు తీసుకెళ్లేవాడు. తనతో గడిపిన యువతులు, మహిళలకు వేలాది రూపాయలిచ్చేవాడు. ఒక్కొక్కరికి రూ.7వేల నుంచి రూ.15వేల వరకు చెల్లించేవాడు. ఓ కళాశాల విద్యార్థిని అయితే రూ.20వేలు ఇచ్చాడు. తనతో గడిపే అమ్మాయిలు, మహిళలకు డబ్బులివ్వడానికి చోరీల మొదలుపెట్టాడు. ఈ క్రమంలో గత నెలలో సురేష్ బస్సులో హైదరాబాద్ వెళ్లాడు. కాచిగూడలో ఓ ఇంటి ముందు పెట్టిన బైక్‌ను 28న చోరీ చేశాడు. అక్కడి నుంచి బైక్‌పై విజయవాడకు చేరుకున్నాడు. గత నెల 31న అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు ఇంటికి సమీపాన ఉండే బైసాని జనార్ధన్ ఇంట్లో చోరీ చేశాడు. జనార్ధన్ తన కుమారుడికి 27న వివాహం చేసి, శ్రీశైలం దర్శనానికి వెళ్లారు. 31న రాత్రి ఇంట్లోకి చొరబడిన నిందితుడు బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించాడు. ఈనెల 1న ఇంటికి వచ్చిన పని మనిషి తాళాలు పగలుగొట్టి ఉండడాన్ని గమనించి సమాచారం ఇచ్చింది. చోరీ తర్వాత సురేష్ బైక్‌పై మళ్లీ హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఎక్కడ చోరీ చేశాడో అక్కడే బైక్‌ను పెట్టేశాడు. అక్కడి నుంచి రైలులో గుంటూరుకు చేరుకుని వినుకొండ వెళ్లాడు. అక్కడ కొన్ని వస్తువులను తాకట్టు పెట్టాడు. తర్వాత విశాఖపట్నం వెళ్లి అక్కడ కొన్ని వస్తువులను తాకట్టు పెట్టాడు. కొన్ని వస్తువులను మాత్రం తన వెంట పెట్టుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలను పరిశీలించి సురేష్‌ను బెంజ్‌సర్కిల్ వద్ద బుధవారం అరెస్టు చేశారు. అతడి నుంచి 130 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై వినుకొండ, గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్లలో కేసులున్నాయి.

**ధగ'ధగా'..!**

పెనమలూరు మండలం కానూరుకు చెందిన దేవరకొండ తేజశ్రీ ఇళ్లలో పనులు చేస్తుంటుంది. భర్త వెంకటరత్నం కారుడ్రైవర్. తేజశ్రీకి బంగారు ఆభరణాలంటే ఇష్టం. వాటిని ధరించి ధగధగ మెరవాలన్నది కోరిక. ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదు. అందుకే ఆమె తన కంటపడినవన్నీ కాజేయాలని నిర్ణయించుకుంది. అన్నపూర్ణ థియేటర్ యజమాని అడుసుమిల్లి బాబు శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ 5వ నంబరు రోడ్డులో నివాసం ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం తేజశ్రీ పనికి చేరింది. బాబు, ఆయన సతీమణి శివలీల మాత్రమే ఉంటారు. ఇంటి ఆవరణలో తేజశ్రీ కుటుంబం ఉండడానికి గదిని కేటాయించారు. తేజశ్రీ కాకుండా మరో ఇద్దరు ఇంట్లో పనిచేస్తారు. వాళ్లిద్దరూ రోజు వచ్చి పని ముగించుకుని వెళ్లిపోతారు. తేజశ్రీ మాత్రమే ఇంట్లో ఉంటోంది. 4 రోజుల క్రితం తేజశ్రీ ఇంట్లో పనిచేస్తూ గదిలోని బంగారు ఆభరణాలు మాయం చేసింది. శివలీల పని మనుషులను ప్రశ్నించారు. తమకేమీ తెలియదని వారు చెప్పడంతో పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కొన్ని వేలిముద్రల నమూనాలను సేకరించారు. వాటిలో తేజశ్రీ వేలిముద్రలు సరిపోవడంతో అరెస్టు చేశారు. నిందితురాలి నుంచి 40 గ్రాముల వజ్రాలు పొదిగిన బంగారు గాజులు, 114 గ్రాముల వివిధ ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.13.80 లక్షలు ఉంటుందని తెలిపారు.

## ఏపీ నిట్‌లో బీటెక్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన

● తొలి రోజు 86 మంది విద్యార్థులకు ప్రవేశాలు

**తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో బీటెక్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం నుంచి ప్రారంభమైంది. నిట్ విద్యాసంస్థలో మొత్తం 8 కోర్సులు నిర్వహిస్తుండగా ఆయా కోర్సులలో మొత్తం 484 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 శాతం సీట్లను రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన సీట్లను జోసా, సీసాబ్ కౌన్సెలింగ్ ద్వారా ఇతర విద్యార్థులతో భర్తీ చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 2025-26 సంవత్సరానికి సంబంధించి అన్ని సీట్లకు కేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పరిశీలన కేంద్రంలో విద్యార్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవడంతో పాటు ఫీజులు చెల్లించి కోర్సులలో చేరుతున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 23వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని నిట్ అధికారులు తెలిపారు. అడ్మిషన్ల విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నట్టు డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరాం తెలిపారు. తొలి రోజు మొత్తం 86 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్టు తెలిపారు.

## తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

● ఈ నెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహణ

● 29న సీఎం చేతుల మీదుగా పతకాల పంపిణీ: శాప్ చైర్మన్

**అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** తిరుపతిలో "అమరావతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29వ తేదీన విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తారని రవినాయుడు స్పష్టం చేశారు.

## మహిళా సాధికార సదస్సుకు హాజరుకానున్న గవర్నర్

**అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** సెప్టెంబర్‌లో తిరుపతిలో జరిగే దేశంలోని చట్టసభల మహిళా సాధికారిత కమిటీల సభ్యుల సదస్సుకు హాజరుకావాలని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ స్యూరదేవర ప్రసన్నకుమార్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కోరారు. బుధవారం ఉదయం రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ తరఫున గవర్నర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. స్పీకర్ విన్నపం మేరకు సదస్సుకు హాజరు అయ్యేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ అంగీకరించారు.



## రెండో విడతపై ఆలోచించి అడుగేయండి

● సిటీజన్ ఫర్ డెమోక్రసి చర్చా వేదికలో అమరావతి రైతులు, నగర ప్రముఖులు

● ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలి, ఏకపక్ష నిర్ణయాలకు పోతే ముప్పే

● తొలి విడతలో భూములిచ్చిన తమకు వెంటనే న్యాయం చేయాలని రైతుల డిమాండ్

● ఆ తరువాతనే రెండో విడత భూ సమీకరణకు వెళితే మంచిదని ప్రభుత్వానికి సూచన

**విజయవాడ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** ఏకపక్ష నిర్ణయాలతో రాజధానిలో రెండో విడత భూముల సమీకరణకు వెళితే చిక్కుల్లో పడటం ఖాయమని పలువురు రైతులు, నగర ప్రముఖులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి రెండు, మూడు, నాల్గొవ విడతల్లో భూములను తీసుకోవడం అత్యవసరమనే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూనే తొలి విడతలో 34వేల ఎకరాలు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని, రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. రెండో విడత భూసమీకరణ అవసరమా.. కాదా.. అనే అంశంపై సిటిజన్ ఫర్ డెమొక్రసీ విజయవాడ నగరంలో బుధవారం చర్చా వేదికను బుధవారం నిర్వహించింది. సిటిజన్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్, సభ్యులు డాక్టర్ ఎంసీ దాస్, జంధ్యాల శంకర్ నిర్వహించారు. ఒకరిద్దరు మినహా రెండో విడత భూ సమీకరణ అవసరమేననే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తొలి విడతలో భూములిచ్చిన రైతులను ఇప్పటికీ సీఆర్‌డీఏ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఇప్పటి వరకు జేఏసీ నేతలకు మంత్రి నారాయణ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం మూడునాలుగేళ్లలో అయిపోదనే విషయం తమకూ తెలుసనన్నారు. తొలి విడతలో భూములిచ్చిన 69 వేల మంది రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్స్‌ను అభివృద్ధి చేసి, రైతులను సంతోషింపజేసి, రెండో విడతకు వెళితే బాగుంటుందని ప్రభుత్వానికి సూచించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం 20 రోజుల్లో 34 వేల ఎకరాల్లో ఉన్న జంగిల్‌ను క్లీయర్ చేసిందని, ప్రభుత్వం సహృదయంతో తలుచుకుంటే తమ రిటర్నబుల్ ప్లాట్లు అభివృద్ధి చేయడం ఎంత సేపు పడుతుందని ప్రశ్నించారు. డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, డాక్టర్ సమరం, సీఏ మల్లిఖార్జునరావు, అమరావతి జేఏసీ నాయకులు, రైతులు అపర్ణ, వరలక్ష్మీ, యుగంధర్, ప్రియాంక, గాంధీ, భాస్కరరావు, సత్యనారాయణ, మోహన్‌ప్రసాద్, బసవయ్య, నరసింహారావు, సుధాకర్, తిరుపతిరావు, రాజేంద్రప్రసాద్, జయకృష్ణ, సర్వేశ్వరరావు, శ్యాంప్రసాద్, లక్ష్మీనారాయణ, రామలింగయ్య, కిరణ్, అశోక్, నారాయణప్రసాద్ వారివారి అభిప్రాయాలు చెప్పారు. తటస్థ వ్యవస్థ ద్వారా అమరావతి రైతులు అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని సిటిజన్ ఫర్ డెమొక్రసి కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

## లింగబేధాలు లేనప్పుడే అభివృద్ధి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ

**విజయవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** ప్రతివ్యక్తికి అవకాశాలు, వనరులు, నాయకత్వ లక్షణాల్లో లింగబేధాలు లేనప్పుడే అందరికీ భవిష్యత్తు లభిస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో 'సమాన భవిష్యత్తును రూపొందించడం - సమతుల్యతతో నాయకత్వం' అనే థీమ్‌తో నిర్వహించిన లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌కు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. లింగ సమానత్వం, మహిళా సాధికారిత పెంపొందించడంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ కాన్‌క్లేవ్ ఒక కొత్త నాయకత్వం ఏర్పడడానికి, లక్షణాలు పెంపొందించుకోవడానికి అద్భుతమైన వేదికని ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ రాష్ట్ర చైర్‌ఉమెన్ (ఐడబ్ల్యూఎన్), అవెరా సహ వ్యవస్థాపకురాలు చందిని చందన అన్నారు. డీసీపీ సరిత మాట్లాడుతూ లింగబేధం లేని నాయకత్వం అనేది స్థిరమైన వృద్ధికి మూలస్తంభమన్నారు. వైవిధ్యభరిత నాయకత్వ బృందాలున్న సంస్థలు 19 శాతం అధిక ఆవిష్కరణలకు అవకాశం ఉందని, లింగబేధం లేనిచోట పోటీతత్వాన్ని ఉంటుందన్నారు. ఐడబ్ల్యూఎన్ సదరన్ రీజన్ డిప్యూటీ చైర్‌పర్సన్, ఆర్కా ఇండియా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రియ బాలగోపాల్, సీఐఐ రాష్ట్ర చైర్మన్ మురళీ కృష్ణ గన్నమని, చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి, ఇండ్లాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ ఇండ్ల, ఐడబ్ల్యూఎన్ రాష్ట్ర వైస్ చైర్ పర్సన్ డాక్టర్ ఉషా పాంటుల పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు, ప్రొ వీసీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్ర తదితరులు

## జాతీయ రోబోటిక్స్ పోటీలకు సిద్ధార్థ ఆతిథ్యం

● వచ్చేనెల 18, 19న రోబో ఎక్స్-2025

**కానూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం జాతీయ రోబోటిక్ పోటీలకు ఆతిథ్యం ఇస్తుంది. రోబో ఎక్స్-2025 పేరున సెప్టెంబర్ 18, 19న సిద్ధార్థ వర్సిటీలో ఈ పోటీలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలోని వీసీ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొ వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం రవిచంద్ర, పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోబో ఎక్స్-2025 అనేది విద్యార్థుల మధ్య ఒక పోటీ మాత్రమే కాదని, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే వేడుకన్నారు. ఇందులో భాగంగా రోబోటిక్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు ముఖ్యంగా స్మార్ట్ ఆటోమేషన్, మెకాట్రోనిక్స్, ఏ1- ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్‌పై జరుగుతాయన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్ రవికుమార్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్‌లు డాక్టర్ జీ దిల్లీబాబు, డాక్టర్ ఎం సుమలత, డాక్టర్ బీ సుప్రజరెడ్డి, విద్యార్థి కో-ఆర్డినేటర్లు జే తేజ అమరేశ్వర్, ఎం ఫయాజ్, ఎం ప్రవల్లిక, ఎస్ హర్షిత పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ విక్రయాన్ని అడ్డుకోవాలి

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



**గాంధీనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** వ్యవసాయ పంపుసెట్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించరాదని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు స్వాగతించారు. నివాస గృహాలు, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడా బిగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. విద్యుత్ బిల్లు 2020 పార్లమెంట్‌లో చట్టం కాకపోయినా ఎలక్ట్రీసిటీ రూల్స్ 2020 ద్వారా బడా విద్యుత్ ఉత్పత్తిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు రూపొందించబడిన టారిఫ్ విధానానికి స్వస్తి పలికి రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులను అధిక విద్యుత్ బిల్లుల బారి నుంచి తప్పించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన షిరిడి సాయి ఎలక్ట్రికల్ సంస్థకు చెందిన ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు నెల్లూరు జిల్లా కరేడు గ్రామం వద్ద మామిడి తోటలతో పాటు మూడు పంటలు పండే వ్యవసాయ భూములు 8360 ఎకరాల భూసేకరణపై రాష్ట్ర ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. 32మంది బలిదానాలతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను డిసెంబర్‌లోగా వందశాతం విక్రయించేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. ఈ చర్యను నిలుపుదల చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అడ్డుకోవాలని లేదంటే భవిష్యత్‌లో రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. సుమారు రూ.5 లక్షల కోట్ల విలువైన ప్లాంట్ భూములను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు.



ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, రమణను సత్కరిస్తున్న ఎన్జీవో నేతలు

## ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల అసంతృప్తి

● ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

**గాంధీనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):** జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన విద్యాసాగర్, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఎన్జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి డీవీ రమణను గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో బుధవారం ఎన్జీవో నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఇది జాతీయస్థాయిలో ఏపీ ఎన్జీవో నాయకత్వానికి దక్కిన గౌరవమన్నారు. ఉద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఉద్యోగుల చట్టబద్ధమైన అన్ని హక్కులను సాధిస్తామన్నారు. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వీవీ ప్రసాద్, కార్యదర్శి పీ రమేష్, కోశాధికారి బీ సతీష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీ రమణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే నజీరుద్దీన్, ఉపాధ్యక్షుడు సీహెచ్ మధుసూదనరావు, ఖాసీం సాహెబ్, శ్రీనివాసరావు, పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు, మహిళా ప్రతినిధి రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 21 ఆగస్టు 2025

అందం... దీనితో పాటుగా అనేక కళలలో ప్రతిభ... ఈ రెండు ఉన్న వ్యక్తులు అరుదుగా ఉంటారు. ఈసారి మిస్ యూనివర్స్ పోటీల్లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మణికా విశ్వకర్మ ఈ అరుదైన వ్యక్తుల్లో ఒకరు. ఆమె గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం.

# అందం... ప్రతిభ... కలబోత 'మణిక'



## ఎవరీ మణిక?...

రాజస్థాన్‌కు చెందిన మణిక ప్రస్తుతం ఢిల్లీలో పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చదువుతోంది. కేవలం చదువులోనే కాకుండా అనేక కళలలో కూడా ఆమెకు ప్రవేశం ఉంది. తను చిన్నప్పుడే శాస్త్రీయ నృత్యం నేర్చుకుంది. భారతీయ విదేశాంగ శాఖ విదేశాలలో నిర్వహించిన అనేక కార్యక్రమాలలో ఆమె నృత్య కళాకారిణిగా పాల్గొంది. మణిక మంచి పెయింటర్ కూడా! ఆమెకు లలిత కళా అకాడమీ నుంచి అవార్డులు కూడా లభించాయి. నరాలకు సంబంధించిన వ్యాధులతో పుట్టిన చిన్నారులకు సాయం అందించటానికి మణిక 'న్యూరోనోవా' అనే ఒక సంస్థను స్థాపించింది.

## గెలవటానికి కారణమయిన ప్రశ్న ఇదే!

'మిస్ యూనివర్స్ ఇండియా- ఫైనల్స్'లో - "మహిళలకు విద్యను అందిస్తారా లేక పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తారా?" అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం వల్ల ఆమె ఈ పోటీని గెలవగలిగింది. "నేను మహిళకు విద్యను అందించటానికే ఇష్టపడతాను. ఎందుకంటే మహిళలకు విద్యను అందిస్తే- వారి ఒక్కరి జీవితం మాత్రమే కాదు... వారి కుటుంబాల భవిష్యత్తు, సమాజం భవిష్యత్తు, దేశం భవిష్యత్తు మారుతుంది" అని ఆమె ఇచ్చిన జవాబును జడ్జీలు మెచ్చుకున్నారు.

## సూటిగా, స్పష్టంగా...

మణిక తన అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా చెబుతుంది. పోటీలో గెలిచిన తర్వాత- "చాలా మంది గెలిచిన తర్వాత తాము ఎంత కష్టపడ్డారనే విషయాన్ని చెబుతారు. కానీ నేను నాకు లభించిన మద్దతు గురించి మాట్లాడాలనుకుంటున్నా. నా కుటుంబం నాకు చిన్నప్పటి నుంచి ఎంతో మద్దతు ఇచ్చింది. నేను ఒక చిన్న పట్టణం నుంచి వచ్చాను. అయినా నేను ఈ రోజున ఈ పోటీలో గెలిచానంటే- నా కుటుంబంతో పాటుగా నా టీచర్ల పాత్ర కూడా ఎంతో ఉంది. అందుకే నేను పడిన కష్టాల గురించి కాకుండా- వారు నాకు ఇచ్చిన మద్దతు గురించి చెప్పాలనుకుంటున్నా" అని తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది.

## మిస్ యూనివర్స్ పోటీ గురించి...

"అందాల పోటీలు ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబింపచేస్తాయి. దీనిలో గెలిస్తే- కొన్ని లక్షల మందికి స్ఫూర్తిని ఇవ్వొచ్చు. నేను అలాంటి స్థితిలో ఉన్నాననే భావన ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. 'మిస్ రాజస్థాన్' నుంచి .మిస్ యూనివర్స్ ఇండియా - ఫైనలిస్ట్'గా మారటం వెనుక ఒక ప్రస్థానం ఉంది. ఈ ప్రస్థానంలో ఎటువంటి అనిశ్చితి లేదు. నా మీద నాకు



అపారమైన నమ్మకం ఉంది. అది పునాదిగా పనిచేసింది. ఈ పునాదిపై ఏకాగ్రత, లక్ష్యం అనే భావనల ఆధారంగా ఒక సౌధాన్ని నిర్మించగలిగాను" అని ఆమె పేర్కొంది.



విజేత

కాళ్లకు చక్రాలు కట్టుకొని...
రయ్యిన దూసుకుపోతుంటే...
ఇదేదో బాగుందనుకుంది.
అమ్మానాన్నల అండతో సరదాగా స్కేటింగ్ రింక్‌లోకి దిగింది.
అలా నాలుగేళ్లప్పుడు మొదలై...
ఎన్నో పతకాలు వశమై...
ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతోంది.
'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' గ్రహీత... ఆసియా రోలర్ స్కేటింగ్ రజత పతక విజేత...
పధ్నాలుగేళ్ల మాత్రపు జెస్సీరాజ్‌తో 'నవ్య' మాటామంతి.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి బాల పురస్కార్ అవార్డు అందుకుంటున్న జెస్సీ రాజ్

# స్కేటింగ్ రాజ్

"అప్పుడు నాకు నాలుగేళ్లు. మా అమ్మానాన్న రాధ, సురేష్ నన్ను ఏలూరు ఇండోర్ స్టేడియానికి తీసుకువెళ్లారు. అక్కడ స్కేటింగ్ రింక్ చూపించి... 'ఇదేదో గేమ్ బాగుంది... నేర్చుకొంటావా' అని అడిగారట. నేను సరే అన్నానట. వెంటనే స్కేటింగ్ శిక్షణలో చేర్చారట. మాది ఏలూరు జిల్లా దెందులూరు మండలం జోగన్నపాలెం. వారంలో రెండు మూడు రోజులు శిక్షణ కోసం ఏలూరు తీసుకువెళ్లేవారు. సాధనలో చిన్న చిన్న దెబ్బలు తగులుతుండేవి. దాంతో భయపడి స్కేటింగ్ మానేశాను. తరువాత మా కుటుంబం మంగళగిరికి వచ్చి స్థిరపడింది. నాకు మళ్లీ స్కేటింగ్ నేర్చుకోవాలని అనిపించింది. దాంతో విజయవాడ దండమూడి రాజగోపాలరావు స్టేడియానికి తీసుకువెళ్లారు. అక్కడ కోచ్ సింహాద్రి వద్ద శిక్షణకు చేర్చారు.

## తొలి పోటీలోనే...

రింక్‌లో వేగంగా కదలాలంటే రన్నింగ్ అవసరమని కోచ్ చెప్పారు. దాంతో రన్నింగ్‌లో కూడా శిక్షణ ప్రారంభించాను. వారంలో మూడు రోజులు పరుగు, మూడు రోజులు స్కేటింగ్. నాన్న నన్ను వెంటబెట్టుకొని స్టేడియానికి తీసుకువెళ్లేవారు. సాధనలో దెబ్బలు తగులుతుండేవి. 'వాటికి భయపడితే ఆటలో ముందుకు వెళ్లలేవు' అని నాన్న చెప్పారు. ఆ మాటలు నాలో పట్టుదలను పెంచాయి. ప్రొఫెషనల్ స్కేటర్‌ను అవ్వాలని అనుకున్నాను. దాని కోసం పదేళ్ల వయసులో ఆర్టిస్టిక్ సోలో డ్యాన్స్ స్కేటింగ్‌లో అభ్యాసం ప్రారంభించాను. 2020లో విజయవాడలో జరిగిన కృష్ణా జిల్లా అండర్-14 విభాగంలో పాల్గొన్నాను. తొలి పోటీలోనే రజత పతకం గెలుచుకున్నాను. మరుసటి ఏడాది జిల్లా స్థాయిలో రజతం, అనంతరం జరిగిన రాష్ట్ర స్థాయి ఈవెంట్‌లో రజతం, కాంస్యం సాధించాను. జాతీయ పోటీలకు ఎంపిక అయ్యాను.

## అంతర్జాతీయ స్థాయికి...

ఎంతో ఉత్సాహంతో మొహలీలో జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. అయితే అనుకున్నంతగా రాణించలేకపోయినా... రెండు కాంస్య పతకాలు గెలుచుకున్నాను. మెరుగైన ఫలితాలు రావాలంటే మరింత కష్టపడాలని అర్థమయింది. ఏకాగ్రతతో సాధన చేశాను. 2022లో చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం నెగ్గాను. అది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కానీ అసలైన పరీక్ష నాకు న్యూజిలాండ్‌లో ఎదురైంది. గత ఏడాది జూన్‌లో అక్కడ నిర్వహించిన పసిఫిక్ ఓషియానా చాంపియన్‌షిప్ అండర్-14 విభాగంలో పోటీపడ్డాను. దీని కోసం భారత్ నుంచి 18 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. వారందరినీ దాటి నేనొక్కదాన్నే చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాను. స్వర్ణ పతకం గెలుచుకున్నాను. అదే ఏడాది జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గాను. గడచిన నాలుగున్నరేళ్లలో పాల్గొన్న ప్రతి ఈవెంట్‌లో పతకాలు సాధిస్తున్నాను.

**రన్నింగ్‌లో కూడా...**

**నా ప్రథమ ప్రాధాన్యం స్కేటింగ్‌కే. అలాగని రన్నింగ్‌ను వదిలేయలేదు. జిల్లా, రాష్ట్ర స్థాయి 100, 200, 400 మీటర్ల పరుగు పందేల్లో పాల్గొంటున్నాను. వాటిలో ఇప్పటికి 20 పతకాలు సాధించాను. స్కేటింగ్‌లో అయితే 56 పతకాలు నెగ్గాను. అందులో 23 స్వర్ణాలు, 22 రజతాలు ఉన్నాయి. నాతోపాటు మా తమ్ముడు జోయల్ ఆదర్శ్ కూడా స్కేటింగ్‌లో శిక్షణ తీసుకొంటున్నాడు. వాడికి టెక్నిక్స్ నేర్పుతున్నాను.**

## బాల పురస్కార్...

2024 నా కెరీర్‌లోనే మరిచిపోలేని సంవత్సరం. న్యూజిలాండ్‌లో విజయం తరువాత 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' దక్కింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైంది నేను ఒక్కదాన్నే అని తెలిసి ఎంతో గర్వంగా అనిపించింది. గత ఏడాది డిసెంబరు... ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ అవార్డును అందుకున్నా. అది నాకు ఎనలేని ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చింది. అనంతరం ఈ ఏడాది మార్చిలో జరిగిన తైవాన్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటాను. రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం గెలిచాను. అంతేకాదు... గత నెల 24 నుంచి 29 వరకు దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించాను.

## లక్ష్యం... ఒలింపిక్స్...

స్కేటింగ్‌లో నేను మరిన్ని అద్భుత విజయాలు అందుకోవాలని అమ్మానాన్న ఆకాంక్షిస్తున్నారు. దాంతోపాటు రన్నింగ్‌లో కూడా చాంపియన్‌గా ఎదగాలని నేను కోరుకొంటున్నాను. రెండిటినీ నెరవేర్చాలనే దృఢ సంకల్పం నాది. ప్రస్తుతం విజయవాడ ఎస్ఎస్ఎం స్కూల్లో పదో తరగతి చదువుతున్నా. చదువులో కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించి... ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలని అనుకొంటున్నా. అన్నిటికంటే పెద్ద లక్ష్యం... ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి, పతకం సాధించడం. దాని కోసం మెరుగైన శిక్షణ తీసుకొంటున్నా. కఠోర సాధన చేస్తున్నా."

• పి.దుర్గారావు
దెందులూరు

కౌన్సెలింగ్

# ఈ అసహజ లక్షణాలు ఎందుకు?



**Q** డాక్టర్! మా బాబుకు పదేళ్లు. మిగతా పిల్లలతో పోలిస్తే బాబు శిశ్నం మరీ చిన్నదిగా, ఉందా లేదన్నట్టుగా ఉంది. వృషణాల ఎదుగుదల కూడా చాలా తక్కువ. భౌతిక లక్షణాలే కాకుండా బాబు ప్రవర్తన కూడా ఆడపిల్లల్లాగే ఉంది. అదే ఈడు మగపిల్లల్లా కాకుండా ఆడపిల్లలని మరిపిస్తున్నాడు. వాడి పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఏం చేయమంటారు?

- ఓ సోదరి, వరంగల్.

**A** మీరు చెప్పిన లక్షణాలు అసహజంగానే అనిపిస్తున్నాయి. అయితే ఇంత చిన్న వయసులో కేవలం లక్షణాల ఆధారంగా పిల్లల జెండర్‌ను నిర్ధారించడం సరికాదు. అలాగని అలక్ష్యం కూడా చేయకూడదు. బాబుకు పుట్టుకతో సంక్రమించిన జెండర్‌ను తెలుసుకోవాలనుకుంటే క్రోమోజెమ్ అనాలసిస్ పరీక్ష 'కార్యోటైపింగ్' చేయించాలి. ఈ పరీక్షలో బాబు క్రోమోజోమ్స్‌నుబట్టి ఆడా, మగా? అన్నది కచ్చితంగా నిర్ధారించవచ్చు. ఒకవేళ పరీక్షలో ఎక్స్, వై అనే పురుష క్రోమోజోములు ఉండి, లక్షణాలు మాత్రమే విరుద్ధంగా ఉంటే, యుక్తవయసుకు చేరుకునేవరకూ ఆగక తప్పదు. 18 ఏళ్ల వయసుకు బాబుకు నిర్దిష్ట వ్యక్తిత్వం రూపుదిద్దుకున్న తర్వాత సైకియాట్రిస్టు, ఆండ్రాలజిస్ట్‌ల సహాయంతో మరికొన్ని కీలక పరీక్షలు జరిపి, తర్వాతే సెక్సువల్ ఓరియెంటేషన్ అవసరాన్ని గమనించాలి. కొంతమంది పురుష క్రోమోజోములతో మగపిల్లలుగానే పుట్టినా పెంపక లోపాల వల్ల, పరిసరాల ప్రభావం కారణంగా ఆడపిల్లల్లా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇలాంటి పిల్లలను కౌన్సెలింగ్‌తో సరిచేయవచ్చు. ఒకవేళ బాబుకు పరీక్షల్లో ఎక్స్, ఎక్స్ క్రోమోజోములు ఉన్నాయని తేలితే, దాన్ని జన్యుపరమైన లోపంగా భావించి, 18 ఏళ్లు దాటిన తర్వాత అవసరాన్ని బట్టి, మనస్తత్వం, వ్యక్తిత్వం, నిర్ణయాల ఆధారంగా సర్జరీ చేయించవచ్చు. ఈ పరిస్థితి ఆడపిల్లల్లో కూడా ఉంటుంది.

## సెక్సువల్ ఓరియెంటేషన్ సర్జరీ

ఇది ఎంతో సంక్లిష్టమైన సర్జరీ! కృత్రిమ యోని, పురుషాంగాలను నిర్మించి, అవసరమైన హార్మోన్లను అందించే సర్జరీ ఇది. ఈ సర్జరీ ద్వారా రూపొందించిన మర్మాంగాలు నూటికి నూరు శాతం సహజసిద్ధంగా పని చేస్తాయని అనుకోకూడదు. పురుషాంగం నిర్మించగలిగినా అది అన్ని విధాలుగా ఉపయోగపడకపోవచ్చు. అలాగే యోని కూడా! అవసరమైన కండరాలను దగ్గరకు చేర్చి, యోని నిర్మాణం జరిగినా, దాన్ని డైలేటర్లతో క్రమం తప్పక వెడల్పు చేసుకుంటూ ఉండాలి. ఇలాంటి ఎన్నో ఇబ్బందులను జీవితాంతం భరించక తప్పదు. కాబట్టి సెక్సువల్ ఓరియెంటేషన్ సర్జరీకి ముందు వైద్యులు సదరు వ్యక్తులకు, కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తారు. దాంతో కొందరు సర్జరీతో అవసరం లేకుండా అలాగే ఉండిపోవడానికి నిశ్చయించుకుంటే, మరికొందరు సర్జరీకి ఆసక్తి కనబరుస్తారు. ఇదంతా అనుభవజ్ఞులైన మానసిక నిపుణులు, ఆండ్రాలజిస్ట్, సెక్సువల్ స్పెషలిస్టుల పర్యవేక్షణలో సాగుతుంది.

**డాక్టర్ రాహుల్ రెడ్డి**
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్.

# బెల్లంతోనూ ఫేస్‌ప్యాక్!

అందంగా కనిపించేందుకు అనేక రకాల ఫేస్‌ప్యాక్‌లు, స్క్రబ్‌లు వాడుతుంటారు. వంటింట్లో ఉండే బెల్లంతో కూడా ఫేస్‌ప్యాక్ తయారుచేసుకుని చర్మాన్ని మెరిపించవచ్చు. మరి వాటిని ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం...

- గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ బెల్లం తురుమును వేయాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ తేనె, టేబుల్ స్పూన్ పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని పదిహేను నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఈ ప్యాక్ చర్మం తేమ కోల్పోకుండా సహాయపడుతుంది.
- ఒక టేబుల్ స్పూన్ బెల్లం తురుములో టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు వేసి బాగా కలిపి పేస్టులా తయారు చేయాలి. దీనిని ముఖానికి రాసుకుని ఇరవై నిమిషాల తరువాత కడిగేసుకోవాలి. ఇది చర్మాన్ని నునుపు చేస్తుంది.
- టేబుల్ స్పూన్ బెల్లం తురుములో తేనె, పసుపు, నిమ్మరసం ఒక్కో టేబుల్ స్పూన్ చొప్పున వేసి బాగా కలపాలి. దీనిని ముఖానికి రాసుకుని 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగాలి. ఈ ప్యాక్ మొటిమలను తగ్గించి, చర్మాన్ని నిర్విషీకరణ చేస్తుంది.
- టేబుల్ స్పూన్ బెల్లం తురుములో టేబుల్ స్పూన్ గంధం పొడి, టేబుల్ స్పూన్ రోజ్ వాటర్ పోసి బాగా కలిపాలి. దీనిని ముఖానికి రాసి పదిహేను నిమిషాల తరువాత కడిగేయాలి. వారానికి రెండు మూడు సార్లు ఇలా చేస్తే చర్మం సహజ మెరుపు సంతరించుకుంటుంది.



# వీరికి కుక్కలే కుటుంబం!

**అందరూ ఉండి అనాథలుగా మారిన ఇద్దరు మహిళలు వీధి కుక్కలనే ఆత్మీయులుగా ఆదరించారు. వాటిని కన్నబిడ్డల్లా కాపాడుకుంటూ, మూగ జీవాల పట్ల తమ ప్రేమను ప్రదర్శించుకుంటున్నారు. ఆ ఇద్దరు మహిళల ఆసక్తికరమైన కథల గురించి తెలుసుకుందాం!**



ఆమె అసలు పేరు ప్రతిమా దేవి. కానీ ఆమె 'డాగ్ అమ్మ'గా పేరు తెచ్చుకుంది. ఆ పేరుకు తగ్గట్టే 200 వీధికుక్కలకు తల్లిగా మారిందామె. ఢిల్లీకి చెందిన ఈ 80 ఏళ్ల మహిళ కొన్నేళ్లుగా వీధికుక్కల ఆకలి తీరుస్తోంది. టీ దుకాణం నడుపుతూ, చెత్తను సేకరిస్తూ, పొట్ట పోసుకునే ప్రతిమ, 1984లో పశ్చిమ బెంగాల్‌లోని, నందిగ్రామ్ నుంచి ఢిల్లీలోని సాకేత్‌కు చేరుకున్నప్పటి నుంచి వీధికుక్కలను ఆదరించడం మొదలుపెట్టింది. ఎన్నో ఏళ్లుగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి వ్యతిరేకతలు, అవరోధాలు ఎదుర్కొంటున్నప్పటికీ వెనకడుగు వేయకుండా, తనకొచ్చే సంపాదనతో, ఇతరుల ఆర్థిక సహాయంతో వీధికుక్కల పోషణను చేపడుతోంది. ప్రతి రోజూ సివిక్ వ్యాన్ ద్వారా అందే పాలు, మాంసాలతో వీధికుక్కల ఆకలి తీరుస్తోందామె. మూగజీవాల పట్ల ప్రతిమ కనబరుస్తున్న ఆపేక్షకు ముగ్ధులైన ఇరుగుపొరుగు ఆమె టీ దుకాణాన్ని సందర్శిస్తూ, తోచిన మార్గంలో సహాయపడుతూ ఉండడం విశేషం. వీధికుక్కలకు చేస్తున్న సేవలకుగాను, ప్రతిమకు పలు జంతు సంక్షేమ సంస్థల నుంచి అవార్డులు కూడా అందాయి.

## గూడు చెదిరినా...

ప్రతిమ తన గతం గురించి గుర్తు చేసుకుంటూ.. "నాకు ఏడేళ్లకే పెళ్లైంది. నాకంటే పదేళ్ల పెద్ద వ్యక్తి నాకు భర్తయ్యాడు. అతనొక తాగుబోతు. ప్రతి రోజూ నన్ను చితకబాదేవాడు. అత్తగారింట నేనెన్నో కష్టాలు పడ్డాను. మొదటి బిడ్డ పుట్టిన తర్వాత భర్త నుంచి విడిపోయి, ఇళ్లలో పనులు చేయడం మొదలుపెట్టాను. ఆ తర్వాత కొంతకాలం పాటు కోల్‌కతాలో పని చేసి, ఢిల్లీకి వచ్చేశాను. మొదట్లో నటుడు రాహుల్ దేవ్ ఇంట్లో పని చేశాను. నేను వండిన పరోటాలను ఆయన ఇష్టంగా తినేవారు. ఆయన ఇప్పటికీ నన్ను కలుస్తూ, ఆర్థికసహాయం అందిస్తూ ఉంటారు" అంటూ చెప్పుకొస్తోంది ప్రతిమ. ఈ ప్రయాణంలో ఆమె కొన్ని క్లిష్టమైన సవాళ్లను కూడా ఎదుర్కొంది. ఒక సందర్భంలో పొరుగింటివాళ్లు ఆమె ఇంటిని తగులబెట్టారు. ఆ ప్రమాదంలో ఆమెతో పాటు కుక్కలు కూడా గాయపడ్డాయి. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ... "వాళ్లదొక డిపార్ట్‌మెంటల్ స్టోర్. వీధకుక్కల పీడ వదిలించుకోవాలనే ఆలోచనతో, పోలీసుల మద్దతుతో నా టీ దుకాణాన్నీ, ఇంటినీ తగులబెట్టేశారు. ఆ ప్రమాదం నుంచి బయటపడిన తర్వాత, దాచుకున్న కొద్దిపాటి సొమ్ముతో, సంగంలో ఒక ఇల్లు కొనుక్కున్నాను. కానీ ఆ ప్రాంతంలో వీధికుక్కల అనుమతి లేదు కాబట్టి మళ్లీ పాత ఇంటికే తిరిగొచ్చేశాను" అంటూ వీధికుక్కల పట్ల తనకున్న అనురాగాన్ని చాటుకుంటోంది ప్రతిమ.

భర్తను కోల్పోయిన ఢిల్లీకి చెందిన దేవి జి అనే 70 ఏళ్ల మహిళను ఆమె పిల్లలు ఇంటి నుంచి గెంటేశారు. అప్పటి నుంచి ఒక చిన్న పాకలో నివసించడం మొదలుపెట్టిన దేవి, ఏకంగా 70 నుంచి 80 కుక్కలకు తన ఇంట్లోనే ఆశ్రయం కల్పిస్తోంది. ప్రముఖ సోషల్ మీడియా క్రియేటర్, నీతు బిష్త్ రావత్, తాజాగా ఢిల్లీలోని దేవి జీని సందర్శించి, ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో ఈ మహిళ ఉదంతం వెలుగులోకొచ్చింది. ఆ వీడియోలో వీధికుక్కలతో సంతోషంగా ఆడుతున్న దేవిని చూసిన నెటిజన్లు ఆమె చిరునామా కోసం ఆరా తీయడం మొదలుపెట్టారు. ఆ వీడియోను పోస్ట్ చేసిన నీతు, వీధికుక్కలకు ఆశ్రయం కల్పిస్తున్న దేవికి ఆర్థికంగా సహాయపడాలని ఫాలోవర్లను కోరడంతో, ఆమె అభ్యర్థనకు అనేక మంది స్పందించడం విశేషం.



# ఈ జపనీస్ పద్ధతిలో ప్రయోజనాలెన్నో!



'ఎలాంటి నడక వల్ల ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి?'- చాలా కాలంగా ఈ విషయంపై చర్చ జరుగుతోంది. తాజాగా జపాన్‌కు చెందిన 'ఇంటర్వెల్ వాకింగ్' అనే పద్ధతికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. ఈ పద్ధతిలో మూడు నిమిషాలు వేగంగా నడుస్తారు. మరో మూడు నిమిషాలు నెమ్మదిగా నడుస్తారు. ఇలా వారానికి కనీసం నాలుగు సార్లు 30 నిమిషాల పాటు నడిస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. జపాన్‌లో తాజాగా జరిపిన ఒక అధ్యయనంలో ఈ తరహాలో నడిచేవారికి బీపీ తగ్గుతుందని.. కాళ్ల కీళ్ల నొప్పులు తగ్గాయని తేలింది. కేవలం శారీరక ప్రయోజనాలు మాత్రమే కాకుండా మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వేగంగా నడిచి.. మళ్లీ నెమ్మదిగా నడవటం వల్ల ఎక్కువ శ్రమ అనిపించదని.. గాలిని ఒక క్రమ పద్ధతిలో పీల్చుకుంటారని వారు వెల్లడిస్తున్నారు.

# స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 21 ఆగస్టు 2025




## సంజూ స్థానానికి ఎసరు?

న్యూఢిల్లీ: కెప్టెన్‌గా తొలి సిరీస్‌లోనే ఇంగ్లండ్‌పై భారత జట్టును శుభ్‌మన్ గిల్ అద్భుతంగా నడిపించాడు. నాయకత్వ బాధ్యతలను సమర్థంగా నిర్వహించడంతోపాటు బ్యాటర్‌గానూ అదరగొట్టాడు. ఈనేపథ్యంలో..ఏడాదిగా 'పొట్టి' జట్టుకు దూరంగా ఉన్న గిల్‌ను ఆసియా కప్ టీ20 టోర్నీకి టీమిండియాలో చోటు కల్పించడమేకాదు..వైస్-కెప్టెన్‌గానూ నియమించారు. మరోవైపు ఆసియా కప్‌నకు సంజూ శాంసన్ జట్టులో చోటు లభించింది. కానీ గిల్‌ను వైస్-కెప్టెన్ చేయడంతో తుది జట్టులో సంజూకు స్థానంపై చర్చ మొదలైంది. ఆసియా కప్‌లో భాగంగా ఒమన్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో కలిసి గిల్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఎక్కువగా ఉంది. తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌లో తిలక్ వర్మ, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ వస్తారు. ఈ క్రమంలో చూస్తే టాపార్డర్‌లో సంజూకు చోటెక్కడనే ప్రశ్న తలెత్తుతోంది. కాగా..టీ20 జట్టుకు గిల్‌ను ఎంపిక చేయడంపై మాజీ స్పిన్నర్ అశ్విన్ విమర్శల బాణాలు ఎక్కుపెట్టాడు. 'భవిష్యత్‌లో అన్ని ఫార్మాట్లకు గిల్‌ను కెప్టెన్‌గా జట్టు యాజమాన్యం భావిస్తుండొచ్చు. కానీ ఒకడే అన్ని ఫార్మాట్లకు సారథిగా ఉండనవసరంలేదు' అని వ్యాఖ్యానించాడు. 'గిల్‌ను వైస్-కెప్టెన్‌గా ప్రకటించడం విచారకరం. అతడు ఓపెనర్‌గా వస్తాడు. అందువల్ల సంజూ స్థానానికి ముప్పు ఏర్పడినట్టే' అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

### ఐపీఎల్ ఫామ్ ప్రామాణికమైతే..

టీ20 జట్టులో చోటుకు ఐపీఎల్ ప్రదర్శనే ప్రామాణికమని కోచ్ గంభీర్ గతంలో స్పష్టంజేశాడు. ఆ కోణంలో చూస్తే ఆసియా కప్‌నకు ఆ ఆటగాళ్లు ఎందుకు ఎంపిక కాలేదనే చర్చ నడుస్తోంది. శ్రేయాస్ అయ్యర్, సాయి సుదర్శన్, కేఎల్ రాహుల్, ప్రసిద్ధ్ కృష్ణ ఈసారి ఐపీఎల్‌లో ఎలా రాణించారో చూశాం. వీరెవరూ తాజా ఆసియా కప్ జట్టులో లేరు. ఇక ప్రసిద్ధ్ కృష్ణను కంటి తుడుపుగా స్టాండ్‌బైగా ఎంపిక చేశారు.

## రోహిత్‌కు రెండో ర్యాంక్

**టాప్‌లోనే గిల్, అభిషేక్**

**ఐసీసీ ర్యాంకింగ్స్**

**దుబాయ్:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాడు శుబ్‌మన్ గిల్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకుల జాబితాలోని బ్యాటింగ్ విభాగంలో గిల్ 784 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత భారత్ ఒక్క వన్డే కూడా ఆడలేదు. అయితే, పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌ను వెనక్కునెట్టిన రోహిత్ రెండో ర్యాంక్‌కు చేరుకోగా.. కోహ్లీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, ర్యాంక్‌లు విడుదల చేసినప్పుడు రోహిత్, కోహ్లీ పేర్లు కనిపించకపోవడంతో ఫ్యాన్స్ షాకయ్యారు. వీరిద్దరూ వన్డేలకు కూడా వీడ్కోలు పలికారనే ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే, ఐసీసీ వీటికి ఫుల్‌స్టాప్ పెట్టింది. సాంకేతిక కారణాలతోనే వీరి ర్యాంక్‌లు కొంతసేపు కనిపించలేదని వివరణ ఇచ్చింది. బౌలర్ల విభాగంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడో ర్యాంక్‌కు పడిపోగా.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్ టాప్‌నకు చేరుకొన్నాడు. టీ20ల్లో అభిషేక్ శర్మ, తిలక్ వర్మ టాప్-2లో కొనసాగుతున్నారు. కెప్టెన్ సూర్యకుమార్ 6వ, జైస్వాల్ 10వ స్థానాల్లో నిలిచారు.

## అనంత్ గోల్డెన్ షూట్


అనంత్‌జీత్


సురుచి సౌరభ్

**సౌరభ్ జోడీకి కాంస్యం**

**ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్**

**షిమ్‌కెంట్ (కజకిస్థాన్) :** ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత తొలి స్వర్ణం దక్కించుకుంది. పురుషుల స్కీట్ విభాగంలో అనంత్‌జీత్ సింగ్ నరూక అగ్రస్థానంలో నిలిచాడు. ఇక..పిస్టల్ విభాగంలో భారత్ మరో కాంస్యం సాధించింది. బుధవారం ఉత్కంఠ భరితంగా జరిగిన పురుషుల స్కీట్ ఫైనల్లో అనంత్‌జీత్ 57-56 స్కోరుతో ఆసియా క్రీడల మాజీ చాంపియన్ మన్సూర్ అల్ రషీది (కువైట్)ని ఓడించి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. అలీ అహ్మద్ (ఖతార్) కాంస్యం అందుకున్నాడు. ఇక పిస్టల్ కేటగిరీలో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది.. 10 మీటర్ల మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సౌరబ్ చౌధరి/సురుచి ఇందర్ సింగ్ ద్వయం కాంస్యం సొంతం చేసుకుంది. కాంస్య పోరులో భారత జంట 17-9 స్కోరుతో తైపీ జోడీ లియు హెంగ్/సియాంగ్ చెన్‌పై గెలుపొందింది. చైనా స్వర్ణం, దక్షిణ కొరియా రజతం అందుకున్నాయి. జూనియర్ పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో భారత్‌కు చెందిన వనిష్క చౌధరి/గవిన్ ఆంథోనీ జంట 16-14 స్కోరుతో కొరియా ద్వయం కిమ్ యేజిన్/కిమ్ దూయోన్‌ని ఓడించి కాంస్యం కైవసం చేసుకుంది.

## బ్రస్సెల్స్ ఈవెంట్‌కు నీరజ్ చోప్రా దూరం

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ (డీఎల్) ఫైనల్స్‌కు ఇప్పటికే అర్హత సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. డీఎల్ తుది అంచె బ్రస్సెల్స్ ఈవెంట్‌కు దూరమయ్యాడు. డైమండ్ లీగ్‌లో భాగంగా మొత్తం నాలుగు అంచెల్లో పోటీలు జరుగుతాయి. ఇప్పటికే మూడు ముగిశాయి. ఆఖరిదైన బ్రస్సెల్స్ టోర్నమెంట్ శుక్రవారం బెల్జియంలో జరగనుంది. ఇక.. డైమండ్ లీగ్ ఫైనల్స్ ఈనెల 28న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో జరగనుంది.

## హర్మన్‌ప్రీత్ సారథ్యంలో..

**ఆసియా కప్‌నకు భారత హాకీ జట్టు**

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌కు భారత జట్టును బుధవారం ప్రకటించారు. ఈనెల 29 నుంచి వచ్చేనెల 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. ఇందులో పాల్గొనే 18 మందితో కూడిన భారత జట్టును రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ముందుండి నడిపించనున్నాడు. కాగా, జట్టులో పెద్దగా మార్పులు లేవు. కాకపోతే ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన మిడ్‌ఫీల్డర్ రాజిందర్ సింగ్, ఫార్వర్డ్ ఆటగాళ్లు శిలానంద్ లక్రా, దిల్‌ప్రీత్ సింగ్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఇక.. ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన జట్టుకు వచ్చే ఏడాది ఆగస్టులో నెదర్లాండ్స్, బెల్జియం వేదికలుగా జరిగే ప్రపంచ కప్‌నకు నేరుగా బెర్త్ దక్కనుంది.

## సెమీస్‌లో జెస్సికా జోడీ

### కొలిన్స్ జంట కూడా

● అల్కారజ్, జొకో ద్వయాలకు నిరాశ

● యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ ఈవెంట్


డ్రేపర్, జెస్సికా

అల్కారజ్, రదుకాను

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో టాప్ సీడ్ జెస్సికా పెగుల, డేనియల్ కొలిన్స్ జోడీలు సెమీస్‌కు చేరుకొన్నాయి. క్వార్టర్స్‌లో అమెరికా-బ్రిటన్ జంట పెగుల-జాక్ డ్రేపర్ 4-1, 4-1తో ఆండ్రీవ-మెద్వెదెవ్ జంటపై గెలిచింది. అమెరికా జోడీల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కొలిన్స్-క్రిస్టియన్ హ్యారిసన్ 4-1, 5-4(2)తో టేలర్ టౌన్‌సెండ్-షెల్టన్‌పై గెలిచి ఫైనల్-4కు అర్హత సాధించింది. సెమీస్‌లో మూడో సీడ్ ఇగా స్వియటెక్-కాస్పర్ రూడ్‌తో జెస్సికా పెగుల జంట, డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని-ఆండ్రియా వవస్సోరి జోడీతో కొలిన్స్-హ్యారిసన్ ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది.

**రదుకాను జంటకు షాక్..:** భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఎమ్మా రదుకాను-కార్లోస్ అల్కారజ్ జంటకు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. బ్రిటన్-స్పెయిన్ జోడీ రదుకాను-అల్కారజ్ 2-4, 2-4తో టాప్ సీడ్ పెగుల-డ్రేపర్ చేతిలో, సెర్బియా జోడీ జొకోవిచ్-ఓల్గా డానిలోవిచ్ 2-4, 3-5తో మిర్రా ఆండ్రీవ-డానిల్ మెద్వెదెవ్ చేతిలో ఓడింది. జ్వెరెవ్-బెలిండా బెనిసిక్ 0-4, 3-5తో కొలిన్స్-హ్యారిసన్ చేతిలో చిత్తయింది.

**హగ్‌కు నో:** మ్యాచ్ ముగిసిన తర్వాత బ్రిటన్ ప్లేయర్ డ్రేపర్‌కు రదుకాను హగ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. డ్రేపర్ హగ్ ఇవ్వడానికి ప్రయత్నించినా.. రదుకాను ఇష్టం లేనట్టుగా తప్పుకొంది. రదుకాను ఎందుకు ఇలా వ్యవహరించిందనేది ఎవరికీ అర్థం కాలేదు. అయితే, మ్యాచ్‌లో డ్రేపర్ తనను లక్ష్యంగా చేసుకొని ఆడడంపై రదుకాను కినుక వహించినట్టు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## గుకేష్‌కు గెలుపు

● సింక్వెఫీల్డ్ కప్ చెస్

*సెయింట్ లూయిస్ (యూఎస్):* తొలి రౌండ్‌లో ఓటమి ఎదురైనా.. వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు బలంగా పుంజుకొన్నాడు. సింక్వెఫీల్డ్ కప్ రెండో రౌండ్‌లో నోడిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్థాన్)పై గెలిచాడు. తెల్లపావులతో ఆడిన గుకేష్ 49 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆటకట్టించాడు. కాగా, అమెరికా జీఎం కరువానాతో గేమ్‌ను జీఎం ప్రజ్ఞానంద డ్రా చేసుకొన్నాడు.

### కాస్పరోవ్‌తో ఆనంద్ ఢీ

*న్యూఢిల్లీ:* చెస్‌లో చిరకాల ప్రత్యర్థులు, దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్ మరోసారి తలపడనున్నారు. అక్టోబరు 7 నుంచి 11 వరకు జరిగే క్లచ్ చెస్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో వీరిద్దరూ మరోసారి అభిమానులను అలరించనున్నారు. 2021లో క్రొయేషియా ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో చివరిసారి కాస్పరోవ్‌తో ఆనంద్ ఆడాడు. కాగా, ఇదే టోర్నీలో వరల్డ్ నెం:1 మాగ్నస్ కార్ల్‌సన్‌తో వరల్డ్ చాంపియన్ గుకేష్ తలపడనున్నాడు.

## అమ్మాయిల శుభారంభం


అభిస్త

**శాఫ్ అండర్-17 ఫుట్‌బాల్**

**భారత్ చేతిలో నేపాల్ చిత్తు**

**థింపు (భూటాన్):** శాఫ్ దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 7-0తో నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. నిరా చాను (25వ, 56వ), అభిస్త బాస్నెట్ (16వ, 41వ), అనుష్క (37వ, 62వ) తలో రెండు గోల్స్ సాధించగా.. కెప్టెన్ జులన్ (45+1వ నిమిషం) మరో గోల్ చేసింది.

## సాయ్ ఆర్థిక పరిస్థితి దారుణం

● వేధిస్తున్న కోచ్‌ల కొరత ● పార్లమెంటరీ కమిటీ ఆందోళన

**న్యూఢిల్లీ:** భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని క్రీడలపై నియమించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఖేలో ఇండియా'కు కేటాయించిన నిధులను తగిన రీతిలో ఖర్చు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ నేతృత్వం వహించిన కమిటీలో మాజీ క్రికెటర్, ఎంపీ హర్భజన్ సింగ్, బీజేపీ ఎంపీ బాన్సురి స్వరాజ్ సభ్యులుగా ఉన్నారు. అంతర్జాతీయ ఈవెంట్లలో భారత్ పరిస్థితి ఘోరంగా ఉన్నట్టు కమిటీ పరిశీలనలో తేలింది. సాయ్‌కు నిధులతోపాటు కోచ్‌ల కొరత తీవ్రంగా ఉందని తెలిపింది. ఆరునెలల్లో ఆయా ఖాళీలను భర్తీ చేయాలని క్రీడా మంత్రిత్వశాఖకు సూచించింది. 'ఖేలో ఇండియా' క్రీడలకు కేటాయించిన నిధులను సాయ్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీలకు బదలాయించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. క్రీడలకు బడ్జెట్ కేటాయింపులను ఇదే తరహాలో కొనసాగిస్తూనే 'ఖేలో ఇండియా' బాధ్యతలను కూడా సాయ్‌కు అప్పగించాలని సలహా ఇచ్చింది.

---

## జీవిత, ఆరోగ్య బీమా

# ఇక చవక!




### వ్యక్తిగత లైఫ్, హెల్త్ పాలసీలకు జీఎస్‌టీ మినహాయింపు

» కేంద్ర ప్రతిపాదనకు జీఓఎంలో ఏకాభిప్రాయం

» త్వరలో జీఎస్‌టీ కౌన్సిల్‌కు నివేదిక

» బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి వెల్లడి

న్యూఢిల్లీ: బీమా సేవలను చవకగా అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమా పాలసీలను జీఎస్‌టీ నుంచి మినహాయించాలని మోదీ సర్కారు ప్రతిపాదించింది. బిహార్ ఉప ముఖ్యమంత్రి, బీమాపై ఏర్పాటైన మంత్రుల బృందం (జీఓఎం) కన్వీనర్ సామ్రాట్ చౌదరి బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18% జీఎస్‌టీ ఉంది. బీమా జీఓఎం బుధవారం సమావేశమై కేంద్రం తాజా ప్రతిపాదనపై చర్చించింది. అన్ని రాష్ట్రాల మంత్రులు ఇందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, జీఓఎం సభ్యులు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అయితే, జీఎస్‌టీ మినహాయింపు ప్రయోజనాలు కస్టమర్లకు చేరేలా చూడాలని జీఎస్‌టీ మండలిని సభ్యులు కోరినట్టు ఆయన చెప్పారు. ఇందుకు అవసరమైన విధానాన్ని జీఎస్‌టీ మండలి నిర్ణయిస్తుందన్నారు. ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై జీఎస్‌టీ మినహాయింపుతో వార్షిక పన్ను రాబడి రూ.9,700 కోట్ల మేర తగ్గవచ్చన్నారు.

జీఎస్‌టీ మండలికి త్వరలోనే నివేదికను సమర్పించనున్నట్లు జీఓఎం సమావేశం అనంతరం సామ్రాట్ చౌదరి తెలిపారు. రాష్ట్ర మంత్రుల అభిప్రాయాలతో పాటు కొందరు వ్యక్తపరిచిన ఆందోళనలను సైతం నివేదికలో చేర్చనున్నట్లు ఆయన చెప్పారు. పన్ను మినహాయింపుపై జీఎస్‌టీ మండలి తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. మలి తరం జీఎస్‌టీ సంస్కరణల్లో భాగంగా కేంద్రం లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలపై పన్ను మినహాయించాలని ప్రతిపాదించింది. బీమా పాలసీల జీఎస్‌టీ రేట్లపై సూచనలు చేసేందుకు 13 మంది రాష్ట్ర మంత్రులతో గత సెప్టెంబరులో జీఓఎం ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, బిహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, గోవా, గుజరాత్, మేఘాలయ, పంజాబ్ రాష్ట్రాల మంత్రులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఈ అక్టోబరు కల్లా జీఎస్‌టీ మండలికి జీఓఎం నివేదిక సమర్పించాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై రూ.8,262.94 కోట్లు, హెల్త్ రీఇన్సూరెన్స్ ప్రీమియంపై రూ.1,484.36 కోట్ల ఆదాయం సమకూరింది.

#### సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధనకు కృషి

మలి తరం జీఎస్‌టీ సంస్కరణలను అమలు చేసేందుకు రాష్ట్రాల ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్రం కృషి చేయనున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు ఈ సంస్కరణలు దోహదపడగలవన్నారు. నిర్మాణాత్మక సంస్కరణలు, రేట్ల హేతుబద్ధీకరణ, సులభతర నిబంధనలు అనే మూడు అంశాల ఆధారంగా మలి విడత సంస్కరణలను ప్రతిపాదించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. రేట్ల హేతుబద్ధీకరణ, బీమా రంగం, పరిహార సుంకంపై ఏర్పాటైన జీఓఎంలతో సీతారామన్ బుధవారం సమావేశమయ్యారు. మలితరం సంస్కరణల ఆవశ్యకత, తాజా ప్రతిపాదనలను జీఓఎం సభ్యులకు వివరించారు. ఈ మూడు జీఓఎంలు రెండు రోజులపాటు కేంద్ర ప్రతిపాదనలపై చర్చించనున్నాయని అన్నారు. దేశవాసులపై ధరాభారాన్ని తగ్గించేందుకు ఈ దీపావళి నాటికి జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం పన్ను శ్లాబులున్నాయి. వాటిని 5, 18 శాతం శ్లాబులకు కుదించి.. పొగాకు, ఆల్కహాల్ వంటి 5-7 రకాల నిషిద్ధ ఉత్పత్తులపైన మాత్రం 40 శాతం ప్రత్యేక రేటును విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీ చట్టం అమలులోకి వచ్చింది. ఆ సమయంలో సగటు జీఎస్‌టీ రేటు 14.4 శాతంగా ఉండగా.. 2019 సెప్టెంబరు నాటికది 11.6 శాతానికి దిగివచ్చిందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. ప్రతిపాదిత రేట్ల హేతుబద్ధీకరణతో 9.5 శాతానికి తగ్గవచ్చని అంటోంది. అంతేకాదు, పన్ను రేట్ల తగ్గింపుతో దేశంలో వినియోగం రూ.1.98 లక్షల కోట్ల మేర పెరగవచ్చని అంచనా వేసింది. ప్రభుత్వానికి వార్షిక పన్ను రాబడి మాత్రం రూ.85,000 కోట్ల వరకు తగ్గవచ్చని ఎస్‌బీఐ పేర్కొంది.

# బిజినెస్

## 25,000 పైన నిఫ్టీ

### ఐదో రోజూ మార్కెట్ ముందుకే...

ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు సానుకూలంగా ఉండడంతో పాటు దేశీయ సంస్థల పెట్టుబడులు అందించిన ఊతంతో ఈక్విటీ మార్కెట్ ఐదో రోజు కూడా ర్యాలీని కొనసాగించింది. బుధవారం సెన్సెక్స్ 213.45 పాయింట్ల లాభంతో 81,857.84 వద్ద ముగియగా నిఫ్టీ 69.90 పాయింట్ల లాభంతో 25,050.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో 15 లాభాలతో ముగియగా ఇన్ఫోసిస్ 3.88%, టీసీఎస్ 2.69% లాభంతో ముందు వరుసలో నిలిచాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మంగళవారం రూ.634.26 కోట్ల విలువ గల అమ్మకాలు జరిపారు.

**రీగల్ రీసోర్సెస్ లిస్టింగ్ జోరు:** బుధవారం లిస్టింగ్ అయిన రీగల్ రీసోర్సెస్ షేరు 29% లాభంతో ముగిసింది. బీఎస్ఈలో రూ.102 వద్ద లిస్టింగ్ అయిన ఈ షేరు మార్కెట్ ముగిసే సమయానికి రూ.131.65 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు అంతే లాభంతో రూ.131.58 వద్ద ముగిసింది. ఈ ధరలో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,352.35 కోట్లుగా నిలిచింది.

**ఐదు ఐపీఓలకు గ్రీన్‌సిగ్నల్:** ప్రాథమిక పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) జారీ చేయడానికి ఐదు కంపెనీలకు సెబీ అనుమతి ఇచ్చింది. వాటిలో సెక్యూరిటీ సొల్యూషన్లు అందించే ఇన్నోవాటివ్యూ ఇండియా, ఆస్పత్రుల నిర్వహణలోని పార్క్ మెడి వరల్డ్‌తో పాటు రుణాల్ ఎంటర్‌ప్రైజెస్, జింకుషాల్ ఇండస్ట్రీస్, అడ్వాన్స్ ఆగ్రో లైఫ్ ఉన్నాయి.

**నజారా టెక్నాలజీస్ షేరు 13% డౌన్:** ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో రియల్ మనీ గేమింగ్ విభాగంలోని నజారా టెక్నాలజీస్ షేరు 13% నష్టపోయింది. బీఎస్ఈలో ఈ షేరు 12.82% నష్టంతో రూ.1,221.65 వద్ద ముగిసింది. అలాగే గేమింగ్ విభాగంలోని డెల్టా కార్పొరేషన్ షేరు 6.47% నష్టంతో రూ.87.24 వద్ద, ఆన్ మొబైల్ గ్లోబల్ షేరు 3.53% నష్టంతో రూ.53.27 వద్ద ముగిశాయి.

#### వచ్చే సెప్టెంబరుకి నిఫ్టీ 28,000

జీఎస్‌టీ సంస్కరణల ప్రభావంతో వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి నిఫ్టీ 28,000 స్థాయిని చేరుతుందని బ్రోకరేజి కంపెనీ ఎంకే రీసెర్చ్ అనాలిసిస్ అంచనా వేస్తోంది. జీఎస్‌టీ సుంకాల సవరణ ఆర్థిక వృద్ధికి, మార్కెట్‌కు ఉత్తేజం అవుతుందని పేర్కొంది. రాబోయే కాలంలో ధర-రాబడి నిష్పత్తి 20.7 రెట్లు ఉండవచ్చునన్న అంచనాతో నిఫ్టీ టార్గెట్‌ను నిర్ణయించింది. కన్స్యూమర్ విచక్షణా రంగానికి ఓవర్ వెయిట్ ప్రకటించడంతో పాటు మౌలిక ఆహార ఉత్పత్తులు, సిమెంట్ రంగాల్లోని స్మాల్-క్యాప్, మిడ్-క్యాప్ కంపెనీలకు పరిస్థితి అనుకూలంగా ఉంటుందని పేర్కొంది.

#### మౌలికం డీలా

మౌలిక వసతుల రంగానికి చెందిన ఎనిమిది కీలక పరిశ్రమల వృద్ధిరేటు జూలై నెలలో 2 శాతానికి పరిమితమయింది. బొగ్గు, క్రూడాయిల్, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తుల విభాగాల్లో ఉత్పత్తి క్షీణత ఇందుకు కారణం. ఈ రంగాల వృద్ధి గత ఏడాది జూన్‌లో 6.3% ఉండగా గత నెలలో 2.2 శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్-జూలై నెలల మధ్య కాలంలో సైతం ఈ రంగాల వృద్ధిరేటు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 6.3% నుంచి 1.6 శాతానికి క్షీణించింది.

### 'చాట్ జీపీటీ గో' ప్లాన్

**నెలకు రూ.399**

**న్యూఢిల్లీ:** ఓపెన్ ఏఐ సంస్థ భారత వినియోగదారుల కోసం నెలకు రూ.399 ధరతో 'చాట్ జీపీటీ గో' సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ప్రారంభించింది. అత్యాధునిక ఏఐ టూల్స్‌ను దేశవ్యాప్తంగా మరింత మందికి సరసమైన ధరల్లో అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ప్రారంభించినట్టు తెలిపింది. జీపీటీ-5తో ఈ చాట్ జీపీటీ గో పథకం నడుస్తుంది. ఉచిత చాట్ జీపీటీతో పోలిస్తే ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ద్వారా సబ్‌స్క్రైబర్లు భారతీయ భాషల్లో పదింతల సందేశాలు, ఇమేజిలు సృష్టించవచ్చు. ఫైల్స్, ఇమేజిల అప్‌లోడ్ కోసం పదింతలు పెంచుకోవచ్చని ఓపెన్ ఏఐ తెలిపింది. ఈ పథకాలు అన్నిటికి యూపీఐ చెల్లింపులు సైతం అనుమతిస్తున్నట్టు ప్రకటించింది.

### ఇన్ఫీ ఉద్యోగులకు బోనస్

బెంగళూరు: ఇన్ఫోసిస్ కంపెనీ తన ఉద్యోగులకు బోనస్ బొనాంజా ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికిగాను అర్హులైన ఉద్యోగులకు పనితీరు ఆధారిత బోనస్ లెటర్లను బుధవారం జారీ చేసింది. వీరికి లభించనున్న సగటు బోనస్ 80 శాతంగా ఉందని, మార్చితో ముగిసిన త్రైమాసికం సగటు బోనస్ 65 శాతంతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,00,150 ▼ | 91,800 ▼ | 1,25,000 ▼ |
| విజయవాడ | 1,02,200 ▼ | 96,000 ▼ | 1,14,900 ▼ |
| విశాఖపట్నం | 1,02,200 ▲ | 91,800 ▼ | 1,25,000 ▼ |
| రాజమండ్రి | 1,00,150 ▼ | 91,800 ▼ | 1,14,400 ▼ |
| ప్రొద్దుటూరు | 1,00,300 ▼ | 92,280 ▼ | 1,14,700 ▼ |
| ముంబై | 98,950 ▼ | 90,640 ▼ | 1,11,190 ▼ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 21 తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 495 | విజయవాడ | 525 |
| వరంగల్ | 497 | గోదావరి | 520 |
| చిత్తూరు | 553 | విశాఖపట్నం | 520 |
| | | డజను గుడ్లు రూ. | 72 |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 102 | విజయవాడ | 114 |
| వరంగల్ | 102 | గుంటూరు | 116 |
| కరీంనగర్ | 102 | ఒంగోలు | 116 |
| మహబూబ్‌నగర్ | 102 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 102 | నెల్లూరు | 95 |
| విశాఖపట్నం | 110 | అనంతపురం | 95 |
| గోదావరి | 114 | | |

## అమెరికాలో నాట్కో జనరిక్ బీపీ టాబ్లెట్లు

న్యూఢిల్లీ: నాట్కో ఫార్మా అమెరికా మార్కెట్‌లో కొత్త జనరిక్ ఔషధాన్ని విడుదల చేసింది. పిల్లల్లో వచ్చే బీపీ నియంత్రణ కోసం బొసెంటాన్ పేరుతో 32 ఎంజీ డోసేజిలో ఈ టాబ్లెట్లను విడుదల చేసినట్టు కంపెనీ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ట్రక్లీర్ పేరుతో అమెరికన్ కంపెనీ యాక్టెలియన్ ఫార్మాస్యూటికల్స్ మార్కెట్ చేస్తున్న బ్రాండెడ్ టాబ్లెట్లకు, బొసెంటాన్ టాబ్లెట్లు జనరిక్ వెర్షన్. అమెరికా మార్కెట్లో తమ బొసెంటాన్ టాబ్లెట్లకు 180 రోజుల పాటు ప్రత్యేక మార్కెటింగ్ హక్కులుంటాయని కంపెనీ తెలిపింది.

### అరబిందో ఫార్మా చేతికి చెక్ కంపెనీ!

**550 కోట్ల డాలర్లకు కొనుగోలు ఆఫర్**

న్యూఢిల్లీ: అరబిందో ఫార్మా భారీ టేకోవర్‌కు సిద్ధమవుతోంది. చెక్ రిపబ్లిక్‌లోని జెంటివా ఫార్మా కంపెనీని కొనుగోలు చేసేందుకు చర్చలు జరుపుతోంది. ప్రైవేట్ ఈక్విటీ కంపెనీ అడ్వెన్ ఇంటర్నేషనల్‌కు జెంటివాలో ఉన్న మెజారిటీ వాటాను 500 కోట్ల డాలర్ల నుంచి 550 కోట్ల డాలర్లతో (సుమారు రూ.43,500 కోట్ల నుంచి రూ.47,850 కోట్లు) కొనుగోలు చేసినట్టు సమాచారం. ఈ వార్తలు నిజమైతే ఒక భారత ఫార్మా కంపెనీ ఒక విదేశీ ఫార్మా కంపెనీని, ఇంత పెద్ద మొత్తంతో కొనుగోలు చేయడం ఇదే మొదటిసారి అవుతుంది. అయితే అరబిందో ఫార్మా ఈ వార్తలను తోసిపుచ్చింది. చెక్ కంపెనీ కొనుగోలు కోసం చర్చలు జరుగుతున్నాయి తప్ప, ఇంకా తుది ఒప్పందమైతే కుదరలేదని స్పష్టం చేసింది.

## గోద్రెజ్ 'అషిటక' కలుపు నాశని

» మొక్కజొన్న పంట కోసం ప్రత్యేకం




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ మరో సరికొత్త ఉత్పత్తిని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసింది. 'అషిటక' పేరుతో విడుదల చేస్తున్న ఈ మందు మొక్కజొన్న పంటలో కలుపు మొక్కల నివారణకు బాగా పని చేస్తుందని కంపెనీ పంటల సంరక్షణ వ్యాపార విభాగం సీఈఓ ఎన్‌కే రాజవేలు చెప్పారు. మొక్కజొన్న పంట రెండు నుంచి నాలుగు ఆకుల దశలో ఉన్నపుడు ఈ మందు పిచికారీ చేస్తే ఫలితం మరింత మెరుగ్గా ఉంటుందన్నారు. ఈ నెలాఖరు నుంచే తెలుగు రాష్ట్రాల్లోని తమ డీలర్లకు ఈ మందు సరఫరా ప్రారంభమవుతుందన్నారు. తెలంగాణ సహా దేశంలో వెయ్యికి పైగా పంట పొలాల్లో పరీక్షల తర్వాత ఈ కలుపు నాశని మందును విడుదల చేస్తున్నట్టు రాజవేలు చెప్పారు. జపాన్ కేంద్రంగా పనిచేసే ఐఎస్‌కే అభివృద్ధి చేసిన ఈ మందును గోద్రెజ్ ఆగ్రోవెట్, ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతి చేసుకుని రైతులకు సరఫరా చేయనుంది. ప్రభుత్వ అనుమతులు లభించిన వెంటనే దేశంలోనే ఈ మందును తయారు చేయబోతున్నట్టు చెప్పారు. ఎకరా మొక్కజొన్న చేనుకు సరిపోయేలా ఒకే ప్యాక్‌లో 50 ఎంఎల్ 'అషిటక' కీలక ఔషధాన్ని 400 ఎంఎల్ సర్ఫాక్టెంట్‌తో కలిపి రూ.1,800కు విక్రయించనున్నట్టు రాజవేలు చెప్పారు.

## ‘వ్యూహం’ నిర్మాత దాసరి కిరణ్ అరెస్టు

- ఆ సినిమా కోసం బంధువు వద్ద 4.5 కోట్ల అప్పు
- డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు అనుచరులతో దాడి..
- పోలీసుల అదుపులో మరో నలుగురు అనుచరులు

విజయవాడ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వ్యూహం చిత్రనిర్మాత దాసరి కిరణ్‌ను హైదరాబాద్‌లో విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. ఈ చిత్ర నిర్మాణం కోసం బంధువు నుంచి తీసుకున్న అప్పును ఎగ్గొట్టడమే కాకుండా, ఆయనపై దాడి చేయించిన ఘటనలో కిరణ్‌పై కేసు నమోదయింది. మరో నలుగురు కిరణ్ అనుచరులు పోలీసుల అదుపులో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. దాసరి కిరణ్ వైసీపీ హయాంలో, ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని వ్యూహం పేరుతో చిత్రాన్ని నిర్మించారు. దీనికోసం గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సమీప బంధువు గాజుల మోహన్ నుంచి రూ.4.5 కోట్లను ఆయన అప్పుగా తీసుకున్నారు. హైదరాబాద్‌లో ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్న మోహన్ తన వద్ద కూడా అంత డబ్బు లేకపోవడంతో పరిచయం ఉన్న వారివద్ద అప్పు చేసి కిరణ్‌కు సర్దుబాటు చేశారు. ఆ నాటి నుంచి ఇప్పటి వరకు ఈ డబ్బుకు సంబంధించిన వడ్డీ గానీ, అసలు గానీ కిరణ్ చెల్లించడం లేదు. దీంతో మోహన్ దంపతులు ఈనెల 18న విజయవాడ పటమటలోని కిరణ్ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో ఆయన లేరు. అనుచరులు నలుగురు ఉన్నారు. మోహన్ దంపతులు డబ్బులు అడగడానికి వచ్చారని తెలుసుకున్న కిరణ్.. కార్యాలయంలోని తన అనుచరులతో వారిపై దాడి చేయించారు. దీనిపై మోహన్ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో కిరణ్‌తోపాటు ఆయన అనుచరులు రామవరప్పాడుకు చెందిన గుదే గౌతమ్, పెనమలూరుకు చెందిన అవ్వారు నాగతేజ, ఎనికేపాడుకు చెందిన గండికోట దుర్గాప్రసాద్, ప్రసాదంపాడుకు చెందిన చేబోయిన సాయిచైతన్యలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## వినాయక మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు

- బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే వారికి మాత్రమే: డీజీపీ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రానున్న వినాయక చవితి పండుగను దృష్టిలో పెట్టుకుని, వినాయక ఉత్సవ మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం ద్వారా, ఆన్‌లైన్‌లో అనుమతులు పొందడానికి ఏపీ పోలీసుశాఖ అవకాశం కల్పించింది. గణేష్‌ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే వినాయక ఉత్సవ మండపాలకు మాత్రమే ఈ అనుమతులు అవసరమని స్పష్టం చేశారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని, ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## పంట బీమా బకాయిలు రూ.3,249 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద దేశవ్యాప్తంగా రూ.2,249.70 కోట్ల బకాయిలు ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువ బకాయిలు ఉన్నట్లు పేర్కొన్నారు.

## రిటైర్డ్ ఎస్ఈసీ ప్రయోజనాలకు నోటిఫికేషన్

రిటైర్ అయిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు హైకోర్టు మాజీ న్యాయమూర్తి తరహాలో ప్రయోజనాలు కల్పించేందుకు మార్గదర్శకాలు విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమించిన వ్యక్తికి గాని, వారి భర్త/భార్యకు గాని డొమెస్టిక్ హెల్ప్ కింద సర్వెంట్‌ను నియమించుకునేందుకు ప్రభుత్వం రూ.45 వేల మేర ప్రయోజనం కల్పిస్తుంది. దాంతో పాటు మరో రూ.15 వేలు ఫోన్, ఇంటర్నెట్ సేవల కోసం అందజేయనుంది. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రూల్స్‌ను విడుదల చేస్తూ ఆదేశాలిచ్చారు.

# నెల్లూరు కి‘లేడీ’ అరుణ అరెస్టు

నెల్లూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కరడుగట్టిన నేరగాడు అవిలేలి శ్రీకాంత్‌కు పెరోల్ ఇప్పించడంలో కీలక పాత్ర పోషించిన నెల్లూరుకు చెందిన నిడిగుంట అరుణను పోలీసులు అరెస్టుచేశారు. ‘ఇల్లు రాసిస్తావా.. చస్తావా’ అని ఒక బిల్డర్‌ను బెదిరించిన కేసులో ఆమెను, ముగ్గురు అనుచరులను బుధవారం అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో అరుణను ఒంగోలు జైలుకు తరలించారు. సెటిల్‌మెంట్ల విషయంలో శ్రీకాంత్‌కు సహకరించిన ముగ్గురు ఎస్కార్ట్ కానిస్టేబుళ్లపైనా ఉన్నతాధికారులు వేటువేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మునగ వెంకట మురళీ కృష్ణమోహన్ వృత్తి రీత్యా బిల్డర్. 2010లో సాయి ఎన్‌క్లేవ్ పేరుతో 15 ఫ్లాట్లు కలిగిన అపార్టుమెంట్ నిర్మించి.. 14 ఫ్లాట్లు విక్రయించారు. ఒకఫ్లాటు సొంతానికి ఉంచుకున్నారు. అరుణ 2020లో ఆ ఫ్లాటును అద్దెకు తీసుకుంది. ఆ తర్వాత దాని కొనుగోలుకు 2022 డిసెంబరు 10న రూ.28 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుంది. రూ.3లక్షలు చెల్లించి తన తండ్రి పేరుతో అగ్రిమెంట్ రాయించుకుంది. 2023 ఫిబ్రవరి 11లోపు మిగిలిన రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉండగా.. ఇవ్వలేదు. ఇంటి అద్దె కూడా ఇవ్వకపోవడంతో మురళి కోవూరు పోలీసులకు ఫిర్యాదుచేశారు. వారు పట్టించుకోలేదు. పైగా అరుణ ఫిర్యాదుతో ఆయనపైనే ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారు. ఆ తర్వాత డబ్బు కోసం బిల్డర్ కోవూరు కోర్టులో వాజ్యం వేశారు. దరిమిలా అరుణ, ఆమె అనుచరులు పల్లం వేణు, అంకెం రాజా, ఎలిష్ మరి కొంతమంది ఆయన్ను తరచూ బెదిరించేవారు. గత ఏడాది నవంబరులో బిల్డర్ మెడపై కత్తి పెట్టి ఫ్లాటు రాసిస్తావా, చస్తావా అని హెచ్చరించారు. ఆయన్ను కోవూరులోని ఒక ప్రదేశానికి బలవంతంగా తీసుకెళ్లి.. ఇంటి రిజిస్ట్రేషన్ కోసం అరుణ నుంచి రూ.5 లక్షలు తీసుకున్నట్లు ఒప్పంద పత్రంపై సంతకం చేయించుకున్నారు. శ్రీకాంత్, అరుణ వ్యవహారాలు వెలుగులోకి రావడంతో మురళి మంగళవారం రాత్రి కోవూరు పోలీసులను కలిసి అరుణపై ఫిర్యాదు చేశారు. పోలీసులు తనను అరెస్టు చేయబోతున్నారన్న సమాచారం తెలిసిన ఆమె.. తనను ఆదుకోవాలని మంగళవారం అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో వీడియోలు విడుదల చేయడం మొదలుపెట్టింది. పోలీసులు చుట్టుముట్టారని.. ఏం చేస్తారోనని భయంగా ఉందని.. తన కారులో గంజాయి పెట్టి ఆ కేసు మీద అరెస్టు చేస్తారని.. మీడియా తనను ఆదుకోవాలని, పోలీసుల నుంచి రక్షించాలని కోరింది. అరెస్టు భయంతో ఆమె హైదరాబాద్ పారిపోతుండగా బాపట్ల జిల్లా అద్దంకి వద్ద పోలీసులు బుధవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది.



నెల్లూరు కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచేందుకు అరుణను తీసుకెళ్తున్న పోలీసులు

### శ్రీకాంత్‌కు అడుగడుగునా సహకారం

వైద్య పరీక్షల పేరుతో నెల్లూరు జైలు నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి వెళ్లిన ఖైదీ శ్రీకాంత్ అక్కడ ఏమేం చేశాడో వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటన గత డిసెంబరులో జరిగినట్లు పోలీసు ఉన్నతాధికారులు గుర్తించారు. ఆ రోజు ఖలీల్, ఖాజా మొహిద్దీన్, సుబ్బారావు అనే కానిస్టేబుళ్లను ఎస్కార్ట్‌గా పంపారు. నెల్లూరు సిటీ పరిధి దాటగానే శ్రీకాంత్ పోలీసు వాహనం దిగి ప్రైవేటు వాహనం ఎక్కారు. ఇందుకు ఎస్కార్ట్ కానిస్టేబుళ్లు సహకరించారు. ఆ వాహనం మార్గమధ్యంలో రోడ్డుప్రమాదానికి గురైంది. అయితే శ్రీకాంత్, అరుణకు పోలీసు ఉన్నతాధికారుల్లో ఉన్న పలుకుబడితో విషయంవెలుగులోకి రాలేదు. వైరల్ అయిన వీడియోలో శ్రీకాంత్ తోపాటు అరుణ, మరికొందరు ఒకే గదిలో ఉన్నట్లు స్పష్టమైంది. వీటన్నిటినీ ధ్రువీకరించుకున్న పోలీసు ఉన్నతాధికారులు.. ఖలీల్, ఖాజా మొహిద్దీన్, సుబ్బారావును సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఒక పోలీసు ఉన్నతాధికారి పేరు తెరపైకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో నెల్లూరు జిల్లాలో పనిచేసిన ఆయన.. ఖైదీ శ్రీకాంత్‌కు బయటి ప్రపంచంలో స్వేచ్ఛ లభించేలా సిఫారసు చేసినట్లు జిల్లా పోలీసులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. మరోవైపు.. నెల్లూరు ఎస్పీ కృష్ణకాంత్‌ను డీజీపీ అమరావతికి పిలిపించుకున్నారు. జిల్లాలో రౌడీయిజాన్ని అంతమొందించే దిశగా ఆదేశాలు జారీ చేశారు.

### శ్రీకాంత్ తల్లి అడిగితే.. పెరోల్‌కు సిఫారసు లేఖ ఇచ్చా

- గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ వెల్లడి

(గూడూరు-ఆంధ్రజ్యోతి): ‘సమస్యలు పరిష్కరించాలంటూ నా వద్దకు ఎందరో బాధితులు రావడం.. సిఫారసు లేఖలు ఇవ్వడం సహజం. నెల్లూరు జిల్లా జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న గూడూరుకు చెందిన రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ కోసం అతడి తల్లి వచ్చారు. తన ఆరోగ్యం సరిగా లేదని, పెరోల్‌కు సిఫారసు చేయాలని విన్నవించారు. అలా ఆమెకూ లేఖ ఇవ్వడం సహజంగా జరిగిందే తప్ప మరే ఉద్దేశం లేదు’ అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు.

## ఆగ్రోస్‌లో అంతర్గత విచారణ

- టెండర్లలో అవకతవకలపై ప్రభుత్వం ఆరా
- గత ప్రభుత్వంలో తప్పులన్నీ బయటికి తీస్తాం: చైర్మన్

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆగ్రోస్(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ)లో అవకతవకలపై అంతర్గత విచారణ జరుగుతోంది. ఆగ్రోస్‌లో రచ్చ, చర్చకు దారితీసిన పరిస్థితులపై ఓ వైపు ప్రభుత్వం ఆరా తీస్తుండగా, మరోవైపు తాజా పరిణామాలపై సీఎంకు నివేదిక ఇవ్వనున్నట్లు సంస్థ చైర్మన్ సుబ్బానాయుడు తెలిపారు. ఇటీవల వాటర్‌షెడ్ పరికరాల టెండర్ల నిబంధనలు మార్చిన విషయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిని బదిలీ చేశారు. అలాగే కంపెనీలకు, మంత్రి కార్యాలయానికి మధ్యవర్తిగా వ్యవహరించాలంటూ ఓఎస్డీ ఒత్తిడి చేస్తున్నారని, మాట వినలేదని బదిలీ చేయడంతో సెలవుపై వెళ్లినట్లు సీఎస్‌కు జనరల్ మేనేజర్ లేఖ రాసినట్లు బయటకు రావడంతో ఆగ్రోస్‌లో రచ్చ అయ్యింది. అయితే జీఎంను బదిలీ చేయలేదని ఆగ్రోస్ చైర్మన్ అంటున్నారు. అలాగే, జీఎం తనంతట తానే సెలవుపై వెళ్లినట్లు ఆగ్రోస్ ఎండీ డిల్లీరావు చెప్తున్నారు. జీఎం రాసినట్లు చెప్తున్న లేఖ తనకు అందలేదని బుధవారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’కి చెప్పారు. మరోవైపు మంత్రి ఓఎస్డీ పోలినాయుడు సీఎస్‌ను కలిశారు. జీఎం బదిలీ కాలేదని, సెలవుపై వెళ్లాలని ఆయనను తాను బెదిరించలేదని వివరణ ఇచ్చారు. టెండర్ల అవకతవకలకు జీఎం కారణమన్నారు. జీఎం రాసినట్టు చెబుతున్న లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని, మొత్తం వ్యవహారంపై విచారణ చేపట్టాలని సీఎస్‌ను కోరారు. జీఎంపై గతంలో అవినీతి అభియోగాలతో క్రిమినల్ కేసు ఉన్న విషయాన్నీ సీఎస్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఓఎస్డీ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులతో సహా అన్ని వ్యవహారాలపైనా విచారణ చేస్తున్నట్లు ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడు బుధవారం రాత్రి ‘ఆంధ్రజ్యోతి’కి చెప్పారు. ఒక రెగ్యులర్, ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి అవకతవకలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. కర్నూలులో రూ.150కోట్ల విలువైన ఆగ్రోస్ స్థలానికి గత ప్రభుత్వంలో ఏడాదికి రూ.వెయ్యికి లీజుకిచ్చి, పార్టీ ఆఫీస్ కట్టారని, ఇలాంటి వ్యవహారాలన్నీ బయటకు తీస్తామన్నారు. అన్ని విషయాలపై సీఎంకు త్వరలో నివేదిక ఇస్తానని చెప్పారు.

# అమరావతిలో హడ్కో కన్వెన్షన్ సెంటర్

- అంతర్జాతీయ ప్రమాణాలతో పదెకరాల్లో నిర్మాణం
- ఎకరానికి 4కోట్లు చొప్పున చెల్లించేలా ఒప్పందం
- ఇండియా హ్యాబిటేట్ సెంటర్ స్థాయిలో కార్యాలయం
- 2వేల మంది సీటింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం
- విజువల్ ఆర్ట్ గ్యాలరీ, ఫైవ్‌స్టార్ హోటల్, అతిథి గృహాలు
- కేంద్ర మంత్రి పెమ్మసానికి లేఖ ద్వారా హడ్కో సమాచారం

గుంటూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి మరో కీలక ప్రాజెక్టు మంజూరైంది. రాజధానిలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ.11వేల కోట్ల రుణ సాయం అందిస్తున్న హడ్కో (హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సంస్థ సొంతంగా 10ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇందుకోసం ఏపీసీఆర్‌డీఏ ఆధీనంలో ఉన్న 8 ఎకరాల ఫ్రీహోల్డ్ భూమితో పాటు మరో 2ఎకరాలు తీసుకోనుంది. ఎకరానికి రూ.4కోట్ల చొప్పున చెల్లించేందుకు సీఆర్‌డీఏతో ఇప్పటికే ఒప్పందం చేసుకుంది. ఈ కన్వెన్షన్ సెంటర్‌కు సంబంధించిన సవివర ప్రాజెక్టు నివేదిక రూపుదిద్దుకుంది. కేంద్రం నుంచి ఆమోదం తీసుకొని త్వరలోనే నిర్మాణం ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు హడ్కో లేఖ ద్వారా సమాచారం ఇచ్చింది. ఢిల్లీలోని ఇండియా హ్యాబిటేట్ సెంటర్ స్థాయిలో నిర్మించబోయే ఈ కాంప్లెక్స్‌లో హడ్కో కార్యాలయాలతో పాటు హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ రంగాలకు శిక్షణ సదుపాయాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టులో ఉండే సదుపాయాలను పెమ్మసాని ‘ఎక్స్’ వేదికగా వివరించారు. 2వేల మంది సామర్థ్యంతో ఆధునిక ఆడిటోరియం, విజువల్ ఆర్ట్ గ్యాలరీ, ఫైవ్‌స్టార్ హోటల్, అతిథి గృహాలు, ఇండోర్, అవుట్ డోర్ స్పెషల్ రెస్టారెంట్లు, కల్చరల్ ఆర్ట్ గ్యాలరీలు- సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికలు, సకల సదుపాయాలతో కూడిన సెక్రటేరియట్, డాక్యుమెంటేషన్ సెంటర్, స్విమ్మింగ్‌పూల్, ఎగ్జిబిషన్ హాల్స్ నిర్మిస్తారు. ఈ కన్వెన్షన్ సెంటర్ అమరావతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫైనాన్స్, వనరులు, నైపుణ్యాల సమాహార కేంద్రంగా తీర్చిదిద్దుతుందని పెమ్మసాని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు సాకారానికి సహకరించిన కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



హడ్కో, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నమూనా

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## మోక్షజ్ఞ ఎంట్రీ అప్పుడే



నారా రోహిత్ కథానాయకుడిగా నటించిన ‘సుందరకాండ’ చిత్రం ఈ నెల 27 విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆయన నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఎంట్రీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. ‘ఇండస్ట్రీలోకి అడుగు పెట్టడానికి మోక్షజ్ఞ ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాడు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే సంవత్సరం ప్రారంభంలో ఆయన సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. సినిమాల కోసమే తన లుక్‌ను మునుపటి కంటే ఎంతో చక్కగా మార్చుకున్నాడు. ఇటీవల మోక్షజ్ఞతో మాట్లాడినప్పుడు కూడా స్క్రిప్ట్ కోసమే చూస్తున్నట్లు చెప్పాడు. ఒక మంచి ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీతో ఆరంగేట్రం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. తనకు అలాంటి కథ దొరికితే ఈ ఏడాదిలోనే పరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వొచ్చు’ అని వివరించారు నారా రోహిత్.

## ఘాటీల జీవన శైలిని చూపించే దస్సోరా



అనుష్క అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నయాక్షన్ డ్రామా ‘ఘాటీ’ అన్ని హంగులు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 5న విడుదల కావడానికి సిద్ధమవుతోంది.విక్రమ్ ప్రభు హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ సినిమాలోని సెకెండ్ సింగిల్ ‘దస్సోరా’ను బుధవారం విడుదల చేశారు. ఘాటీల జీవన శైలి, వారి కల్చర్‌ను ప్రతిబింబిస్తూ ఈఎస్ మూర్తి ఈ పాట రాశారు. పాటలో అనుష్క, విక్రమ్ ప్రభు విజువల్స్ బాగున్నాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ‘ఘాటీ’ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. సాయిమాధవ్ మాటలు రాసిన ఈ చిత్రానికి మనోజ్ రెడ్డి కటసాని సినిమాటోగ్రఫీని, తోట తరణి కళా దర్శకత్వాన్ని నిర్వహించారు.

## అందరూ చూడాల్సిన సినిమా



బ్రహ్మానందం

ఆర్.నారాయణ మూర్తి లీడ్ రోల్‌లో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘యూనివర్సిటీ పేపర్ లీక్’. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రాన్ని ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ‘హాయిగా తలార స్నానం చేసి నేత చీర కట్టుకున్న స్త్రీలా ఉన్న చిత్రమిది. అందరూ చూడాల్సిన సినిమా. ఇందులో నిజాలుంటాయి. బూతులుండవు. జీవితపు విలువలు ఉంటాయి’ అని అన్నారు. ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ ‘సినిమా చూసి నన్ను ఆశీర్వదించి నాపై ప్రేమను చూపిస్తున్న బ్రహ్మానందం గారికి కృతజ్ఞతలు’ అని అన్నారు.

## రంగంలోకి రేవంత్ సర్కార్.. అతి త్వరలోనే పరిష్కారం!

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

సినీ కార్మికుల సమ్మె 17వ రోజుకు చేరుకున్న తరుణంలో.. బుధవారం ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌ను సినిమా హబ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి సినీ కార్మికుల సమ్మె అడ్డంకిగా మారుతోందని భావించిన ప్రభుత్వం.. సమస్యకు ముగింపు పలకడానికి నేరుగా రంగంలోకి దిగింది. ఈ మేరకు సమ్మె వ్యవహారంపై ఇరువర్గాలతో చర్చించి పరిష్కరించాలని హోమ్ శాఖ ప్రధాన కార్యదర్శి రవి గుప్తను, కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిశోర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు పాత్ర కీలకంగా మారనుంది. ప్రభుత్వ జోక్యంతో అతి త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారమవుతుందని సినీ ప్రముఖులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులను పిలిపించుకుని చర్చలు జరిపినట్లు సమాచారం. ‘ఇప్పటికే 30 శాతం వేతన పెంపును అంగీకరించిన నిర్మాతల సినిమాలకు మా కార్మికులు పనిచేస్తున్నారు. గురువారం నుంచి 20 శాతం వేతన పెంపును ఇచ్చే నిర్మాతల సినిమాలకు కూడా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం’ అని ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు కమిషనర్ సీవీ ఆనంద్‌కు వివరించినట్లు తెలిసింది. త్వరలోనే జూబ్లీహిల్స్ నియోజక వర్గానికి ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో.. అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న సినీ కార్మికుల ఓట్లు కీలకం కావడం కూడా ఈ తాజా పరిణామానికి కారణమనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

## అందరికీ నచ్చుతుంది



మౌళి తనుజ్, శివానీ నాగరం జంటగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రం ‘లిటిల్ హార్ట్స్’. ఈటీవీ విన్ బ్యానర్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఈ సినిమా కంటెంట్ నచ్చి నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి సెప్టెంబరు 12న థియేట్రికల్‌గా విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. తాజాగా చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అనిల్ రావిపూడి మాట్లాడుతూ “ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. టైటిల్ వింటే ‘ప్రేమించుకుందాం రా’ సినిమాలోని వెంకటేశ్ గుర్తొచ్చారు. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

## సరికొత్త అంశాలతో...



గీత్ సైనీ, శ్రీచరణ్ రాచకొండ జంటగా సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘కన్యాకుమారి’. నటి మధుశాలిని సమర్పిస్తున్నారు. ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథి హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ ‘ప్రచార చిత్రాలతోనే సినిమాపై ఆసక్తిని పెంచారు. సరికొత్త అంశాలతో సాగే వినూత్న కథాంశం అని తెలుస్తోంది’ అని అన్నారు. మధుశాలిని మాట్లాడుతూ ‘సృజన్ గారు ఓ మంచి చిత్రాన్ని మన ముందుకు తెచ్చారు’ అని చెప్పారు.

## కొత్త జంటకు వరద కష్టాలు



కొత్తగా పెళ్లయిన జంటను వరద కష్టాలు వెంటాడాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు కొత్త కాలనీకి చెందిన బొడ్డు అపర్ణాదేవికి విశాఖవాసి పానగంటి పార్థసారథితో ఈ నెల 18 తెల్లవారుజామున వివాహమైంది. అత్తవారింటికి వచ్చేందుకు కొత్త జంట బుధవారం గొల్లప్రోలు చేరుకుంది. వరద నీరు అడ్డంకిగా మారింది. సుద్దగడ్డ కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కనే ఉన్న ప్రత్యామ్నాయ రోడ్డుపైనా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనితో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె నిచ్చెన ఎక్కి వంతెన దాటి కాలనీకి చేరుకోవాల్సి వచ్చింది. - పిఠాపురం, ఆంధ్రజ్యోతి

## స్వర్ణగూడెం కల్వర్టు.. దాటాలంటే కష్టమే!





జీలుగుమిల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం సమీపంలో ఇటీవల రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా కల్వర్టును నిర్మించారు. పక్కా రోడ్డు పూర్తికాలేదు. తాజా వర్షాలకు ఆ ప్రాంతమంతా పూర్తిగా బురదమయమైంది. వాహనాలు కూరుకుపోతున్నాయి. బుధవారం ఇలా కట్టెల లోడుతో వచ్చిన ట్రాక్టరు బురదలో కూరుకుపోగా, రెండు జేసీబీల సాయంతో బయటికి తీశారు. ఇంతలో మరో మినీ వాహనం బురదలో కూరుకుపోయి చక్రాలు దిగబడ్డాయి. ట్రాక్టరుకు కట్టి బయటకు లాగారు. బస్సుల రాకపోకలకు వీల్లేకపోవడంతో.. తల్లిదండ్రులే తమ పిల్లలను ఎలాగోలా జంగారెడ్డిగూడెం స్కూళ్లకు తీసుకెళ్లారు.

## వెటర్నరీ ఉద్యోగులకు అవార్డులు

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశు సంవర్ధక శాఖలోని వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన 67 మంది ఉద్యోగులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి బుధవారం విజయవాడలోని పశుసంవర్ధకశాఖ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ దామోదర్‌నాయుడు అవార్డులు అందజేశారు. జాయింట్ డైరెక్టర్ చెన్నయ్య, జిల్లా పశుసంవర్ధక అధికారులు రవికుమార్ (తిరుపతి), మన్మథరావు (మన్యం), నరసింహులు (కృష్ణా), డిప్యూటీ డైరెక్టర్లు శ్రీలక్ష్మి(చిత్తూరు) హుస్సేన్ (పశ్చిమగోదావరి), చంద్రశేఖర్(విశాఖపట్నం), జగత్ శ్రీనివాసు(ప్రకాశం), దుర్గాప్రసన్నబాబు (కర్నూలు), ఏడుగురు అసిస్టెంట్ డైరెక్టర్లు, 8మంది పశువైద్య సహాయ శస్త్రచికిత్సకులు తదితర ఉద్యోగులను శాలువాలతో సత్కరించి, అవార్డులు అందజేశారు.

## క్రిమినల్ చట్టాల అమల్లో ఏపీ ఆదర్శం కావాలి

- కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నూతన క్రిమినల్ చట్టాల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఢిల్లీ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మోహన్ మాట్లాడుతూ ఫోరెన్సిక్ ఇకో సిస్టమ్‌ను పటిష్ఠం చేయాలన్నారు. ఫోరెన్సిక్ లేబరేటరీల్లో ఉన్న ఖాళీలను కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేయాలని చెప్పారు. నూతన క్రిమినల్ చట్టాల అమల్లో ఏపీ దేశానికి రోల్ మోడల్‌గా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జైళ్లశాఖ డీజీ అంజనీ కుమార్, శాంతిభద్రతల అదనపు డీజీ మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.



న్యాయమూర్తులు జస్టిస్ విజయ్, జస్టిస్ హరినాథ్, జస్టిస్ సుమతిలను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

## న్యాయమూర్తులకు ఘన సన్మానం

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లను హైకోర్టు న్యాయవాదుల సంఘం బుధవారం ఘనంగా సన్మానించింది. హైకోర్టు అసోసియేషన్ హాలులో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, ఏఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి సుబోధ్ ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## హెచ్‌సీఈఏ ఎన్నికలకు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వండి

- ఎన్నికల అధికారికి రిజిస్ట్రార్ జనరల్ సూచన

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నికలనిర్వహణకు తక్షణమే మరో నోటిఫికేషన్ జారీ చేయాలని రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీ పార్థసారథి ఎన్నికల అధికారికి సూచించారు. ఎన్నికల నిర్వహణకు ఈనెల 13న ఇచ్చిన నోటిఫికేషన్‌ను విస్మరించాలని ఎన్నికల అధికారికి తెలిపారు. ఈనేపథ్యంలో ఎన్నికల అధికారిగా తాను కొనసాగలేనని, బాధ్యతల నుంచి తక్షణమే రిలీవ్ చేయాలని ఎన్నికల అధికారి సూర్యానంద రెడ్డి కోరినట్లు బుధవారం ఆర్‌జీ జారీ చేసిన మెమోరాండంలో పేర్కొన్నారు.

## విశాఖలో డేటా సెంటర్‌కు కేంద్రం సహకారం

- ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాం: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

విశాఖపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు. విశాఖలో డేటాసెంటర్ ఏర్పాటు చేయడానికి ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దానికి యాంకర్ కంపెనీగా గూగుల్ ఆసక్తి చూపుతోందని, దీనికోసం కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా సాయం కోరుతోందా? అంటూ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ బుధవారం లోక్‌సభలో ప్రశ్నించారు. అశ్వినీ వైష్ణవ్ సమాధానమిస్తూ విశాఖపట్నాన్ని డేటా సిటీగా అభివృద్ధి చేస్తామని ఏపీ ప్రభుత్వం తెలిపిందని, అందులో ఏఐ, అడ్వాన్స్‌డ్ ఏఐ రీసెర్చి సెంటర్, డిజిటల్ స్కిల్లింగ్ వంటివి ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు చర్చల దశలో ఉందని, డేటా సిటీ ఏర్పాటుకు న్యాయపర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో దఫదఫాలుగా చర్చలు జరుగుతున్నాయని వివరించారు.

## స్త్రీశక్తి సూపర్ సక్సెస్

- భారం కాదు.. బాధ్యతగా భావిస్తున్నాం!
- మహిళలకు స్మార్ట్ కార్డుల యోచన: మంత్రి రాంప్రసాద్ రెడ్డి



విజయవాడ (బస్‌స్టేషన్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలకు కూటమి ప్రభుత్వం కానుకగా అందిస్తున్న ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం 'స్త్రీశక్తి'ని భారం అనుకోవటం లేదని, తమ బాధ్యతగా భావిస్తున్నామని రాష్ట్ర రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఈ పథకం సూపర్ సక్సెస్ అయిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమావేశపు హాలులో ఆర్టీసీ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష, సక్సెస్ మీట్ నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం ద్వారా ఆరు రోజుల్లో 65 లక్షల మందికి పైగా ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేయటంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఎంతగానో కృషి చేశారన్నారు. ఉచిత బస్సు లబ్ధిదారులకు త్వరలో స్మార్ట్ కార్డులు అందించే యోచనలో ఉన్నామన్నారు. కొందరు కువిమర్శలు చేస్తున్నారని, పథకం అమలులో నిజంగా ఏవైనా లోపాలుంటే సద్విమర్శలు చేస్తే తీసుకుంటామని తెలిపారు. ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో కూడా ఉచిత బస్సు అమలు చేస్తున్నామని, సరిహద్దు గ్రామాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

## అర్హులైన చేనేతలందరికీ ముద్ర రుణాలు: సవిత



మంగళగిరి సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన చేనేత కార్మికులందరికీ సకాలంలో ముద్ర రుణాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత చెప్పారు. డిసెంబరు నాటికి 70% ముద్ర రుణాలు పంపిణీ చేయాలని సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో బుధవారం ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆమె సమీక్షించారు. చేనేత, జౌళి శాఖలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్ రేఖారాణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి 121 కిలోల

# బంగారు కానుక!

### ఎవరా భక్తుడు.. ఏమా విశేషం?

### రూ.140 కోట్ల విలువైన భారీ విరాళం

- ఆధునిక చరిత్రలో ఇదే మొదటిసారి
- టీటీడీ ఖజానాలో 10వేల కిలోలకు పైగా స్వర్ణం
- అలంకరణలకు 1100 స్వర్ణాభరణాలు

(అమరావతి/తిరుమల - ఆంధ్రజ్యోతి)



అప్పుడెప్పుడో శ్రీకృష్ణ దేవరాయలు వెంకటేశ్వర స్వామికి భారీ స్థాయిలో బంగారు నగలు, కానుకలు పలుమార్లు సమర్పించుకున్నట్లు శాసనాలు చెబుతున్నాయి. ఆ తర్వాత.. మైసూరు మహారాజ వంశీయులు అనేక సందర్భాల్లో ఏడుకొండల వెంకన్నకు ఎంతో విలువైన బంగారు నగలు కానుకగా ఇచ్చారు. వాటిని ఇప్పటికీ స్వామికి అలంకరిస్తూ ఉన్నారు. వేడుకల్లో ఉపయోగిస్తున్నారు.

ఇక.. ఎన్టీఆర్ హయాంలో ప్రభుత్వం తరఫున శ్రీవారికి వజ్ర కిరీటం చేయించారు. దాని విలువ రూ.22 కోట్లు! శ్రీవారికి సంబంధించిన వివిధ ట్రస్టులకు పదికోట్లు, ఇరవై కోట్లు విరాళాలు తరచూ అందుతూనే ఉన్నాయి. కానీ.. ఇప్పుడు ఒక అజ్ఞాత భక్తుడు ఏకంగా 121 కిలోల బంగారాన్ని వెంకన్నకు సమర్పిస్తున్నారు. మంగళవారం పీ4 కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన ఈ విషయం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది. 'ఎవరా అజ్ఞాత భక్తుడు?' అనే చర్చ కూడా మొదలైంది. "వెంకటేశ్వరస్వామి భక్తుడొకరు కంపెనీ పెట్టారు. అది చాలా పెద్దస్థాయికి వెళ్లింది. ఆ కంపెనీలో 60 శాతం విక్రయించగా ఆయనకు ఆరేడువేల కోట్ల రూపాయలు వచ్చాయి. ఈ సంపద తనకు వెంకన్న ఇచ్చిందే అని ఆయన నమ్మారు. అందులో కొంత స్వామికే తిరిగి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. 121 కిలోల బంగారాన్ని శ్రీవారికి కానుకగా ఇస్తున్నారు. దీని విలువ రూ.140 కోట్ల నుంచి రూ.150 కోట్లు ఉంటుంది. ఆయన నన్ను కలిసి ఈ మేరకు లేఖ కూడా ఇచ్చారు. తన పేరు మాత్రం బయటికి చెప్పొద్దని కోరారు. వెంకటేశ్వర స్వామికి రోజుకు 120 కిలోల ఆభరణాలు అలంకరిస్తారు. ఆ భక్తుడి ద్వారా అంతకంటే ఒక్క కిలో ఎక్కువ ఇప్పించుకోవాలని స్వామి నిర్ణయించుకున్నట్లుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. స్వామికి 120 కిలోల బంగారం అలంకరిస్తారని తనకూ తెలియదని, 121 కిలోలు ఇవ్వాలని తన మనసుకు తోచడం విశేషమని ఆ అజ్ఞాత భక్తుడు తనకు చెప్పారని సీఎం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన ప్రకారం... ఆ అజ్ఞాత భక్తుడెవరో తెలిసే అవకాశం లేనట్లే. ఇక... ఆయన శ్రీవారికి 121 కిలోల బంగారాన్ని ఎప్పుడు ఇస్తున్నారు? ఏ రూపంలో ఇస్తారు? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియాల్సి ఉంది. శ్రీవారికి అందనున్న ఈ భారీ కానుకకు సంబంధించి టీటీడీ అధికారులకు సీఎంవో నుంచి సమాచారం అందినట్లు తెలిసింది.

### బంగారు స్వామి...

చరిత్రలో రాజులు, మహంతులు, రాజ వంశీకులు, బ్రిటిష్ పాలకులతోపాటు నవాబులూ శ్రీవారికి లెక్కలేనన్ని స్వర్ణాభరణాలు సమర్పించారు. ఇటీవలి కాలానికి వస్తే.. 2009లో గాలి జనార్దన్ రెడ్డి రూ.42 కోట్ల విలువ చేసే వజ్రాల కిరీటాన్ని స్వామికి సమర్పించాడు. అధిక బరువు ఉన్న నేపథ్యంలో దీనిని వాడటం లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించడంతో... కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5.2 కోట్ల విలువైన 19.072 కిలోల బరువున్న రెండు స్వర్ణాభరణాలు అందించి మొక్కు తీర్చుకున్నారు. ప్రవాసాంధ్రుడు రామలింగరాజు ఇచ్చిన రూ.11 కోట్ల విరాళంతో శ్రీవారికి నూతన సహస్రనామ కాసుల బంగారు హారాన్ని తయారు చేయించారు. మొత్తంగా శ్రీవారిని అలంకరించేందుకు సుమారు 1100 బంగారు ఆభరణాలు, 376 వజ్ర వైడూర్యాల నగలు ఉన్నాయి. బంగారు ఆభరణాల కానుకలు ఇబ్బడి ముబ్బడిగా వస్తుండటంతో... టీటీడీ కొన్ని నియంత్రణలు విధించింది. ముందస్తు అనుమతితో కొన్ని నిబంధనల మేరకు మాత్రమే ఈ కానుకలు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో హుండీ ద్వారా బంగారు కానుకలు రావడం ఎక్కువైంది. ఏటా హుండీ ద్వారానే సుమారు టన్ను బంగారం వస్తున్నట్లు సమాచారం. అలంకరణలకు ఉపయోగించేవి మాత్రం అలా ఉంచి... ఇతర ఆభరణాలు, కానుకలను 2010 వరకు మింట్ ద్వారా కరిగించి భక్తులకు విక్రయించేవారు. ఆ తరువాత బ్యాంకుల్లో డిపాజిట్ చేయటం మొదలు పెట్టారు. మొదటిసారిగా 2010 మే 23వ తేదీన 1075 కిలోల బంగారాన్ని డిపాజిట్ చేశారు. 2022 సెప్టెంబరు 30వ తేదీ నాటి లెక్కల ప్రకారం శ్రీవారి బంగారు డిపాజిట్లు 10,258 కేజీలు ఉన్నట్లు సమాచారం!

## ఆ రైతులకూ 'అన్నదాత' నిధులు

- ఎన్నికల కోడ్‌తో ఆగిన సొమ్ము విడుదల
- 1,42,765 ఖాతాలకు రూ.71.38 కోట్లు జమ



అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా 'అన్నదాత సుఖీభవ' పథకం లబ్ధి పొందలేకపోయిన రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం రూ.71.38 కోట్లు విడుదల చేశారు. ఈ పథకం మొదటి విడత కింద ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున 1,04,107 మంది రైతులతో పాటు ఈ-కేవైసీ, ఎన్పీసీఐ క్రమబద్ధీకరించుకున్న మరో 38,658 మంది కలిపి మొత్తం 1,42,765 మంది ఖాతాలకు మంత్రి నిధులు జమ చేశారు. ఈ నెల 2న ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం తూర్పు వీరాయపాలెంలో సీఎం చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల చేశారు. అప్పట్లో కొన్నిచోట్ల స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఆ ప్రాంతాలకు మినహా రాష్ట్రవ్యాప్తంగా 44.75 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.5వేలు చొప్పున జమ చేశారు. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో స్థానిక ఎన్నికలు జరిగిన ప్రాంతాల రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు ఇప్పుడు సొమ్ము చెల్లింపులు జరిపారు. కాగా, ఎన్పీసీఐలో మ్యాపింగ్ కాని, వాడుకలో లేని 1,21,422 ఖాతాల్లో 38,658 మంది మాత్రమే క్రమబద్ధీకరణ చేయించుకున్నారని, మిగిలినవారు కూడా మ్యాపింగ్ అయ్యేలా క్షేత్రస్థాయి అధికారులు దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు.

## ఓఎంసీకి జరిమానా పెంచాలని సీబీఐ పిటిషన్

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో సీబీఐ కోర్టు ఓఎంసీకి విధించిన రూ.లక్ష జరిమానాను పెంచాలని పేర్కొంటూ సీబీఐ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ఈ మేరకు మే 6న సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును సవరించాలని పేర్కొంది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని పేర్కొంటూ ఓఎంసీకి నోటీసులు జారీచేసింది. ఇతర పిటిషన్‌లతో కలిపి విచారిస్తామని పేర్కొంది.

# పెద్దారెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

- సింగిల్ జడ్జి ఉత్తర్వులు సస్పెన్షన్
- ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు




అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. తాడిపత్రిలోని ఆయన ఇంటికి వెళ్లి నివసించడానికి తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం సస్పెండ్ చేసింది. ప్రధాన పిటిషన్‌లో జారీ చేసిన ఉత్తర్వులకు మించి కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో సింగిల్ జడ్జి ఆదేశాలిచ్చారన్న సీనియర్ న్యాయవాది వాదనతో ప్రాథమికంగా సంతృప్తి చెందినట్లు పేర్కొంది. పెద్దారెడ్డికి నోటీసులు జారీ చేసింది. అప్పీల్‌పై విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లేందుకు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పోలీసులు అమలు చేయడం లేదని పేర్కొంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. విచారణ జరిపిన సింగిల్ జడ్జి... ఈ నెల 18న పెద్దారెడ్డి తాడిపత్రిలోని ఆయన ఇంటికి వెళ్లి నివాసం ఉండేందుకు తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అనంతపురం జిల్లా ఎస్పీ ధర్మాసనం ముందు లెటర్ పేటెంట్ అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ బుధవారం విచారణకు రాగా ఎస్పీ జగదీశ్ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కోర్టుధిక్కరణ వ్యాజ్యంలో నిర్దిష్ట తేదీని నిర్ణయించి ఉత్తర్వులు అమలు చేయాలని సింగిల్ జడ్జి ఆదేశించడంపైనే తమ అభ్యంతరమని తెలిపారు. పెద్దారెడ్డి పిటిషన్‌లో ఇచ్చిన ఉత్తర్వులకు మించి సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ధిక్కరణకు పాల్పడ్డారని న్యాయమూర్తి ప్రాథమిక నిర్ధారణకు వస్తే సంబంధిత అధికారికి శిక్ష విధించవచ్చని, అంతకుమించి ఆదేశాలు ఇవ్వడానికి వీల్లేదన్నారు. కేతిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి సరైన ఉత్తర్వులే ఇచ్చారని అన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో కోర్టు అధికార పరిధి ఏమిటి? ఉత్తర్వులు అమలు చేయకుండా ఉల్లంఘనకు పాల్పడ్డారని నిర్ధారణకు వస్తే సంబంధిత అధికారికి నోటీసులు జారీ చేయాలి. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు శిక్ష విధించకూడదో వివరణ కోరాలి. ఆ తర్వాత శిక్ష విధించాలి. లేదా అధికారులు ఆదేశాలు అమలు చేశారని సంతృప్తి చెందితే ధిక్కరణ పిటిషన్‌ను కొట్టివేయాలి. కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో తదుపరి ఉత్తర్వులు ఏమైనా జారీ చేయవచ్చా? అని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వాదనలు వినిపించాలని కోరింది. పొన్నవోలు బదులిస్తూ... సింగిల్ జడ్జి ఎలాంటి తదుపరి ఉత్తర్వులు ఇవ్వలేదని తెలిపారు. రిట్ పిటిషన్‌లో ఉత్తర్వులను కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో ప్రస్తావించారని ఆయన చేసిన వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. సింగిల్ జడ్జి ఆదేశాలను సస్పెండ్ చేసింది.

# ఎమ్మెల్యే బుడ్డా ఆటవిక దాడి



(మొదటి పేజీ తరువాయి)

ఘటన సోషల్ మీడియాలో కలకలం రేపింది. పోలీసులు, అటవీశాఖ సిబ్బంది తెలిపిన సమాచారం ప్రకారం.. మంగళవారం సాయంత్రం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అనుచరులతో కలిసి పలు వాహనాల్లో శ్రీశైలానికి వెళ్లారు. రాత్రి సుమారు 10గంటలకు వారి వాహనాలు శిఖరం దాటుకుని అటవీశాఖ చెక్‌పోస్టు వద్దకు చేరే సమయానికి గేటు వేసి ఉంది. ఎదురుగా 4వాహనాలు నిలిచి ఉన్నాయి. శ్రీశైలం నుంచి దోర్నాల వెళుతున్న భక్తులకు చెందిన ఆ వాహనాలను.. సమయం అయిపోయిందంటూ చెక్‌పోస్టు సిబ్బంది నిలిపివేశారు. ఇది గమనించిన ఎమ్మెల్యే... ఆ భక్తుల వాహనాలను పంపించి, దారి వదలాలంటూ సిబ్బందికి దురుసుగా సూచనలు చేశారు. తనను చూడగానే గేటు తీయలేదని అసభ్య పదజాలంతో రెచ్చిపోయారు. 'ఫారెస్టు సిబ్బందిని పిలవండి' అంటూ కేకలు వేశారు. తన అనుచరులను పంపించి సమీపంలోని అటవీశాఖ మొబైల్ బీట్ సిబ్బందిని పిలిపించారు. వారంతా ఎర్రగొండపాలెం రేంజ్ నక్కంటి బీట్‌కు చెందిన సిబ్బంది. వారు రాగానే, బూతులతో ఎమ్మెల్యే, అనుచరులు రెచ్చిపోయారు. ఓ ఉద్యోగిపై చెయ్యి చేసుకున్నారు. ఆ దృశ్యాలు సీసీ ఫుటేజీలో కనిపించాయి. ఎమ్మెల్యే, అనుచరులకు, అటవీ ఉద్యోగులకు మధ్య వాగ్వాదం జరిగింది. రెచ్చిపోయిన ఎమ్మెల్యే ఫారెస్టు వాహనంలోకి ఎక్కి.. నలుగురు ఉద్యోగులను బలవంతంగా ఎక్కించుకున్నారు. ఎమ్మెల్యే వాహనాల్లో ఆయన అనుచరులు ఎక్కి.. బుడ్డాను అనుసరించారు. అందరూ కలిసి సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. అర్ధరాత్రి వరకు వారిని చిత్రహింసలకు గురిచేశారు. ఈ దాడిలో గాయపడిన వారిలో నక్కంటి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాములునాయక్, చిన్నారుట్ల గార్డు గురువయ్య, డ్రైవర్ కరీముల్లా అనే వారిని గుర్తించారు. మరో గార్డు వివరాలు తెలియాల్సి ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీశైలం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

### వివాదాల.. బుడ్డా..

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తరచూ వివాదాల్లోకి చిక్కుకుంటున్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డిపై ఎమ్మెల్యే బుడ్డా అనుచరులు దాడులు చేశారు. బుడ్డా వ్యవహారంపై టీడీపీ వర్గాల నుంచే అనేక విమర్శలు వినిపిస్తున్నాయి.

### సీఎం ఆగ్రహం

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం నేరుగా అటవీ అధికారులతో మాట్లాడి, ఏం జరిగిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పు ఎవరిదైనా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయాలని, మొత్తం ఘటనపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాగా, అటవీశాఖ అధికారులపై దాడి ఘటనపై డిప్యూటీ సీఎం, ఆ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే, ఆయన అనుచరుల ప్రమేయంపై విచారించి సవివరంగా నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు పవన్ పేర్కొన్నారు. కాగా, అటవీ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న అధికారులను బంధించి, దాడికి దిగడం దారుణమని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మార్కాపురం యూనిట్ (ఏపీజేఎఫ్‌వోఏ) ఎఫ్ఎస్‌వో పి.కరీముల్లా డిమాండ్ చేశారు.

## సెక్షన్ 104 రాజ్యాంగ విరుద్ధం

- హైకోర్టులో పిల్ దాఖలు

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి హత్యకు పాల్పడితే ఆయనకు మరణశిక్ష లేదా జీవించి ఉన్నంత కాలం జైలుశిక్ష విధించేందుకు వీలు కల్పిస్తున్న భారతీయ న్యాయ సంహితలోని(బీఎన్ఎస్) సెక్షన్ 104ను రాజ్యాంగవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర న్యాయ, హోంశాఖ కార్యదర్శులు, రాష్ట్ర న్యాయ, హోంశాఖ ముఖ్యకార్యదర్శులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ పిల్‌ను విశాఖపట్నంజిల్లా చోడవరానికి చెందిన బగ్గు సత్య చంద్రశేఖర్ అనే వ్యక్తి దాఖలుచేశారు. ఆయన తరఫున న్యాయవాది శ్రీకృష్ణ సాయి భార్గవ్ వాదనలు వినిపించారు. సెక్షన్ 104 రాజ్యాంగ విరుద్ధమైనదే కాకుండా ప్రాథమిక హక్కులకు కూడా భంగకరమేనని వాదించారు. "జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి హత్యకు పాల్పడితే మరణశిక్షను విధించాలని ఐపీసీ సెక్షన్ 303 చెబుతోంది. మిథు వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో ఈ సెక్షన్‌ను రాజ్యాంగవిరుద్ధమైనదని సుప్రీంకోర్టు ప్రకటించింది. కేసు పూర్వపరాలను పరిశీలించి, శిక్ష విధించే విషయంలో న్యాయమూర్తులకు ఉన్న విచక్షణాధికారాన్ని ఇది నిరోధిస్తుందని పేర్కొంది. ఈ సెక్షన్‌ను రద్దుచేసింది. అయితే, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత కూడా ఈ తరహా సెక్షన్‌నే బీఎన్ఎస్‌లో సెక్షన్ 104 రూపంలో కొనసాగిస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధం." అని వాదించారు.

## ఆన్‌లైన్‌లోనే డిగ్రీ అడ్మిషన్లు

- 26 వరకు రిజిస్ట్రేషన్.. 31న సీట్ల కేటాయింపు



అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ డిగ్రీ అడ్మిషన్లు చేపడతామన్న ప్రభుత్వం చివరికి ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లకే నోటిఫికేషన్ జారీ చేసింది. 2025-26 డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులు https://oamdc.ucanapply.com వెబ్‌సైట్ ద్వా రా ఈనెల 26 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 24 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు గడువు ఉంటుంది. 29న మార్చుకోవచ్చు. ఈనెల 31న సీట్లు కేటాయిస్తారు. సెప్టెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఓసీ విద్యార్థులు రూ.400, బీసీ విద్యార్థులు రూ.300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. మొబైల్ నంబరు, ఆధార్ నంబరు, ఇంటర్ హాల్‌టికెట్ నంబరు ఇచ్చి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కాగాడిగ్రీ కాలేజీల యాజమాన్యాలతో ఇటీవల చర్చలు నిర్వహించిన అధికార పార్టీ ఎమ్మెల్సీలు ఆఫ్‌లైన్‌లోనూ అడ్మిషన్లు చేపట్టేలా చూస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా ఉన్నత విద్యాశాఖ ఆఫ్‌లైన్ అడ్మిషన్లపై జీవో కూడా జారీ చేసింది. కానీ ఇప్పుడు నోటిఫికేషన్ కేవలం ఆన్‌లైన్ విధానంలో సీట్లు భర్తీ చేసేందుకే ఇచ్చారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి బుధవారం అన్ని విశ్వవిద్యాలయాల వీసీలతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఆఫ్‌లైన్ అడ్మిషన్లపై ఇందులోనూ ఎలాంటి స్పష్టత రాలేదు.

### అద్దె భవనాల్లోనే కొనసాగింపు

ఈ ఏడాది డిసెంబరు నాటికి అన్ని కాలేజీలు కచ్చితంగా సొంత భవనాల్లోకి మారాలని వైసీపీ ప్రభుత్వంలో జీవో జారీ అయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 30 ఏళ్ల లీజుకు అనుమతిస్తూ మరో జీవో ఇచ్చారు. ఒకవేళ సొంత భవనం లేకపోతే 30 ఏళ్ల లీజుతో ఉన్న భవనాల్లోకి కాలేజీలు మార్చుకోవాలని ఆదేశించింది. ఈ ఏడాది చివరితో కాలపరిమితి ముగుస్తున్నందున అద్దె భవనాల్లో ఉన్న కాలేజీలు తప్పనిసరిగా 30 ఏళ్ల లీజు భవనాల్లోకి మారే ప్రతిపాదనలు వర్సిటీలకు సమర్పించాలి. కానీ దాదాపు 450 కాలేజీలు దీనిపై ప్రతిపాదనలు సమర్పించలేదని తెలిసింది. అయినా యూనివర్సిటీలు ఆ కాలేజీలకు అఫిలియేషన్లు మంజూరు చేశాయి. దీనిపై మిగిలిన కాలేజీల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



# సరుకుల రవాణా బెలూన్లు వస్తున్నాయ్..

**2029 కల్లా 'రెడ్ బెలూన్' కార్గో సేవలు**

- హైడ్రోజన్‌తో నడిచే ఎయిర్‌షిప్
- తక్కువ వ్యయంతో రవాణాకు వీలు
- ఆర్‌టీఐహెచ్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా విజయవాడ కంపెనీ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సరుకుల రవాణా అంటే.. మనకు లారీలు, రైళ్లు, విమానాలు, నౌకలు గుర్తొస్తాయి. వీటికి ఇప్పుడు బెలూన్లు కూడా తోడవ్వనున్నాయి. ఎయిర్‌బస్ విమానానికి మూడింతలు ఉండే బెలూన్లు త్వరలోనే ఆకాశంలో ఎగురుతూ కనిపించనున్నాయి. గ్రీన్‌హైడ్రోజన్‌తో నడిచే ఈ బెలూన్లు 2029 కల్లా కార్గో సేవలను అందించేందుకు సిద్ధమవుతున్నాయి. విజయవాడకు చెందిన డీప్ టెక్ స్టార్టప్ కంపెనీ రెడ్ బెలూన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హెలిక్స్ పేరుతో కార్గో బెలూన్‌లను రూపొందిస్తోంది. ఏఐతో పనిచేసే ఇలాంటి బెలూన్లు దేశీయంగా తయారు చేయడం ఇదే మొదటిసారి. వాణిజ్య, రక్షణ అవసరాల కోసం వీటిని అభివృద్ధి చేస్తున్నారు. బుధవారం మంగళగిరిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్) ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్టప్ స్టాల్స్‌లో రెడ్‌బెలూన్ నమూనాను ప్రదర్శించారు. స్టాల్‌లో విమానం ఆకారంలో ఉన్న తెల్లటి బెలూన్‌ను అందరూ ఆసక్తిగా చూశారు. అంతరిక్ష రంగంలో పరిశోధన-అభివృద్ధి విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉన్న డాక్టర్ సీవీఎస్ కిరణ్, శిరీష్ పల్లికొండ రెడ్ బెలూన్ సంస్థను స్థాపించారు. ఈ బెలూన్ డిజైన్‌నూ కూడా వారే రూపొందించారు. సహజంగా ఎయిర్‌బస్ విమానం చాలా పెద్దదిగా ఉంటుంది. దానికి మూడింతల సైజులో కార్గో బెలూన్ ఉంటుంది. అతి తక్కువ గ్రౌండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌తో కార్గో బెలూన్లను నిర్వహించవచ్చు. రవాణా సదుపాయాలు లేని మారుమూల ప్రాంతాలు, ప్రకృతివైపరీత్యాల ప్రభావిత ప్రాంతాలకు సులువుగా సరుకులు రవాణా చేయవచ్చు. సంస్థ ప్రతినిధులు కిరణ్, శిరీష్ పలు ఆసక్తికర అంశాలు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఈ బెలూన్‌లను రిమోట్ సాయంతో 20 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలో వస్తువులను చేరవేయచ్చన్నారు. కిలో బరువుకు రూ.80 నుంచి రూ. 100 దాకా వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు శిరీష్ వివరించారు. రైలు, రోడ్డు రవాణా కంటే తక్కువ వ్యయం అవుతుందన్నారు. రెడ్‌బెలూన్ కార్గో సేవలు రాష్ట్రంలో 2029 నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు.



## స్టార్టప్‌లకు సహకారం: చంద్రశేఖరన్

సీఎం చంద్రబాబు దార్శనికతతో కొద్ది సమయంలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రూపమిచ్చారని టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అభినందించారు. వినూత్న ఆవిష్కరణలు సమష్టి కృషి అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో స్టార్టప్‌లకు సహకారం అందిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం స్టార్టప్‌లకు మంచి అవకాశాలున్నాయన్నారు.

## మార్చి నాటికి 10 లక్షల ఇళ్లు

- వచ్చే నెలలో 3 లక్షల గృహ ప్రవేశాలు
- ఇళ్లు లేని పేదల గుర్తింపునకు సర్వే: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో తలపెట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బుధవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మార్చి నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. వీటిలో 3 లక్షల ఇళ్లలో వచ్చే నెలలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని ఆదేశించారు. సంక్రాంతి నాటికి మరో 2లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం చేపట్టిన ఇళ్ల ప్రాజెక్టులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని పేద కుటుంబాలను గుర్తించేందుకు 15 రోజుల్లోగా సర్వే పూర్తిచేసి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు అవసరమైన భూములను గుర్తించాలన్నారు. పెద్ద కుటుంబాల వారికి ఉమ్మడి ఇళ్లు నిర్మించే దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం కింద మంజూరు చేసిన ఇళ్లను పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు విడుదల చేయాలని సీఎం చెప్పారు. కాగా, పీఎంఏవై(అర్బన్), పీఎంఏవై(గ్రామీణ్), పీఎం జన్‌మన్ పథకాల కింద రాష్ట్రానికి మొత్తం 18,59,504 ఇళ్లు మంజూరు కాగా.. వీటిలో ఇప్పటికే 9,51,351 గృహాల నిర్మాణం పూర్తయిందని అధికారులు సీఎంకు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో 4,647 మంది లబ్ధిదారులకు రూ.16.37 కోట్లు చెల్లించగా.. రాష్ట్రవ్యాప్తంగా 2,73,709 మంది లబ్ధిదారులకు రూ.919.29 కోట్ల మేర బిల్లులను త్వరలో చెల్లించనున్నట్లు వివరించారు.

### టిడ్కోను నాశనం చేశారు: నారాయణ

గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను సర్వనాశనం చేసిందని మంత్రి నారాయణ విమర్శించారు. మొత్తం ఇళ్లకు వైసీపీ రంగులు పులిమేశారని ఆ రంగులు వేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు కూడా ఇవ్వలేదన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ఖర్చు చేయాల్సిన రూ.2,900కోట్లను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు.

"యువతలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు పనిచేస్తాయి. స్టార్టప్‌లకు చేయూత అందిస్తాయి. వ్యాపార వేదికగా ఉపకరిస్తాయి. ఇంటికో పారిశ్రామికవేత్త కావాలన్నదే నా ధ్యేయం. ఈ లక్ష్యంతో ఇన్నోవేషన్ హబ్‌లు పనిచేస్తాయి.
పీ-4 కింద పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రయత్నిస్తున్నాం. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీగా ఆంధ్రప్రదేశ్‌ను మారుస్తాం." - సీఎం చంద్రబాబు





మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు, చిత్రంలో టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్, మంత్రులు లోకేశ్, మనోహర్, భరత్.. స్టార్టప్, ఎంఎస్ఎంఈల స్టాళ్లను పరిశీలిస్తున్న చంద్రబాబు, చంద్రశేఖరన్

# ఆవిష్కరణ @ ఆంధ్రా

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతీయ ఇన్నోవేషన్ హబ్‌లు కూడా వర్చువల్‌గా ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ముఖ్యంగా అగ్రిటెక్‌లో ఇన్నోవేషన్‌కు విస్తృతమైన అవకాశాలున్నాయన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించాలన్న ఆలోచనను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన సానుకూలత వ్యక్తం చేయడంతో పాటు సలహాలు ఇస్తానని చెప్పారన్నారు.

### రతన్‌టాటా సేవలు దేశానికే ఆదర్శం

"రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ అమరావతి కేంద్రంగా పనిచేస్తుంది. గివ్ బ్యాక్ టూ సొసైటీ అనే విధానాన్ని రతన్‌టాటా ఆచరించి సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారు. ఆయన చేసిన సేవలు దేశానికే ఆదర్శం. ఆయన భరత మాత ముద్దుబిడ్డ కావడం గర్వకారణం. రతన్‌టాటా నిజాయితీపరుడు. సామాన్యుడిలా జీవించినా, ఆయన ఆలోచనలు మాత్రం ఎంతో ఎత్తులో ఉండేవి. ఆయన పేరు మీద ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించడం రాష్ట్రానికి చరిత్రాత్మక అవసరం. సరైన ప్రభుత్వ విధానాలు అవలంబిస్తే ఆదాయం, సంపద వస్తుంది. భవిష్యత్తు అంతా ఐటీ రంగానిదే. దేశంలో ఎవరూ చేయలేనంతగా నేను ముఖ్యమంత్రిగా ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతులు వచ్చేలా చేశాను. పదేళ్లనాడు పదకొండో ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన దేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతుంది. అప్పుడు దేశ సంపద మరింతగా పెరుగుతుంది. రానున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి రాష్ట్రం సంసిద్ధంగా ఉండాలి. ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రాంతాలవారీగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నాం. ప్రస్తుతం అమెరికా, చైనాలతో పోటీ పడేందుకు మనం సిద్ధమవుతున్నాం. ఇందుకోసం అమరావతి సహా ఇతర రాష్ట్రాల్లోనూ ఆర్థికాభివృద్ధి పెరగాలి" అని అన్నారు.

### సంజీవని ప్రణాళికతో అందరికీ ఆరోగ్యం

"ప్రభుత్వానికి ఆదాయం పెరిగితే సంక్షేమాన్ని మరింత మిన్నగా అమలు చేయడానికి వీలవుతుంది. ఆదాయ వనరుల పెంపు కోసం ప్రతి నియోజకవర్గంలో ఓ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తాం. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం డిజినెర్వ్ సెంటర్ ప్రాజెక్టులోనూ టాటాతో కలిసి పనిచేస్తున్నాం. ప్రస్తుతం దీనిని కుప్పం నియోజకవర్గంలో సంజీవని పేరుతో అమలు చేస్తున్నాం. దీని ద్వారా ప్రపంచంలో ఉన్న వైద్యచికిత్సల టెక్నాలజీని ఒకచోటకు చేర్చి ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్నదే లక్ష్యం" అని చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో టాటా సన్స్ గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్, మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్డ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్‌రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్, ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పాల్గొన్నారు.

### నేను విభిన్నంగా ఆలోచిస్తా

"నేను విభిన్నంగా ఆలోచిస్తా. 1995లో టెలికామ్ విప్లవం వచ్చేందుకు నేనూ ఒక కారణం. అప్పట్లో స్వదేశీ ఫోన్‌కాల్స్ కోసం బీఎస్ఎన్ఎల్, విదేశీ కాల్స్ కోసం వీఎస్ఎన్ఎల్ ఉండేవి. నాటి ప్రధాని వాజ్‌పేయితో మాట్లాడి ఫోన్‌ల రంగంలో ప్రైవేటు సంస్థలు రావాలని సూచించాను. టెలికామ్ రంగం గురించి నేను ప్రస్తావించినప్పుడు.. డబ్బుల గురించి ప్రశ్నించారు. టెలికామ్ రంగంలోకి ధీరూబాయ్ అంబానీని రప్పించడంలో సఫలమయ్యాను" అని చంద్రబాబు తెలిపారు.



### రిజిస్ట్రేషన్లలో గిన్నిస్ రికార్డు

ఏపీలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌ల కోసం కేవలం 24 గంటల్లోనే రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లు జరిగినట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఈ ఘనత సాధించిన ఏపీ ఇన్నోవేషన్ సొసైటీకి గిన్నిస్ రికార్డు లభించింది. ముఖ్యమంత్రికి చంద్రబాబుకు గిన్నిస్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ స్టార్టప్ కంపెనీలు మయూరి టెక్‌పార్కులో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. వాటిని సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు.

## ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా ఏపీ

**నాన్న కూడా విజయవంతమైన పారిశ్రామికవేత్తే : లోకేశ్**



అమరావతి/మంగళగిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం త్వరలోనే ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా అభివృద్ధి చెందుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సృజనాత్మక ఆలోచనలతో ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. దిగ్గజ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్‌లో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "రతన్ టాటా గౌరవార్థం రాష్ట్రంలో ఇన్నోవేషన్ హబ్‌ను నిర్మించాలని నిర్ణయించాం. ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేసిన మయూరి టెక్ ఒక భవనం కాదు.. లక్షలాది మంది యువతకు ఆశాకిరణం. ఈ హబ్ ద్వారా వినూత్న ఆలోచనలను ప్రోత్సహిస్తాం. మహిళల వినూత్న ఆలోచనలకు, వ్యాపారాభివృద్ధికి సహకారాన్ని అందిస్తాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ నగరాన్ని ఐటీ హబ్‌గా మార్చిన ఘనత చంద్రబాబుదే. సహజంగా ఒక నాయకుడికి ఒక నగరాన్ని అభివృద్ధి చేసే అవకాశం వస్తుంది. కానీ చంద్రబాబుకు అమరావతి నగరాన్ని కూడా అభివృద్ధి చేసే అరుదైన అవకాశం దక్కింది. ఆయన మంత్రివర్గంలో పని చేయడం చాలా కష్టం. ఉదయం పది గంటలకు ఫోన్ చేసి ఒక అసైన్‌మెంట్ ఇచ్చి మళ్లీ 15 నిమిషాల్లోనే ఏమైందంటూ రిజల్ట్ గురించి ఆరా తీస్తారు. చంద్రబాబు వద్ద రెండోసారి మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. 2019-24 మధ్య కాలంలోని పారిశ్రామిక వ్యతిరేక విధానాల ఆనవాళ్లను తుడి చేసి, రాష్ట్ర పారిశ్రామికరంగంలో కొత్త రూపురేఖలను తీసుకువచ్చాం." అని లోకేశ్ అన్నారు.

## అనర్హుల ఏరివేతకే 'సదరం' పునఃపరిశీలన

- 5.10 లక్షల మందిలో 4.50 లక్షల మందికి సర్టిఫికెట్ల తనిఖీ పూర్తి...లక్ష మంది అనర్హులు
- అత్యధికంగా పులివెందులలోనే...: పార్థసారథి

అమరావతి, నర్సీపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'బోగస్ సర్టిఫికెట్లతో దివ్యాంగుల పింఛన్లను పొందుతున్న అనర్హులను ఏరివేసేందుకే సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన జరుగుతుంది' అని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వం హయాంలో అనర్హులకు కూడా మంజూరు చేసి దుర్వినియోగం చేశారు. రాష్ట్రంలో మొత్తం 7.86 లక్షల మంది దివ్యాంగ పింఛన్లను పొందుతున్నారు. వారిలో 5.10 లక్షల మందికి చెందిన సదరం సర్టిఫికెట్లను పునఃపరిశీలించేందుకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకూ 4.50 లక్షల మంది సర్టిఫికెట్ల తనిఖీని పూర్తి చేసుకున్నారు. వారిలో దాదాపు ఒక లక్ష మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన 60వేల మంది సర్టిఫికెట్లను రీవెరిఫై చేయించుకొనేందుకు ముందుకు రాలేదు. వీరందరికీ మరోసారి నోటీసులు జారీ చేస్తాం. అప్పటికీ వారు ముందుకు రాకపోతే వారి పింఛన్లను నిలుపుదల చేస్తాం. సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌లో అత్యధికంగా పులివెందులలోనే 1,708 మంది బోగస్ పింఛనుదారులు ఉన్నట్లు గుర్తించా'మన్నారు.

### అనర్హులకు సర్టిఫికెట్ ఇచ్చిన వైద్యులపై చర్యలు: అయ్యన్న

అనర్హులకు దివ్యాంగుల సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అర్హత లేకపోయినా ఇప్పటివరకూ పింఛన్లు తీసుకుంటున్న వారితో పాటు, వారికి సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులపైనా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆక్వా రంగానికి అండగా నిలుస్తాం

- ఆక్వా అడ్వయిజరీ కమిటీ సమావేశంలో లోకేశ్

మంగళగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆక్వా రంగానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అమెరికా ప్రతీకార సుంకాల నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్, వ్యవసాయ, మంత్రి అచ్చెన్నాయుడు నేతృత్వంలో బుధవారం ఆక్వా కల్చర్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో ఆక్వా ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, రైతులు, ఫీడ్ సంస్థలు, హేచరీస్ యజమానులు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ 'ఇప్పటికే ఆక్వా ఎగుమతులపై అమెరికా 25 శాతం సుంకాలను విధించింది. మరో 25శాతం సుంకాలు పెంచే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేద్దాం. సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుందాం. సీఎం కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు' అని తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దేశీయంగా రొయ్యల వినియోగం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను నియమించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధ్యక్షతన జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా విజయానంద్ స్పందిస్తూ.. ఉద్యోగుల ఆర్థికపరమైన అంశాలను గురువారం(ఈరోజు) జరిగే మంత్రివర్గ సమావేశానికి ముందే సీఎం దృష్టికి తీసుకెళ్తానని, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది తొలి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశమని, ఉద్యోగ సంఘాల నేతలు ప్రస్తావించిన అన్ని అంశాలను నమోదు చేసుకున్నామని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 8 గంటల వరకు జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న 14 సంఘాల నాయకులకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఆర్థికేతర సమస్యలపై 4 నుంచి 5 గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది. ఏపీఎన్జీజీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి మనోహర్, ఏపీ రెవెన్యూసర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ అధ్యక్షులు ప్రసాద్, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్‌లో ఉండడంతో సమావేశానికి ఆయనను అనుమతించలేదు. అయితే, ఉద్యోగిగా మాత్రమే తాను సస్పెన్షన్‌లో ఉన్నానని, సంఘం నేతగా కాదని వ్యాఖ్యానించారు. ఇక, ఈ సమావేశం అనంతరం ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు.



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

### నగదు రహిత వైద్యం: ఎన్జీజీవో

12వ పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని కోరినట్టు ఏపీ ఎన్జీజీవో సంఘం అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగులకు ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యానికి సంబంధించి చర్చించామన్నారు. 7 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన పర్మినెంట్ హామీని అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 4, 5 నెలలకు ఒకసారైనా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశామన్నారు. 24 ప్రధాన డిమాండ్లు, 68 డిపార్ట్‌మెంట్ అంశాలను ప్రస్తావించామన్నారు. గురుకుల సొసైటీల్లో ఉద్యోగులకు పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరామన్నారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్స్ ఉద్యోగులకు అమరావతి రాజధాని ప్రాంతంలోనే ఇంటి స్థలాలను కేటాయించేలా ఇచ్చిన జీవోను తక్షణమే అమలు చేయాలని కోరినట్టు తెలిపారు.

### క్యాబినెట్‌లో చర్చించమన్నాం: ఏపీటీఎఫ్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలపై గురువారం జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించి కొన్ని నిర్ణయాలైనా తీసుకోవాలని సీఎస్‌కు విన్నవించినట్లు ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు చెప్పారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని కోరినట్టు తెలిపారు.

### పే స్లిప్పుల్లో బకాయిలు: ఏపీ జేఏసీ

ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను పే-స్లిప్పుల్లో పేర్కొనేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలకు పథకాలను చేరవేసే ఉద్యోగుల గురించి ప్రభుత్వం ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు.

### ప్రణాళికతో చేయాలి: సూర్యనారాయణ

ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు సంబంధించి ఒక ప్రణాళిక ఇవ్వాలని కోరినట్టు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ తెలిపారు. గత జూన్ వరకు రూ.22 వేల కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, ప్రస్తుతం అవి రూ.33 వేల కోట్లకు చేరాయని చెప్పారు. ప్రతి ఉద్యోగికీ ఎంత బాకీ ఉన్నారన్న విషయాన్ని తేల్చాలని కోరినట్టు తెలిపారు.

## పెండింగ్ 'ఉపాధి' బిల్లులకు మోక్షం

- తాజాగా రూ.145 కోట్లు విడుదలకు రెడీ
- కాంట్రాక్టర్ల ఖాతాల్లో ఎల్లుండి నిధులు జమ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పెండింగులో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లుల చెల్లింపును ప్రస్తుత ప్రభుత్వం వేగవంతం చేసింది. 2014-19 మధ్య టీడీపీ హయాంలో చేసిన ఉపాధి పనులకు బిల్లుల చెల్లింపు కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వం అప్పట్లో చెల్లించాల్సిన బిల్లులను రాజకీయ కక్షతో నిలిపివేసింది. బిల్లులు ఇవ్వకపోగా పనులను కూడా నిలిపివేసింది. దీంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం పెండింగు బిల్లులపై దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సీఎం చంద్రబాబు ఈ విషయంపై పలుమార్లు చర్చించి నిధుల చెల్లింపునకు ఉన్న అడ్డంకులను తొలగించారు. అదేవిధంగా వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన 3,54,177 పనులను తిరిగి గాడిలో పెట్టడంతోపాటు బిల్లుల చెల్లింపును ప్రారంభించారు. ఈ ప్రక్రియపై సీఎం చంద్రబాబు సచివాలయంలో బుధవారం మరోసారి సమీక్షించారు. తొలుత రూ.179.38 కోట్ల బిల్లుల చెల్లింపునకు సంబంధించి కొన్ని పనులను ప్రస్తుతం కొనసాగుతున్నవిగా గుర్తించారు. వాటిని పక్కన పెట్టి, పనులు పూర్తయిన వాటికి రూ.145 కోట్ల మేరకు చెల్లింపునకు మార్గం సుగమమయ్యేలా సంబంధిత వివరాలను పంచాయతీరాజ్ శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ మొత్తానికి సంబంధించి ఆర్థికశాఖ ఎన్ఐసీకి నిధులు విడుదల చేసింది. పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లు, గ్రామస్థుల అక్కౌంట్లలో ఈ నెల 23న ఈ నిధులు జమకానున్నాయి. మరికొంత మొత్తానికి సంబంధించి పలు సాంకేతిక కారణాలతో చెల్లింపు ప్రక్రియ ఆగిపోయింది. వీటిపైనా కసరత్తు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

### మొత్తం పెండింగ్ రూ.329 కోట్లు

ఉపాధి పనులకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండానిలిపేసిన మొత్తాన్ని రూ.329 కోట్లుగా అధికారులు గుర్తించారు. ఇప్పటికే కొంత మేరకు చెల్లించారు. ఈ నెల 23వ తేదీన రూ.145 కోట్లను విడుదల చేయనున్నారు. ఈనిధులతో కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ.250 కోట్లను చెల్లించినట్లు అవుతుంది. ఫలితంగా చిన్న చిన్న పనులు చేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్న వారికష్టాలు తీరనున్నాయి.

## అనంత ఎమ్మెల్యేపై సీఎం సీరియస్

- పల్లాను కలసి వివరణ ఇవ్వాలని ఆదేశం

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం సీఎంను కలిసేందుకు వెంకటేశ్వర ప్రసాద్ సచివాలయానికి వచ్చారు. ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ పట్ల తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించగా... 'మీ వ్యాఖ్యలు, తీరు ఏమాత్రం సరికాదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాను కలసి వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యేను ఆదేశించారు. మంగళవారం అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి పల్లాను కలసి, నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను వివరించి వెళ్లారు. దీంతో బుధవారం వెంకటేశ్వర ప్రసాద్ హుటాహుటిన అమరావతి వచ్చి సీఎంను కలిసి, వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

### నేడు క్యాబినెట్ సమావేశం

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిమండలి సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు అమరావతిలోని సచివాలయంలో జరగనుంది. సీఆర్డీయే పరిధిలో భూకేటాయింపులకు సంబంధించి 51వ సీఆర్డీయే అథారిటీ ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలపనుంది.

### ఉనికి కోసమే వైసీపీ ఫేక్ ప్రచారం: శ్రీనివాసరెడ్డి



అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఫేక్ ప్రచారాల ద్వారా తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. అధికారం కోల్పోయి 11 సీట్లకు పరిమితమైనా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదు' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నిత్యం బురదజల్లే ప్రయత్నం చేస్తోందని అన్నారు.

### రాజీనామా చేసి రా.. జగన్..: బీటెక్ రవి



అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'పులివెందుల ప్రజలు జగన్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇంత వరకు అసెంబ్లీకి రాలేదు. పులివెందుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. ఇక పులివెందుల ప్రజలు జగన్‌కు ఎందుకు ఓటు వేస్తారు?' అని టీడీపీ నేత మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బీటెక్ రవి) ప్రశ్నించారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని ఆరోపిస్తున్న జగన్... ఎమ్మెల్యేగా రాజీనామా చేసి వస్తే పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ పడదామని రవి సవాల్ విసిరారు.

### సభాహక్కుల కమిటీకి కడప ఎమ్మెల్యే ఫిర్యాదు

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15న కడపలో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో తన విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదంటూ కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవీరెడ్డి సభా హక్కుల కమిటీకి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే అయిన తనకు కనీసం కుర్చీ ఏర్పాటు చేయకుండా అధికారులు అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### బేడ బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చండి: శబరి

న్యూఢిల్లీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బేడ బుడగ జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌ను ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. బుధవారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంలో బేడ బుడగ జంగం కులానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నారని, ఈ కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి ఎక్స్‌లో స్పందిస్తూ.. 'ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం, సాధికారతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి' అని శబరికి సూచించానన్నారు. కాగా, కేంద్ర మంత్రి దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లడంపై బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం అధ్యక్షుడు టీ మనోహర్.. శబరికి ధన్యవాదాలు తెలిపారు.

## జైలు నుంచి కాకాణి విడుదల

నెల్లూరు (క్రైం) ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్‌పై నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి బుధవారం విడుదలయ్యారు. కాకాణికి కుటుంబసభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు జైలు బయట స్వాగతం పలికారు. రుస్తుం మైన్స్ కేసులో సోమవారం హైకోర్టు అనేక నిబంధనలతో ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఇతర కేసుల్లో అప్పటికే ఆయనకు బెయిల్ మంజూరైంది. దీంతో జైలు నుంచి కాకాణి మంగళవారం విడుదలవుతారని అంతా భావించారు. అయితే బెయిల్ పత్రాలు సరైన సమయంలో జైలుకు అప్పగించక పోవడంతో బుధవారం వరకు జైల్లో ఉండాల్సి వచ్చింది. జైలు నుంచి బయటకు వచ్చాక కాకాణి మీడియాతో మాట్లాడారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేసినా తనను ఇబ్బందులు పెట్టాలన్న ఉద్దేశంతోనే విడుదల ఆలస్యం చేశారని విమర్శించారు. రానున్న రోజుల్లో అలుపెరుగని పోరాటం చేస్తామని జైలు, అరెస్టులు తమను ఆపలేవని చెప్పారు. అనంతరం కోర్టు నిబంధనల మేరకు నెల్లూరు జిల్లాలో ఉండకుండా విజయవాడకు వెళ్లారు.

## లిక్కర్ నిందితుల పిటిషన్లపై విచారణ వాయిదా

విజయవాడ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పైలా దిలీప్, సజ్జల శ్రీధర్ రెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణ గురువారానికి వాయిదా పడింది. బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ బెయిల్ పిటిషన్లపై విచారణ 22వ తేదీకి వాయిదా పడింది. లిక్కర్ కేసులో రూ.11 కోట్లు సీజ్ వ్యవహారంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కూడా కోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఇంటి నుంచి ఏ పూట భోజనం ఆ పూట అనుమతించాలని ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ 26కు, బాలాజీ కుమార్ యాదవ్ అరెస్టు సమయంలో సీజ్ చేసిన రూ.3 లక్షలపై దాఖలైన పిటిషన్‌పై విచారణ 21కి, వెంకటేశ్‌నాయుడు మొబైల్ ఫోన్‌ను తెరిచేందుకు అనుమతి ఇవ్వాలన్న సిట్ పిటిషన్‌పై విచారణ 25కి వాయిదా పడ్డాయి. తనకు ఇంటి నుంచి వారంలో మూడు రోజులపాటు అనుమతిస్తున్న భోజనానికి సంబంధించి వారాలను మార్చాలని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది.

## మాజీ మంత్రి అంబటిపై కేసు

గుంటూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు పాల్పడిందంటూ ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం చేసిన వైసీపీ నేత మాజీ మంత్రి అంబటి రాంబాబుపై నల్లపాడు పోలీస్‌స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదైంది. ప్రజలను మోసం చేయడానికి, వివిధ రాజకీయ వర్గాల మధ్య శత్రుత్వం, ద్వేషం, అనైతిక భావాలను సృష్టించడానికి ఉద్దేశించిన తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకు డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి అంబటి రాంబాబుపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.





ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము గ్రామం నుంచి పునరావాస కాలనీకి తరలివెళ్తున్న ప్రజలు, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి

# ఉధృతంగా కృష్ణా, గోదావరి

## భారీగా పెరిగిన వరద

- సాగర్ నుంచి 4.78 లక్షల క్యూసెక్కులు
- భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక
- ఏలూరు ఏజెన్సీ లోతట్టు ప్రాంతాలు జలమయం
- పునరావాస కాలనీలకు తరలుతున్న జనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదికి మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బుధవారం శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 4,61,639 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో నాగార్జునసాగర్ 26 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 583.70 అడుగులకు చేరింది. డ్యాంలో 293.68 టీఎంసీల నీరు ఉంది. మొత్తం 4,78,384 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు గోదావరి ఉపనదులు, కొండ వాగులు పొంగిపొర్లుతున్నాయి. కడెం, మంజీర, హరిద్ర, ఇంద్రావతి, మానేరు, ప్రాణహిత, కిన్నెరసాని, శబరి, సీలేరు ఉపనదులు పొంగి గోదావరిలో కలుస్తుండటంతో బుధవారం భద్రాచలం వద్ద నీటిమట్టం 45.40 అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. సాయంత్రానికి ఇది 47 అడుగులకు పెరిగింది. 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీచేస్తారు. భద్రాచలం నుంచి దిగువకు 10.7లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం 10.50 అడుగులకు చేరుకుంది. ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని పలు లోతట్టు ప్రాంతా లు నీట మునిగాయి. రేపాకగొమ్ము గ్రామస్థులను దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కుక్కునూరు మండలంలో కుక్కునూరు-దాచారం రహదారి ముంపునకు గురైంది. పోలవరం ప్రాజెక్టు నుంచి 8,78,421 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్వే ఎగువన 32.100 మీటర్లు, దిగువన 23.520 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఇక తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరుగుతుండటంతో 26 గేట్లను ఎత్తి 1.28 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో తుంగ, భద్ర జలాశయాలు నిండాయి.

## వర్షాలు తగ్గుముఖం

- 25 తర్వాత మళ్లీ అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. బుధవారం కోస్తా, రాయలసీమల్లో ఎక్కువ ప్రాంతాల్లో ఎండ కొనసాగింది. అక్కడక్కడ మాత్రం వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దక్షిణాది వైపు ఉన్న రుతుపవనద్రోణి తూర్పు భాగం గురువారం నుంచి ఉత్తరాది వైపుగా వెళ్లనుంది. దీంతో రానున్న నాలుగైదు రోజులపాటు వర్షాలు తగ్గుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 25 తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. దీంతో ఈనెల 26 తర్వాత వర్షాలు పెరుగుతాయని పేర్కొంది. ఇదిలావుండగా రానున్న 24 గంటల్లో కోస్తా, సీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలంగా గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. కృష్ణా, గోదావరి నదుల్లో ప్రవాహం పెరిగినందున లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

# టీచర్లకు అంతర్‌జిల్లాల బదిలీలు

- షెడ్యూలు, మార్గదర్శకాలు విడుదల
- నేటి నుంచి 24 వరకు దరఖాస్తులు
- 30 తర్వాత బదిలీల ఆదేశాలు జారీ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు అనుమతిస్తూ పాఠశాల విద్యా శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా ఆ శాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు షెడ్యూలు విడుదల చేశారు. అంతర్ జిల్లాల బదిలీలకు అర్హులైన టీచర్లు గురువారం(21) నుంచి 24వ తేదీ వరకు 'లీప్' యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆ దరఖాస్తుల ప్రింట్‌ను ఎంఈవోలకు సమర్పించాలని, వారు 22 నుంచి 25 వరకు పరిశీలిస్తారని పేర్కొన్నారు. అనంతరం వీటిని 26వ తేదీ వరకు డీఈవోలు పరిశీలించనున్నట్టు తెలిపారు. దరఖాస్తులను 27న పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్‌కు డీఈవోలు సమర్పిస్తారని, 28, 29 తేదీల్లో మరోసారి రాష్ట్రస్థాయిలో పరిశీలించి, తుది జాబితా రూపొందించనున్నట్టు వివరించారు. 30న ఆ జాబితాను ప్రభుత్వానికి సమర్పిస్తామని, ప్రభుత్వం అనుమతిచ్చిన తర్వాత బదిలీల ఆర్డర్లు జారీచేస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానంలో లీప్ యాప్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ స్పష్టం చేశారు. ఒక టీచర్ ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించలేరని తెలిపారు.

### ఇవీ అర్హతలు

- అంతర్ జిల్లా బదిలీలకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అర్హులు.
- ఈ ఏడాది జూలై 31 నాటికి ప్రస్తుత జిల్లాలో, ప్రస్తుత కేటగిరీలో కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తయి ఉండాలి.
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, యూనివర్సిటీలు, హెచ్‌వోడీలు, సచివాలయ, స్థానిక సంస్థల ఉద్యోగుల జీవిత భాగస్వాములు దరఖాస్తుకు అర్హులు. జిల్లాలో ఖాళీలుంటేనే దరఖాస్తు చేసుకోవాలి.
- హెచ్‌వోడీలు, సచివాలయ ఉద్యోగుల జీవిత భాగస్వాముల కోటాలో దరఖాస్తులకు కృష్ణా, గుంటూరు జిల్లాల వారు మాత్రమే అర్హులు.
- ఒకే కేటగిరీ, ఒకే మేనేజ్‌మెంట్‌లో పరస్పర బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు.
- పరస్పర బదిలీకి దరఖాస్తు చేసుకోవాలంటే ఇద్దరు టీచర్లు బదిలీకి సమ్మతి తెలుపుతూ, దానికి ఎంఈవో లేదా డీవైఈవో ఆమోదం పొందాలి.
- పరస్పర బదిలీల్లో ఒక టీచర్, ఇతర జిల్లాల్లో పనిచేసే మరో టీచర్‌తో బదిలీకి మాత్రమే సమ్మతి తెలపాలి.
- అనధికారికంగా సెలవులో ఉన్నవారు, ఏపీసీసీఏ రూల్స్ కింద అభియోగాలు నమోదైనవారు, సస్పెన్షన్‌లో ఉన్నవారు అనర్హులు.

## డీఎస్సీలో మెరిట్ లిస్ట్ విడుదల!


- పారదర్శకతకు విద్యాశాఖ పెద్దపీట
- జాబితాల విడుదలపై నేడు ప్రకటన

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025పై పాఠశాల విద్యాశాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఫలితాల విడుదల విషయంలోనూ పారదర్శకతకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పరీక్షలు రాసిన అభ్యర్థుల మెరిట్ లిస్టులు విడుదల చేయనుంది. తొలుత ఈ జాబితాలు వెల్లడించకుండా.. నేరుగా 'ఎంపిక జాబితా' ఇవ్వాలని నిర్ణయించింది. దీనిపై అభ్యర్థుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. పైగా, మెరిట్ జాబితా లేకుండా ఎంపిక జాబితాలు ప్రకటిస్తే అనేక అనుమానాలు తెరమీదికి వస్తాయి. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల విషయంలో మెరిట్ జాబితాలు లేకుండా నేరుగా ఉద్యోగాలకు ఎంపికైన వారి పేర్లు ప్రకటించారు. అప్పట్లో ఈ విధానంపై విమర్శలు వచ్చాయి. జిల్లాల వారీగా ఎవరు ఏ స్థానంలో ఉన్నారనే మెరిట్ జాబితా లేకపోతే తమకంటే ఎవరు ముందున్నారు, ఎవరు వెనుక ఉన్నారనే వివరాలు అభ్యర్థులు తెలుసుకోలేరు. ఈ నేపథ్యంలో డీఎస్సీలో మెరిట్ లిస్ట్ విడుదల చేయాలని తాజాగా నిర్ణయించారు. అయితే, ఆ జాబితాలు ఎప్పుడు ఇస్తారు?. సర్టిఫికెట్ల పరిశీలన జాబితాలు ఎప్పటి నుంచి?. అనే విషయాలపై గురువారం పాఠశాల విద్యా శాఖ ప్రకటన జారీ చేయనుంది.

# అందరి వాడిని

- ఏ పార్టీకీ చెందిన వ్యక్తిని కాదు
- ఉపరాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతం
- దేశంలో 64 శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు నాకు మద్దతునిస్తున్నాయి
- అర్హుడినే ఎన్నుకోవాలని ఎన్డీఏనూ కోరుతున్నా
- రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత నిర్వర్తించాను
- ఇప్పుడే ఆ బాధ్యత స్వీకరించేందుకే వచ్చాను
- దేశంలో పతనమవుతున్న రాజ్యాంగ విలువలు
- ఈసీ వివాదాల్లో చిక్కుకోవడం దురదృష్టకరం
- 'ఆంధ్రజ్యోతి'తో ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతమైనదని, రాజ్యాంగాన్ని పరిరక్షించే పదవి అని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. గతంలో వెంకయ్యనాయుడు బీజేపీకి రాజీనామా చేసిన తర్వాతే ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేశారని గుర్తు చేశారు. తాను ఏ పార్టీ వాడినీ కాదని, రాజ్యాంగంతో సుదీర్ఘమైన ప్రస్థానం ఉన్న తనకు అన్ని పార్టీలు మద్దతిస్తాయన్న ఆశాభావంతో ఉన్నానని తెలిపారు. గతంలో బీజేపీ ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ పారికర్ కూడా తనను లోకాయుక్తగా నియమించారని గుర్తు చేశారు. అర్హులైన వ్యక్తిని ఎంచుకోవాలని ఎన్డీఏ పార్టీలను కూడా కోరుతున్నట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తిగా ఐదున్నర దశాబ్దాలు రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యతనే నిర్వర్తించానని, ఇప్పుడు కూడా అదే బాధ్యత స్వీకరించేందుకు ముందుకొచ్చానని చెప్పారు. రాజ్యాంగమంటేనే సామాజిక న్యాయమని, రాజ్యాంగ పీఠికలో తొలి పదం సామాజిక న్యాయమని పేర్కొన్నారని చెప్పారు. ఈ మేరకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి బుధవారం 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధితో మాట్లాడారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అన్న పదాలతో సరిపెట్టకుండా.. అన్ని వర్గాలను కలుపుకొనిపోయే 'సౌహార్ద్ర భావం' అన్న పదం చేర్చారంటే రాజ్యాంగ నిర్మాతలు ఎంత ముందుచూపుతో ఆలోచించారో అర్థమవుతుందన్నారు. "ప్రస్తుత తరుణంలో దేశంలో రాజ్యాంగం పూర్తిగా విధ్వంసం అయిందని చెప్పలేను కానీ, రాజ్యాంగ విలువలు మాత్రం దాదాపు పతనమయ్యాయని చెప్పగలను. ఎన్నికల కమిషన్ సహా అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ కుప్పకూలిపోతున్నాయి. వాటిని పరిరక్షించాలంటే రాజ్యాంగ విలువల పట్ల పూర్తి నిబద్ధత, అవగాహన ఉన్న సరైన వ్యక్తులను వ్యవస్థల్లో నియమించాలి. వారిని నిర్ణయ క్రమంలో చేర్చాలి" అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగం కుప్పకూలిపోతే సంపన్నులకు, మధ్యతరగతికి జరిగే నష్టం తక్కువైనా.. అణగారిన వర్గాలు పూర్తిగా సాధికారత కోల్పోతాయని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నవారే రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారని తెలిపారు.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### అన్ని పార్టీల పట్ల సమాన దృక్పథం

రాజకీయ పార్టీల పట్ల సమాన దృక్పథంతో వ్యవహరిస్తూ సభను సజావుగా నడపాలన్నదే తన ధ్యేయమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో తనకు సత్సంబంధాలున్నాయని, వారు విజ్ఞులు, దూరదృష్టి గలవారని, సమాజం పట్ల పూర్తి అవగాహన ఉన్నవారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాకు సంబధించి ఎన్నికల కమిషన్ వివాదంలో ఇరుక్కోవడం గురించి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం రాక ముందే దేశంలో ఓటర్ల జాబితాను తయారు చేశారని, ఆ బాధ్యతను రాజ్యాంగ సలహాదారైన బీఎన్ రావుకు అప్పజెప్పారని తెలిపారు. ప్రస్తుతం జాబితాలో ఉన్నవారిని తొలగిస్తున్నారని, బీఎన్ రావు మాత్రం శరణార్థులను కూడా ఓటర్ల జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. 1928లో అన్ని పార్టీల సదస్సులోనే పేద, ధనిక, వర్గ తారతమ్యాలు లేకుండా అక్షరాస్యతతో నిమిత్తం లేకుండా సార్వత్రిక వయోజన ఓటింగ్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారని, ఈ మేరకు నెహ్రూ నివేదిక సమర్పించారని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అంతకన్నా పదేళ్ల ముందే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సౌత్‌బరో కమిటీ ముందు దళితులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని కోరారని వివరించారు. గాంధీజీ కూడా సార్వత్రిక వయోజన ఓటింగ్‌ను సమర్థించారని, ఈ విషయంలో గాంధీ, అంబేడ్కర్ ఏకీభావం వ్యక్తం చేశారని తెలిపారు. దేశ తొలి ఎన్నికల కమిషనర్ సుకోమల్ సేన్ కూడా నెహ్రూ కోరినా ఎన్నికలు జరిపేందుకు ఏడాదిపాటు సమయం తీసుకున్నారని, దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు శ్రమించారని వివరించారు ఇంతటి ఘనమైన చరిత్ర ఉన్న ఎన్నికల కమిషన్.. ఇప్పుడు రాజకీయ వివాదాల్లో చిక్కుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

### ఒప్పించే బాధ్యతను రేవంత్‌రెడ్డిపై పెట్టారు..

ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వంపై తనతో తొలుత కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ మాట్లాడారని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్‌చేసి 15 నిమిషాల్లో వస్తున్నానని చెప్పి ఆగమేఘాలపై వచ్చారని చెప్పారు. "మిమ్మల్ని ఒప్పించే బాధ్యతను నాపై పెట్టారు అని రేవంత్ అన్నారు. చివరగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంప్రదించారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థిగా మాత్రం నేను పోటీ చేయనని అందరికీ చెప్పాను. ఇండియా కూటమిలోని అన్ని పార్టీలతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా మద్దతిస్తుందని, అనేక ఇతర పార్టీలు కూడా మద్దతిస్తున్నాయని చెప్పినందుకే పోటీ చేసేందుకు ఒప్పుకొన్నాను. మిమ్మల్ని ఉపరాష్ట్రపతి పదవికి ఎంచుకోవడం మాకు గౌరవాన్ని కల్పించింది అని యుపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ అన్నారు" అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వివరించారు. దేశంలో 64 శాతం మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు తనను అభ్యర్థిగా నిలబెట్టాలని నిర్ణయించాయని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, ఎన్‌సీపీ నేత శరద్ పవార్‌తోపాటు అన్ని పార్టీల నేతలు తనకు మద్దతు ప్రకటించారని చెప్పారు. గెలుపోటములనేది ప్రశ్నే కాదని, ఉపరాష్ట్రపతి పదవికి జరిగే పోటీని సైద్ధాంతిక సమరంగా భావిస్తున్నామని ఖర్గే చెప్పినట్లు తెలిపారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.